www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI వెల (Price) : Rs. 6.50 సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 50 పేజీలు: 14
గురువారం 5-6-2025
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: దశమి రా.2:16 తదుపరి ఏకాదశి, నక్షత్రం: హస్త పూర్తి, వర్జ్యం: మ.1:02-2:50, దుర్ముహూర్తం: ఉ.10:03-10:55, మ.3:15-4:07, అమృతఘడియలు: రా.11:49-1:37, రాహుకాలం: మ.1:30-మ.3:00, సూర్యోదయం: 5:43, సూర్యాస్తమయం: 6:43
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద భారీగా అభిమానులు



విజయోత్సవాల్లో విషాదం!

బెంగళూరు 'చిన్నస్వామి'లో తొక్కిసలాట

11మంది మృత్యువాత

2

ఐపీఎల్ గెలిచిన ఆర్సీబీ ఆటగాళ్లను చూసేందుకు పోటెత్తిన అభిమానులు

గేట్లు తీయడంతో భారీగా తొక్కిసలాట

మృతుల్లో నలుగురు మహిళలు.. 33 మందికి గాయాలు



తొక్కిసలాటలో స్పృహ తప్పిన బాలుడిని కాపాడే యత్నం

ఓట్లకు కోట్లు..

మద్యం ముడుపులతో ఓట్ల కొనుగోలు!

ఇద్దరు అభ్యర్థులకు ముడుపులపై కీలక ఆధారాలు

హైదరాబాద్ నుంచి సూర్యాపేట దాకా తరలింపు

అక్కడి నుంచి కార్లలో మార్పి.. నియోజకవర్గాలకు

తెచ్చి ఇచ్చింది.. రాజ్ కసిరెడ్డి డ్రైవర్, సహాయకుడు

తీసుకున్నది ఒక ఎంపీ అభ్యర్థి గన్‌మ్యాన్, మరో అభ్యర్థి డ్రైవర్.. వారి నుంచి వివరాలు రాబట్టిన సిట్

ఈసీకి పట్టుబడ్డ రూ.8 కోట్లు ఈ ఖాతాలోవే

ఆ ఇద్దరు నేతలనూ విచారణకు పిలిచే అవకాశం

వైసీపీ ఎంపీ అభ్యర్థులకు లిక్కర్ కమీషన్ సొమ్ములు

'సిట్' దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముడుపులు రాబట్టాలి... మళ్లీ గెలవాలి! లిక్కర్ కిక్కులో వచ్చిన సొమ్ములను ఎన్నికల ఖర్చులకు వాడాలి!... మద్యం స్కామ్‌పై ఇప్పటి దాకా నెలకొన్న బలమైన అనుమానాలివి! ఇది అక్షరాలా నిజమని నిరూపించే తిరుగులేని ఆధారాలను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సేకరించింది. ఎన్నికల ముందు ఇద్దరు వైసీపీ ఎంపీ అభ్యర్థులకు హైదరాబాద్ నుంచి ముడుపుల మూటలు చేరవేసినట్లు తేల్చింది. ఆ ఇద్దరు... అంతకుముందు ఎమ్మెల్యేగా ఉండి 2024 ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వారొకరు... సిట్టింగ్ ఎంపీగా ఉండి, మరో సారి ఎంపీగా బరిలో నిలిచిన వారొకరు! వీరిద్దరికీ డబ్బులు చేరిన 'దారుల'ను సిట్ గుర్తించింది. హైదరాబాద్ నుంచి డబ్బుల సంచులు తీసుకొచ్చిన వారిలో కొందరిని 'సిట్' అధికారులు ప్రశ్నించి

మిగతా 14వ పేజీలో...

కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు

సిట్ ముందుకు వైవీ సుబ్బారెడ్డి పీఏ

టీటీడీ మాజీ చైర్మన్ వ్యవహారాల్లో అప్పన్నదే కీలక పాత్ర.. తిరుపతిలో విచారిస్తున్న సీబీఐ

త్వరలో ఇద్దరు ముఖ్యులకు నోటీసులు

సార్@ బెంగళూర్



వెన్నుపోటు దినం నిరసనలకు పిలుపిచ్చి జగన్ డుమ్మా 12

అధ్యక్షుడి తీరుపై పార్టీ నేతల్లో అసహనం

వైసీపీ జగన్ వెన్నుపోటు అంటూ ఆగ్రహం

జిల్లాల్లో నిరసన ప్రభావం అంతంతే



12

కర్నూలులో టీడీపీ కార్యకర్తల ప్రదర్శన

అరాచక పాలన అంతమై ఏడాది!

రాష్ట్రవ్యాప్తంగా కూటమి కార్యక్రమాలు

బాణసంచా కాల్చిన పార్టీల నేతలు

పలు ప్రాంతాల్లో భారీ ర్యాలీలు

కర్నూలులో గొడ్డళ్లతో శ్రేణుల నిరసన

వివేకా హత్యను గుర్తుచేసిన కార్యకర్తలు



కూటమి ఘన విజయం సాధించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రివర్గ భేటీలో సీఎం చంద్రబాబును అభినందిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అచ్చెన్న, నాదెండ్ల, అనిత, లోకేశ్

నేరస్థులకు నేరగాడి అండ

గత ప్రభుత్వ అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోంది. నేరం రుజువయ్యాక ఎవరినీ ఉపేక్షించేది లేదు. అయితే రాజకీయ కక్ష సాధింపు మన విధానం కాదు. -చంద్రబాబు

రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు: చంద్రబాబు

ఒకప్పుడు క్రిమినల్స్‌ను కలవడానికి నాయకులు భయపడేవారు

ఇప్పుడు నిస్సిగ్గుగా కలవడమే కాదు.. వారి దన్నుతో రాజకీయం చేస్తున్నారు

వైసీపీ వారు వేధించారని మనమూ వారిని వేధించడం సరికాదు

తప్పు చేశారని రుజువైతే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు

అదే మన విధానం..

కక్ష సాధింపులు మన పద్ధతి కాదు

క్యాబినెట్ భేటీలో సీఎం స్పష్టీకరణ


అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సీఎం జగన్ నేరపూరిత రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి వారితో చాలా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. 'విజయ్ మాల్యా లాంటి ఆర్థిక నేరగాళ్ల శిక్ష నుంచి

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రంలో క్వాంటమ్ మిషన్

17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష

మహిళా ఉద్యోగులు ఫ్యాక్టరీల్లో ఇకపై రాత్రిళ్లూ పనిచేసే చాన్సు.. క్యాబినెట్ నిర్ణయాలు



2027 మార్చి 1 నుంచి జనగణన

దేశవ్యాప్తంగా కులగణన కూడా

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

2 దశల్లో జరగనున్న జనాభా లెక్కల సేకరణ

ఈ నెల 16న గెజిట్‌లో ప్రచురణ

జనగణన అనంతరం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన?

ఇప్పటికే దీనిపై దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరం



న్యూఢిల్లీ, జూన్ 4: దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణకు కేంద్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. మార్చి 1, 2027 నుంచి దేశంలో 16వ జనగణనను చేపట్టనున్నట్లు తెలిపింది. జనగణనతో పాటే కులగణన కూడా చేపడతామని తెలిపింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ బుధవారం షెడ్యూల్ ప్రకటించింది. రెండు దశల్లో జనాభా లెక్కలు సేకరించనున్నట్లు వివరించింది. అయితే హిమపాతం ఎక్కువగా ఉండే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో

మిగతా 2వ పేజీలో...

ఉక్కు, అల్యూమినియంపై సుంకం 25 నుంచి 50 శాతానికి!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో నిర్ణయం

మున్ముందు భారత్ ఎగుమతులపై ప్రభావం

పెంపు నుంచి బ్రిటన్‌కు మినహాయింపు 2

తప్పుడు ఇంజెక్షన్‌తో ఆరుగురి మృతి!

ఒడిశాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం 2

నర్సు నిర్లక్ష్యమే కారణమన్న బంధువులు

కుమారుడి ముక్కు నోటికి ప్లాస్టర్

నాలుగేళ్ల కొడుకును చంపి.. ఆపై తల్లి ఆత్మహత్య

కుటుంబ కలహాలతో ఉరివేసుకున్న మహిళ

కాకినాడలో విషాద ఘటన.. కేసు నమోదు 3

తప్పుడు ఇంజెక్షన్‌తో ఆరుగురి మృతి?

» ఒడిశాలోని ఓ ఆస్పత్రిలో దుర్ఘటన.. విచారణకు కమిటీ

కోరాపూట్, జూన్ 4: ఒడిశాలోని ఒక ఆసుపత్రిలో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఆరుగురు రోగులు కొన్ని గంటల వ్యవధిలో అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. సిబ్బంది ఇచ్చిన తప్పుడు ఇంజెక్షన్ కారణంగానే ఈ మరణాలు సంభవించాయని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఒడిశాలోని కోరాపూట్ జిల్లాలోని షహీద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఆపరేషన్ తరువాత కూడా తమ వారు ఆరోగ్యంగానే ఉన్నారని కానీ ఓ నర్సు వచ్చి ఇంజెక్షన్ ఇచ్చిన తరువాతే ప్రాణాలు కోల్పోయినట్లు ఓ మృతుని కుటుంబసభ్యులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై హాస్పిటల్ సూపరింటెండెంట్ సుశాంత కుమార్ స్పందిస్తూ మృతిచెందిన వారందరూ కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. మరోవైపు ఒడిశా ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఓ కమిటీని ఏర్పాటు చేసింది.

అల్యూమినియంపై సుంకం 50 శాతానికి పెంపు

న్యూఢిల్లీ, జూన్ 4: ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకాలను 25శాతం నుంచి 50శాతానికి పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సంబంధిత పత్రాలపై మంగళవారం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. ఈ ఉక్కు, అల్యూమినియం సుంకాల పెంపు నుంచి బ్రిటన్‌ను ట్రంప్ మినహాయించారు. మిగతా దేశాలకు ఈ నిర్ణయం తక్షణమే వర్తిసుందని అమెరికా ప్రకటించింది. ఈ సుంకాల పెంపు ప్రభావం భారత ఎగుమతులపై తీవ్రంగా ఉండనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బ్రిటన్ తరహాలో సుంకాల నుంచి మినహాయింపును భారత్ కోరాలని.. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు జరిగే సమయాల్లో ఈ విషయాన్ని అమెరికా దృష్టికి తేవాలని ఈఈపీసీ ఛైర్మన్ పంకజ్ చద్దా పేర్కొన్నారు.

రీల్స్ చేస్తూ నదిలో మునిగి ఆరుగురి మృతి

ఆగ్రా, జూన్ 4: ఆగ్రా సమీపంలో విషాదం చోటుచేసుకుంది. యమునా నదిలో రీల్స్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు బాలికలు మృతి చెందారు. నలుగురు బాలికలు అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న ఇద్దరిని గ్రామస్థులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ వారు కూడా మరణించారు. బాలికలు నదిలోకి దిగడానికి ముందు ఒడ్డున వీడియోలు చిత్రీకరించినట్లు సాక్షులు తెలిపారు. ఆ ఆరుగురు బాలికలు ఒకే ఉమ్మడి కుటుంబానికి చెందిన వారు.

ముజిబుర్ రహ్మాన్ ఇక బంగ్లా జాతిపిత కాదు!

ఢాకా, జూన్ 4: బంగ్లాదేశ్ జాతిపితగా బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ పేరును తాత్కాలిక ప్రభుత్వం తొలగించింది. దీంతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల నిర్వచనాన్నే మార్చేస్తూ చట్టానికి సవరణలు చేసింది. బంగ్లాదేశ్ న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసినట్టు బుధవారం మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇటీవలే కరెన్సీ నోట్లపై కూడా మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రహ్మాన్ ఫొటోను తొలగించింది.

24 గంటల్లో 864 కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 4: దేశంలో గడచిన 24 గంటల్లో 864 కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం క్రియాశీలక కేసుల సంఖ్య 4,302కు చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కోవిడ్ సంబంధిత కారణాలతో ఈ ఏడాది మరణాల సంఖ్య 44కు చేరింది. మరోవైపు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది.

9 నుంచి టీచర్లకు పాఠశాల సన్నద్ధత శిక్షణ

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు పాఠశాలల సన్నద్ధత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇంతకుముందు జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. ఈ పాఠశాలల రెడీనెస్ ప్రోగ్రాం కోసం గురువారం నుంచే ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున ఈనెల 9 నుంచి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సనాతన ధర్మం పాటించే వారిని శిక్షించాలి

» పవన్ 3 పెళ్లిళ్లపై అందుకే స్పందించా: సీపీఐ నేత నారాయణ

హైదరాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్లపై తాను గతంలో మాట్లాడలేదని, ఆయన సనాతన ధర్మాన్ని నెత్తికెక్కించుకున్న తర్వాత తాను ఆ వ్యాఖ్యలు చేసిన మాట వాస్తవమన్నారు. పవన్ కల్యాణ్‌తోపాటు అరాచకమైన, క్రూరమైన సనాతన ధర్మాన్ని పాటించే ప్రతి ఒక్కరిని శిక్షించాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సనాతన ధర్మంలో విడాకులే లేనప్పుడు.. పవన్ కల్యాణ్ తన భార్యలకు ఎలా విడాకులిచ్చారని ప్రశ్నించారు.

2027 మార్చి 1 నుంచి జనగణన

(మొదటి పేజీ తరువాయి)

2026 అక్టోబరు 1 నుంచి జనగణన ప్రారంభమవుతుందని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. మొత్తం మీద దేశంలో 16 ఏళ్ల తర్వాత జనగణన జరగనుంది. సామాజిక, ఆర్థిక వివరాలతో సమగ్రంగా జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలిసారిగా పౌరులే స్వయంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకొనే అవకాశం కల్పించనున్నారు. జనాభా లెక్కల సేకరణకు రూ.13 వేల కోట్లకు పైగా వెచ్చించనున్నారు. ఈ భారీ ప్రక్రియలో 30 లక్షల మందికి పైగా ఎన్యూమరేటర్లు, వారి సూపర్‌వైజర్లు పాల్గొననున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జనగణన షెడ్యూల్‌పై జనాభా లెక్కల చట్టం 1948లోని సెక్షన్ 3 ప్రకారం ఈ నెల 16న అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. దేశంలో చివరి సారిగా 2011లో రెండు దశల్లో జనాభా లెక్కలను సేకరించారు. నాటి లెక్కల ప్రకారం దేశ జనాభా 121 కోట్లు. నాటి యూపీఏ సర్కారు జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేశారు. కానీ, ఇప్పటికీ ఆ వివరాలను వెల్లడించలేదు. ఇటీవల బిహార్, తెలంగాణ రాష్ట్రాల్లో కులగణన సర్వే చేశారు. దేశవ్యాప్తంగా పదేళ్లకోసారి జనగణన చేపట్టాల్సి ఉండగా.. 2021లో కూడా అందుకోసం అన్ని ఏర్పాట్లూ చేశారు. కానీ, కరోనా కారణంగా జనగణన ప్రక్రియను వాయిదా వేశారు. కాగా, దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలంటే కులగణన కూడా చేయాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన కూడా చేసేందుకు అంగీకరించింది. 2027లో జనగణన పూర్తయిన తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన కూడా చేపట్టే అవకాశం ఉంది. దీనిపై దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

విజయోత్సవాల్లో విషాదం!



చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట

'చిన్నస్వామి'లో తొక్కిసలాట.. 11మంది మృత్యువాత.. 33 మందికి గాయాలు

బెంగళూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో బుధవారం తలపెట్టిన ఐపీఎల్ విజయోత్సవ వేడుకల్లో ఘోర విషాదం సంభవించింది. పరిమితికి మించి వేలాదిగా క్రికెట్ యువ అభిమానులు పోటెత్తడంతో చిన్నస్వామి స్టేడియం గేట్ల వద్ద భారీగా తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది మృత్యువాతపడ్డారు. 33మంది గాయపడ్డారు. బెంగళూరు జట్టు (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు) 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ కప్‌ను గెలుచుకుంది. ఈ సందర్భంగా బెంగళూరులో పలు కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆర్‌సీబీ క్రికెటర్లు సాయంత్రం 6గంటలకు స్టేడియానికి చేరుకుంటారని నిర్వాహకులు ప్రకటించారు. స్టేడియం సామర్థ్యం 30-40 వేలు. కానీ, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పటీదార్ సహా తమ అభిమాన ఆటగాళ్లను ప్రత్యక్షంగా చూసేందుకు మధ్యాహ్నం ఒంటి గంటకే లక్షమంది తరలివచ్చారని సమాచారం. మరో మూడు గంటల్లో ఇంకో లక్షమంది అక్కడకు చేరుకున్నారు. వారిని నిర్వాహకులు, పోలీసులు అదుపు చేయలేకపోయారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. కార్యక్రమ వివరాలను ముందుగా అందించకపోవడం, అభిమానులకు నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో ఈ దారుణం చోటుచేసుకుందని సమాచారం. మృతులలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు.



స్టేడియం కాదు.. జన సంద్రమే..

షెడ్యూల్ ప్రకారం బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అహ్మదాబాద్ నుంచి ఆర్‌సీబీ క్రికెటర్లు బెంగళూరు చేరుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు స్టేడియం సమీపంలోని విధానసౌధ తూర్పు ద్వారం వద్ద ఐపీఎల్ విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం సన్మానం ఏర్పాటు చేసింది. అక్కడికీ వేలాదిమంది వెళ్లారు. మరోవైపు, చిన్నస్వామి స్టేడియం చుట్టూ ఎటుచూసినా రెండు కిలోమీటర్ల మేర ఇసుకేస్తే రాలనంతమంది జనం కనిపించారు. వీరందరూ సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత స్టేడియం గేట్ల వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న వారి సంఖ్య లక్ష దాటిందని సమాచారం. అయితే, నిర్వాహకులు ఇదేం పట్టించుకోకుండా ఒక్కసారిగా 3, 12, 18, 19, 20 నంబరు గేట్లన్నింటినీ తెరిచారు. అంతే... వేలాదిమంది దూసుకుపోయారు. ఈ క్రమంలో చాలామంది కిందపడ్డారు. వారిని తొక్కుకుంటూ మిగతావారు ముందుకెళ్లారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకుని లాఠీచార్జి చేశాయి. భారీగా జనం నిండిపోవడంతో అంబులెన్స్‌లు సకాలంలో చేరుకోలేకపోయాయి. దీంతో గాయపడినవారిని చేతులపై ఎత్తుకుని సమీపంలోని వైదేహి ఆస్పత్రి వైపు పోలీసులు పరుగెత్తారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగానే నలుగురు మృతి చెందారు. శివాజీ నగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించిన 24మందిలో ఏడుగురు మృతి చెందారు.



చిన్నస్వామి స్టేడియం గేటు వద్ద అభిమానుల అవస్థలు

న్యాయ విచారణకు సిద్దరామయ్య ఆదేశం

చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట సంఘటనపై న్యాయ విచారణ జరిపిస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. ఊహించినదానికంటే ఎక్కువ జనం రావడంతోనే ప్రమాదం జరిగిందని, బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు విఫలమయ్యారన్నారు. మృతులకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు ఉచిత వైద్యం అందిస్తామని సీఎం తెలిపారు.



బెంగళూరు విధాన సౌధ వద్ద కిక్కిరిసిన అభిమానులు

అస్తవ్యస్తం.. గందరగోళం..

విధానసౌధ తూర్పుద్వారం వద్ద ఆర్‌సీబీ జట్టు క్రీడాకారులను సన్మానించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అక్కడికి వేలాది మంది తరలివచ్చారు. రోడ్డును పూర్తిగా బ్లాక్ చేశారు. విధానసౌధకు దాదాపు 15 అడుగులకు పైగా ఎత్తైన గేట్‌లు ఉన్నాయి. వాటిపైకి ఎక్కి అవతలకు వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. విధానసౌధ వద్దకు నాలుగైదువేలమంది వస్తారని అంచనా వేశారు. కానీ 60వేలమందికి పైగా జనం చేరడంతో పోలీసులు నియంత్రించలేకపోయారు. విధానసౌధ లోపలికే వేలాది మంది వివిధ మార్గాల ద్వారా చేరుకున్నారు. దీంతో జట్టు సభ్యులను సన్మానించే కార్యక్రమాన్ని గందరగోళంగా ముగించారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు అక్కడ ఉండగానే.. చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట విషయం తెలిసింది. దీంతో ప్రసంగాలు లేకుండా సన్మాన కార్యక్రమాన్ని కొద్దిసేపట్లోనే ముగించారు. కాగా, తొక్కిసలాట తరువాత స్టేడియంలో వేచియున్న వేలాది మంది కోసం క్రికెటర్లు తరలివచ్చారు. చిన్నస్వామి స్టేడియంలో విరాట్ కోహ్లీ, రజత్ పటీదార్ అభిమానులనుద్దేశించి మాట్లాడారు. గంటన్నరకుపైగా జరగాల్సిన కార్యక్రమాన్ని కొన్ని నిమిషాలలోనే ముగించుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా దేశంలోని పలు చోట్ల అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. విజయవాడలో విజయోత్సవ ర్యాలీలో బైక్‌తో పాల్గొన్న యువకుడు కారు ఢీ కొనడంతో చనిపోయాడు. కర్ణాటకలో ఒకరు గుండెపోటుతో, మరొకరు యాక్సిడెంట్‌లో చనిపోయారు.



స్వదేశీ ఆయుధాలతో సత్తా చాటాం

» కేంద్ర మంత్రివర్గ భేటీలో ప్రధాని మోదీ వెల్లడి

» ఆపరేషన్ సిందూర్‌పై రక్షణ శాఖ ప్రజెంటేషన్



న్యూఢిల్లీ, జూన్ 4: మన దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలతో ఆపరేషన్ సిందూర్‌లో సత్తా చాటామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కాలానుగుణంగా యుద్ధతంత్రాలు మారుతూ వస్తున్నాయని.. ఇక ముందు భారత్‌లో 'మేకిన్ ఇండియా' ఆయుధాలు, వ్యవస్థలకే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీ నేతృత్వంలో మూడున్నర గంటల పాటు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మంత్రులతో భేటీ ఇదే తొలిసారి కూడా. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో భారత్ చూపిన సత్తాపై ఈ భేటీలో ఒక ప్రజెంటేషన్ ఇచ్చినట్టు సమాచారం. మన రక్షణ శాఖ చెప్పినదానికంటే ఎక్కువగా నష్టం జరిగినట్టుగా పాకిస్థాన్ స్వయంగా బయటపెట్టిన అంశాన్ని కూడా ఇందులో ప్రస్తావించినట్లు తెలిసింది. ఇక ప్రధాని మోదీ నేతృత్వంలో మూడోసారి సర్కారు ఏర్పాటై ఈ నెల 9వ తేదీకి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో.. వివిధ మంత్రిత్వ శాఖలు సాధించిన విజయాలపై మరో ప్రజెంటేషన్ కూడా ఇచ్చినట్టు సమాచారం. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, జలశక్తి శాఖ విజన్ 2047 ప్రణాళికలను వివరించినట్టు తెలిసింది. మరోవైపు దేశంలో ఏటేటా పెరిగిపోతున్న ఊబకాయం సమస్య, ఆరోగ్యకర జీవన శైలిని అనుసరించాల్సిన అవసరంపై ఆరోగ్య శాఖ ప్రజెంటేషన్ ఇచ్చినట్టు సమాచారం.

పాక్‌కు ఆసియా బ్యాంకు రూ.6,869 కోట్ల సాయం!

న్యూఢిల్లీ, జూన్ 4: పాకిస్థాన్‌కు అంతర్జాతీయ రుణ సంస్థలు ఏ సాయం చేయొద్దంటూ భారత్ పదే పదే కోరుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. గత నెలలోనే ఐఎంఎఫ్ పాక్‌కు రూ.8,500 కోట్ల ప్యాకేజీ ప్రకటించగా.. తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కూడా 800 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,869 కోట్ల) రుణం మంజూరు చేసింది. అయితే.. దీన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. పాక్‌కు అందుతున్న నిధులు దారి మళ్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బీజేపీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. పాక్‌కు నిధులు వెళ్లకుండా అడ్డుకోవడం చేతగావట్లేదంటూ ఆక్షేపించింది. 'ఈ నెల 1న ఏడీబీ అధ్యక్షుడు మసాటో కందాను మోదీ కలిశారు. ఆ తర్వాత 3రోజులకే ఏడీబీ పాక్‌కు రుణం మంజూరు చేసింది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది.

పాకిస్థాన్‌కు మలేసియా షాక్

న్యూఢిల్లీ, జూన్ 4: 'ఆపరేషన్ సిందూర్' అనంతరం.. పాకిస్థాన్ వైఖరిని, ఆ దేశం ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఎలా మారిందన్న విషయాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని బృందం మలేషియాకు చేరింది. అయితే.. ఈ బృందాన్ని దేశంలోకి రానివ్వద్దని మలేషియాకు పాకిస్థాన్ విన్నవించింది. "మాది ఇస్లామిక్ దేశం, మీది కూడా ఇస్లామిక్ దేశం. భారత ప్రతినిధి బృందం చెప్పే మాటలు వినొద్దు. వారి కార్యక్రమాలను రద్దు చేయండి. ప్రస్తుతం కశ్మీర్ వ్యవహారం ఐక్యరాజ్యసమితి పరిధిలో ఉంది." అని పాక్ దౌత్యాధికారి మలేషియాకు వివరించారు. అయితే.. మలేషియా మాత్రం పాక్ విన్నపాన్ని బుట్టదాఖలు చేసింది. మీది-మాది ఇస్లామిక్ దేశమేనన్న వాదనను కూడా కొట్టివేసింది. భారత ప్రతినిధి బృందం నిర్వహించే 10 కార్యక్రమాలకు అనుమతిచ్చింది.

సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం

వాక్ స్వాతంత్ర్యం కాదు

రాహుల్‌పై అలహాబాద్ హైకోర్టు ఫైర్.. సమన్ల రద్దు పిటిషన్ కొట్టివేత

లఖ్‌నవూ, జూన్ 4: భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైనికులనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. వాక్ స్వాతంత్ర్యం అంటే సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం కాదని స్పష్టంచేసింది. 2022లో రాజస్థాన్‌లో జోడో యాత్ర సందర్భంగా రాహుల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జనం జోడో యాత్ర గురించి, అశోక్ గహ్లోత్ (నాటి రాజస్థాన్ సీఎం), సచిన్ పైలట్ (కాంగ్రెస్‌లో ఆయన ప్రత్యర్థి) గురించి అక్కడక్కడా అడుగుతుంటారు. కానీ చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించుకుందని గానీ, 20 మంది భారత సైనికులను చంపిందని గానీ, అరుణాచల్ ప్రదేశ్‌లో మన జవాన్లను చావబాదుతోందని గానీ అడుగరు. వీటిపై భారతీయ మీడియా ఒక్క ప్రశ్న కూడా వేయదు. నిజమా కాదా' అని వ్యాఖ్యానించారు. ఆర్మీ పరువుకు భంగం కలిగించేలా రాహుల్ పదే పదే మాట్లాడారంటూ సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) మాజీ డైరెక్టర్ ఉదయశంకర్ శ్రీవాస్తవ ఫిర్యాదు చేశారు. దీనిపై లఖ్‌నవూ కోర్టు రాహుల్‌కు సమన్లు జారీచేసింది. ఈ సమన్లను రాహుల్ అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. 'రాజ్యాంగంలోని 19(1ఏ) అధికరణ వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ హక్కు ఇస్తోంది. అయితే ఇది సహేతుక ఆంక్షలకు లోబడి ఉంటుంది. భారత సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసే స్వేచ్ఛ ఈ హక్కులో భాగం కాదు' అని తేల్చిచెప్పింది. ఫిర్యాదుదారు భారత సైన్యంలో అధికారి కాదని.. బాధితుడు కూడా కాదన్న రాహుల్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. లఖ్‌నవూ కోర్టు జారీచేసిన సమన్లను రద్దు చేయాలన్న రాహుల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

కశ్మీర్‌పై మా ప్రయత్నాలు విఫలం: భుట్టో

కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తడానికి తాము చేసిన ప్రయత్నాలకు ఎదురుదెబ్బలు తగిలాయని పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావర్ భుట్టో అంగీకరించారు. ఐక్యరాజ్యసమితి వేదికపైనా, బయట కూడా ఈ విషయంలో తమ ప్రయత్నాలేవీ ఫలించలేదని ఆయన తెలిపారు. మరోవైపు, భారత్‌పై విషం చిమ్మాలని ప్రయత్నించి విదేశీగడ్డపై మరోసారి పాకిస్థాన్ భంగపడింది. భారత్‌లోని ముస్లిములను దుష్టులుగా చిత్రీకరించడానికి పహల్గాం దాడిని ఆ దేశం రాజకీయ సాధనంగా వాడుకుంటున్నదని బిలావర్ భుట్టో వ్యాఖ్యానించారు. అయితే, భారత సైనికాధికారుల్లో ముస్లింలు కూడా ఉన్నారు కదా అంటూ బిలావర్‌ను ఓ అమెరికా జర్నలిస్టు ప్రశ్నించడంతో ఆయన నోరు మూతబడింది. ఆపరేషన్ సిందూర్‌పై మిలిటరీ ప్రెస్ బృందంలో సోఫియా ఖురేషీ కూడా ఉన్న విషయం పరోక్షంగా గుర్తుచేశారు. దీంతో మాన్పడిపోయిన బిలావర్ ఉక్రోషంతో భారత్‌పై అవాకులుచెవాకులు మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో బిలావర్ భుట్టో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ఘటన జరిగింది.



జూలై 21 నుంచి పార్లమెంటు

న్యూఢిల్లీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. వచ్చే నెల 21న ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశం అవుతాయని ఆయన వెల్లడించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంట్ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. కాగా పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని లోక్‌సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా పలువురు ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రధాని మోదీకి లేఖలు రాశారు. కేంద్రం దీనికి సానుకూలంగా స్పందించలేదు. మరోవైపు మంగళవారమే ఢిల్లీలో విపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన(యూబీటీ) తదితర ప్రతిపక్ష పార్టీలు ప్రధాని నరేంద్ర మోదీకి సంయుక్తంగా లేఖ రాశాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆ లేఖలో డిమాండ్ చేశాయి. ఆ పార్టీలు లేఖ రాసిన మరుసటి రోజే జూలై 21 నుంచి వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఈ సమావేశాల్లో ప్రధానంగా పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటన, జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు, జనగణన, కులగణన తదితర అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తే అవకాశం ఉంది.

ఫంగస్‌తో వ్యవసాయ ఉగ్రవాదం!?

ప్రమాదకర ఫంగస్‌ను స్మగుల్ చేస్తున్న ఇద్దరు చైనా పరిశోధకులను అరెస్టు చేసిన అమెరికా

» 'ఫుసేరియం గ్రామినియరం'గా పిలిచే ఈ ఫంగస్‌తో గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ పంటలకు తీవ్ర నష్టం

న్యూఢిల్లీ, జూన్ 4: అదో ప్రమాదకర ఫంగస్.. బయటికి వ్యాపించిందంటే వేలు, లక్షల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం.. దీనితో దిగుబడి, నాణ్యత తగ్గడమేకాదు.. ఆ పంట ఉత్పత్తులను వినియోగిస్తే మనుషులకూ ప్రమాదం.. మనలో కాలేయం, ప్రత్యుత్పత్తి వ్యవస్థలపై తీవ్ర ప్రభావం కూడా.. ఇలాంటి విషపూరిత ఫంగస్‌ను అమెరికాలోకి అక్రమంగా తీసుకెళ్తూ ఇద్దరు చైనా పరిశోధకులు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐకి పట్టుబడ్డారు. 'ఫుసేరియం గ్రామినియరం'గా పిలిచే ఈ ఫంగస్ 'వ్యవసాయ ఉగ్రవాదం (ఆగ్రో టెర్రరిజం)' కోసం ఆయుధంగా ఉపయోగించే అవకాశం ఉందంటూ ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసింది. ఇది దేశ భద్రతకు ముప్పు అని పేర్కొంది. దీంతో ఈ ఫంగస్, వ్యవసాయ ఉగ్రవాదం అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

మిషిగన్ వర్సిటీ ల్యాబ్‌కు తీసుకెళ్తున్నామని..

చైనాలోని ఝెజియాంగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్త జున్‌యోంగ్ ల్యూ (34)తోపాటు ఆయన ప్రియురాలు, అమెరికాలోని మిషిగన్ యూనివర్సిటీలో పనిచేస్తున్న యున్‌కింగ్ జియాన్ (33) కలసి అమెరికాలోకి 'ఫుసేరియం గ్రామినియరం' ఫంగస్‌ను అక్రమంగా తీసుకొస్తుండగా అమెరికా అధికారులు పట్టుకున్నారు. యున్‌కింగ్ జియాన్ చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా భావిస్తున్నారు. మిషిగన్ యూనివర్సిటీలోని ల్యాబ్‌లో పరిశోధనల కోసం తాము ఈ ఫంగస్‌ను తీసుకొచ్చినట్టు వారు చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలో చైనీయుల తీరు వ్యవసాయ ఉగ్రవాదంలో భాగమని.. అమెరికాలో పంటలను దెబ్బతీసే కుట్ర ఉందని అమెరికా అధికారులు వారిని అరెస్టు చేశారు.

'ఫుసేరియం'తో ఏమిటీ ప్రమాదం?

'ఫుసేరియం గ్రామినియరం' ఒక రకం ఫంగస్. ఇది గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ, ఓట్స్ వంటి పంటల్లో 'హెడ్ బ్లైట్ లేదా స్కాబ్'గా పిలిచే తెగులుకు కారణం అవుతుంది. ఇది సోకిన పంటల దిగుబడి, నాణ్యత దారుణంగా తగ్గిపోతాయి. రైతులు తీవ్రంగా నష్టపోతారు. అంతేకాదు ఈ ఫంగస్ 'డీఆక్సీనివలెనాల్, జియారలెనోన్'గా పిలిచే విష పదార్థాలను విడుదల చేస్తుంది. ఈ విష పదార్థాలు పంటల ధాన్యాల్లో చేరుతాయి. ఆ ధాన్యాలను మనం ఆహారంగా తీసుకుంటే.. కాలేయం దెబ్బతింటుంది. ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ప్రభావం పడుతుంది. వాంతులు, విరేచనాల వంటివి తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. ఈ కారణాలతోనే 'ఫుసేరియం.. గ్రామినియరం' ఫంగస్‌ను వ్యవసాయానికి, ఆహార భద్రతకు అతి పెద్ద ముప్పుగా పరిగణిస్తారు.



చైనా శాస్త్రవేత్తలు అమెరికాలోకి తీసుకువచ్చిన ఫంగస్

వ్యవసాయ ఉగ్రవాదమంటే?

ఆయుధాలతో విచ్చలవిడిగా దాడులు చేసి... పౌరులను, భద్రతా బలగాలను చంపే ఉగ్రవాదం అందరికీ తెలిసిందే. అలా నేరుగా కాకుండా లక్ష్యంగా చేసుకున్న దేశంలోకి ఫంగస్ వంటి సూక్ష్మక్రిములు (పాథోజెన్స్), కీటకాలు వంటివాటిని ప్రయోగించి పాడిపంటలను తీవ్రంగా నష్టపర్చడం, తద్వార ఆహార కొరత, కరువు పరిస్థితులు నెలకొనేలా చేయడం, దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీయడమే 'వ్యవసాయ ఉగ్రవాదం'గా చెప్పవచ్చు. పంటల్లో చాలా భాగం దెబ్బతినడంతో వందలు, వేల కోట్ల రూపాయల్లో నష్టం సంభవిస్తుంది. ప్రమాదకర పాథోజెన్స్‌ను ఏదైనా ఒక ప్రాంతంలో ప్రయోగిస్తే చాలు.. అవి చాలా దూరం వరకు విస్తరించి, తీవ్ర నష్టాన్ని కలిగించేందుకు అవకాశాలు ఎక్కువని, దీనికి ఖర్చు కూడా తక్కువని నిపుణులు చెబుతున్నారు.

4 రోజుల్లోనే 57% రేషన్ పంపిణీ

- ఇప్పటికి 84 లక్షల కుటుంబాలకు అందిన సరుకులు
- చౌక దుకాణాల ద్వారా పంపిణీ వేగవంతం
- వీలున్నప్పుడు వెళ్లి తెచ్చుకుంటున్న లబ్ధిదారులు
- రేషన్ షాపుల పునఃప్రారంభంతో కలిగిన సౌలభ్యం
- వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరుకులు చేరవేత

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ వేగం పుంజుకుంది. గత నెల వరకు ఎండీయూ వాహనాల ద్వారా చేసిన పంపిణీ కంటే ఈ నెల ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభించిన రేషన్ షాపుల ద్వారానే సరుకుల పంపిణీ మెరుగ్గా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం.. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 29,796 రేషన్ షాపులను పునఃప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 1,46,21,233 రేషన్ కార్డులు ఉండగా.. బుధవారం వరకు సుమారు 85 లక్షల కుటుంబాలు రేషన్ సరుకులు తీసుకున్నాయి. అంటే, 4 రోజుల్లోనే 57 శాతానికి పైగా సరుకుల పంపిణీ పూర్తైంది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా 9,260 ఎండీయూ వాహనాల ద్వారా రోజుకు సగటున 12 లక్షల కుటుంబాలకు మాత్రమే సరుకులు పంపిణీ చేయగలిగే వారు. ఎండీయూ వాహనాలు తమ వీధికి వచ్చే సమయానికి ఇళ్ల దగ్గర లేని కార్డుదారులు ఆ నెల రేషన్ సరుకులు కోల్పోవాల్సి వచ్చేది. ఇప్పుడు రేషన్ షాపుల్లో రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేస్తుండటంతో కార్డుదారులే వీలు కుదిరినప్పుడు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఈ నాలుగు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 26,29,864 కుటుంబాలవారు పోర్టబులిటీ ద్వారా రేషన్ సరుకులు తీసుకున్నారు. రేషన్ షాపులకు వెళ్లలేని దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇళ్లకే సరుకులను తీసుకువెళ్లి అందిస్తున్నారు. రేషన్ షాపుల పునఃప్రారంభం వల్ల తమకు వీలు కుదిరినప్పుడు వెళ్లి సరుకులు తెచ్చుకోవడానికి ఎంతో సౌలభ్యంగా ఉందంటూ కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండిన కోస్తా

సాధారణం కంటే 5 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కోస్తాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రుతుపవనాలు ప్రవేశించిన తరువాత రెండు, మూడు రోజులు చల్లగా ఉన్న వాతావరణం గడచిన నాలుగు రోజుల నుంచి మళ్లీ వేడెక్కింది. బుధవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమహేశ్వరపురంలో 41, నరసాపురంలో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ అనిశ్చితి కారణంగా సాయంత్రం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో ఎండ తీవ్రత, ఉక్కపోత, రాయలసీమలో ఎండ ప్రభావం కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా ప్రాంతంలో గురువారం 40-41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ, అనుబంధ రంగాలే కీలకం

- వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వెల్లడి

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వచ్చే పదేళ్లు రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ, అనుబంధ రంగాలు కీలకమవుతాయని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. బుధవారం మంగళగిరిలోని వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్లకు వ్యవసాయ, అనుబంధ రంగాల పరిస్థితులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 'వచ్చే పదేళ్లు ఉద్యాన సాగుపై దృష్టి పెట్టాలి. ఉత్పత్తి శుద్ధీకరణతో పంట విలువ పెంచాలి. ధర ఉందనే కారణంగా మితిమీరి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలి' అని సూచించారు. అలాగే ప్రకృతి సేద్యంపై వ్యవసాయ, ఉద్యానశాఖల జిల్లా అధికారుల శిక్షణ కార్యక్రమంలో రాజశేఖర్ వర్చువల్‌గా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి డోలా

అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం, ఏపీ ప్రభుత్వ నియమాలు తెలుగు అనువాదం పుస్తకాన్ని అమరావతి సచివాలయంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల చట్టం-2016, ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల నిబంధనలపై సమగ్ర సమాచారాన్ని తెలుగులో అనువదించడం అభినందనీయమన్నారు.

సెప్టెంబరు 1న చలో విజయవాడ: ఏపీసీపీఎస్ఈఏ

అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు బ్లాక్ డే అయిన సెప్టెంబరు 1న సీపీఎస్ ఉద్యోగులతో చలో విజయవాడ కార్యక్రమానికి ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీశ్, సీఎం దాస్ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ విధానాన్ని నిలుపుదల చేసినందుకు బుధవారం ఒక ప్రకటనలో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఒక సంవత్సరంలోపు పరిష్కారం చూపిస్తామని ప్రకటించారని, కానీ సంవత్సరం గడిచినా సీపీఎస్ విధానంపై కనీస చర్చ కూడా జరగలేదన్నారు. ప్రభుత్వం ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని కోరారు.

9 నుంచి హోంగార్డుల ఫిట్‌నెస్ పరీక్షలు

ఏపీ సీఐడీ విభాగంలో 28 మంది హోంగార్డుల నియామకానికి 12,569 దరఖాస్తులు అందాయని పోలీసు శాఖ వెల్లడించింది. వాటిని స్క్రూటినీ చేసిన తర్వాత 7,684 మంది ఫిట్‌నెస్ పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపింది. ఈ నెల 9 నుంచి మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అభ్యర్థులు విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, ఇటీవల తీయించిన రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకు రావాలని సూచించింది.

హైదరాబాదు డ్రగ్స్ కేసులో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కూడా...

తిరుపతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు డ్రగ్స్ కేసులో తిరుపతికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖరే కాదు.. రిజర్వు హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర కూడా ఉన్నాడు. వీరిద్దరినీ కూకట్‌పల్లి పోలీసులు బుధవారం తిరుపతిలో అరెస్టు చేశారు. వీరి నుంచి మత్తు పదార్థాలు, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

కుమారుడి ముక్కు, నోటికి ప్లాస్టర్

- నాలుగేళ్ల కొడుకును చంపి.. ఆపై తల్లి ఆత్మహత్య


ప్రశాంత్ మృతదేహం


రమ్యదీప్తి(ఫైల్)

కాకినాడ క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ నాలుగేళ్ల కుమారుడిని చంపి, తానూ ఆత్మహత్య చేసుకుంది. కొడుకుకి ఊపిరాడకుండా ముక్కుకి, నోటికి ప్లాస్టర్లు వేసి, తాను ఫ్యానుకు ఉరి వేసుకుంది. కాకినాడలో బుధవారం జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ రేచర్లపేటలోని దౌర్ల వారి వీధికి చెందిన రాజాల రమ్యదీప్తి (30), శరత్‌బాబు దంపతులు. వీరికి సియాన్ ప్రశాంత్ (4) అనే కుమారుడు ఉన్నాడు. దంపతులిద్దరూ కొంతకాలంగా గల్ఫ్‌లోని అబుదాబిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రమ్యదీప్తి పదిరోజుల క్రితం రేచర్లపేటలోని అత్తారింటికి వచ్చింది. డబ్బు సంపాదించడం మానేసి అక్కడి నుంచి వచ్చేస్తావా అంటూ అత్త శాంతి, ఆడపడుచు మెర్సీ మానసికంగా రమ్యదీప్తిని వేధింపులకు గురి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రమ్యదీప్తి తనువు చాలించాలని నిర్ణయించుకుంది. బుధవారం ఉదయం ఎంతకీ తలుపులు తీయకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు కిటికీలోంచి చూశారు. రమ్యదీప్తి ఫ్యానుకు వేలాడుతూ, కొడుకు నోటికి, ముక్కుకి ప్లాస్టర్‌తో విగతజీవులుగా కనిపించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పంలో దొంగల ముఠా హల్‌చల్

- స్కార్పియోతో ఎస్ఐని తొక్కించేందుకు యత్నం
- కాల్పులు జరిపిన సీఐ.. డ్రైవర్‌కు గాయాలు

కుప్పం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో మంగళవారం రాత్రి హరియాణకు చెందిన దోపిడీ దొంగల ముఠా హల్‌చల్ చేసింది. హరియాణకు చెందిన అంతర్రాష్ట్రీయ దోపిడీ దొంగల ముఠా కుప్పం వైపు వస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా స్థానిక పోలీసులకు మంగళవారం రాత్రి సమాచారం అందింది. దీంతో కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి వారిని అడ్డుకునేందుకు బయల్దేరారు. కుప్పం పట్టణంవైపు వేగంగా వస్తున్న ఒక స్కార్పియో వాహనం స్థానిక వ్యవసాయ మార్కెట్టు యార్డు వద్ద పోలీసులకు కనిపించింది. ఆ వాహనంలోనే దొంగల గ్యాంగ్ ఉందని నిర్ధారించుకున్న ఎస్ఐ శ్రీనివాసులు ఆపడానికి ప్రయత్నించారు. అందులోని ముఠా వాహనాన్ని ఆపకపోగా, ఎస్‌ను ఆ వాహనంతోనే తొక్కించబోయారు. వెంటనే అప్రమత్తమైన కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్.. కారులోని ముఠాపై ఓ రౌండ్ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అయినా వాహనాన్ని ఆపకుండా, వెనక్కి మళ్లించి తిరుపత్తూరు మార్గంలోకి తిప్పాడు. పోలీసులు మరో వాహనంలో దొంగలను వెంబడించారు. వేగంగా వెళ్లిన దొంగల వాహనం చివరకు పరమసముద్రం చెరువు గట్టుమీద పోలీసులకు కనిపించింది. అప్పటికే దోపిడీ దొంగలు పరారయ్యారు. ఆ గ్యాంగ్‌ను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

పరిశ్రమలు పెట్టేదాకా నిరంతర పర్యవేక్షణ

రూ. 9.5 లక్షల కోట్ల పెట్టుబడులు .. 8.5 లక్షల ఉద్యోగ కల్పనకు ఒప్పందాలు

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు మా లక్ష్యం
- వైసీపీ ఐదేళ్లలో సాధించలేనివి 11 నెలల్లోనే తెచ్చాం
- పెట్టుబడుల ఆకర్షణతోపాటు ప్రాజెక్టుల పూర్తికీ చర్యలు
- ఉపాధి కల్పనపై భేటీలో అధికారులకు లోకేశ్ ఆదేశం


యువగళంపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి లోకేశ్ బుధవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. పుస్తకాన్ని నిశితంగా పరిశీలించిన పవన్... ఆప్యాయంగా లోకేశ్‌ను ఆలింగనం చేసుకుని అభినందించారు. ఆ తర్వాత సహచర మంత్రులకు కూడా లోకేశ్ ఈ పుస్తకాన్ని అందించారు.

అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో సాధించలేని పెట్టుబడులను 11 నెలల్లోనే రాష్ట్రానికి తీసుకువచ్చామని ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆయన ఉపాధి కల్పనపై మంత్రులు, అధికారులతో సమావేశమయ్యారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటి వరకూ 9.20 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకొచ్చాయని, వాటి ద్వారా 8.5 లక్షల మంది యువతకు ఉద్యోగాలను కల్పించేలా అవగాహనా ఒప్పందాలను చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో భారీపెట్టుబడులు, అత్యధిక ఉద్యోగాలను కల్పించేందుకు ఎన్‌టీపీసీ, బీపీసీఎల్, రిలయన్స్, టాటాపవర్ వంటి సంస్థలు ముందుకొచ్చాయని తెలిపారు. అవి రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేవరకూ ఆ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని లోకేశ్ సూచించారు. పునరుద్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూమితోపాటు ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని కోరారు. అతి పెద్ద తీరప్రాంతం కలిగిన మన రాష్ట్రం పర్యాటకరంగానికి అనువైందని, ఆ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. విశాఖలో వరుణ్ బీచ్ శాండ్, ఒబెరాయ్ వంటి స్టార్ హోటళ్ల నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో బీచ్‌శాండ్, కోల్ గ్యాసిఫికేషన్ మైనింగ్ రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను అన్వేషించాలన్నారు. రాష్ట్రానికి కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చడంలో భాగంగా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని సూచించారు. స్కిల్ ఎకోసిస్టమ్ కల్పించాలని, బీసీసీఐ సహకారంతో అమరావతిలో వరల్డ్ క్లాస్ స్టేడియం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు వీలుగా వాట్సప్ గవర్నెన్స్‌తో అనుసంధానం చేయాలన్నారు. అధిక ఉపాధికి అవకాశం ఉన్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌తో అనుసంధానం చేయాలని కోరారు. దానివల్ల ఆ పరిశ్రమలకు పెట్టుబడుల మద్దతు లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఒక వైపు పెట్టుబడులను ఆకర్షించే కార్యక్రమాలను కొనసాగిస్తూనే, ఇప్పటికే ఒప్పందాలు కుదిరిన ప్రాజెక్టుల ప్రారంభానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ విధానాలను అనుసరిస్తున్నామని వెల్లడించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపేవారితో నేరుగా సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, కందుల దుర్గేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకరబాబు, గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఎడ్‌సెట్

- ఒక నిమిషం నిబంధన అమలు

పెదకాకాని, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరంలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం ప్రొఫెసర్, ఏపీ ఎడ్‌సెట్-2025 కన్వీనర్ ఆచార్య ఏవీఎస్ స్వామి బుధవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య జరిగే ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 87 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని, ఒక నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని వివరించారు.

తెనాలిలో ఉండలేం.. దూరంగా వెళ్లిపోతాం

- జగన్ వచ్చి రౌడీషీటర్లకు అండగా ఉంటామన్నాక భయం పెరిగింది
- దాడికి గురైన కానిస్టేబుల్ భార్య కల్యాణి కన్నీటిపర్యంతం
- తాను దళిత మహిళనేనని, తనకూ రక్షణ కావాలని వేడుకోలు
- పోలీసు ఫ్యామిలీకి ఏదైనా జరిగితే చూస్తూ ఊరుకోం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ హెచ్చరిక


కానిస్టేబుల్ చిరంజీవి భార్య కల్యాణితో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ

తెనాలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సామాన్యుల కష్టాలు తీర్చాల్సిన పోలీసుకే కష్టం వస్తే... ఆ పోలీసు భార్యే తనకు రక్షణ కల్పించమని వేడుకుంటుంటే అంతకంటే దారుణం ఉండదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. తెనాలిలో రౌడీషీటర్ల చేతిలో దాడికి గురైన కానిస్టేబుల్ చిరంజీవి కుటుంబానికి మహిళా కమిషన్ అండగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. వారికి ఏదైనా జరిగితే ఈ విషయంలో ఏ రాజకీయ పార్టీ అయినా, మాజీ సీఎం అయినా ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. కానిస్టేబుల్ చిరంజీవి భార్య కళ్యాణిని పరామర్శించేందుకు ఆమె బుధవారం తెనాలి వచ్చారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారితో కలసి చిరంజీవి కుంటుంబాన్ని పరామర్శించారు. తమకు భయంగా ఉందని, తెనాలిలో ఉండలేమని, దూరంగా వెళ్లిపోతామని శైలజ ఎదుట కల్యాణి కన్నీటిపర్యంతమయ్యారు. అధైర్యపడొద్దని, పోలీస్ కుటుంబంలో ఉన్న మీరే భయపడితే ఎలాగంటూ శైలజ ఆమెకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. రౌడీషీటర్‌లు తన భర్తపై దాడి చేసినప్పుడు కూడా తాము భయపడలేదని, వైసీపీ నేత జగన్, ఆ పార్టీ నాయకులు తెనాలి వచ్చి రౌడీషీటర్‌లకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామంటూ భరోసా ఇచ్చివెళ్లాకే తమలో భయం పెరిగిందని కల్యాణి వివరించారు. తానూ దళిత సోదరినేనని, తనకూ రక్షణ కావాలని కల్యాణి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రక్షణ కల్పించాలని కోరిన వెంటనే మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రావడం కొంత ధైర్యాన్నిచ్చిందని ఆమె పేర్కొన్నారు.

పోలీసు కుటుంబమే రక్షణ కోసం ప్రాధేయపడడమా?

ఒక పోలీస్ కుటుంబమే తమకు రక్షణ కావాలని ప్రాధేయపడటం బాధ కలిగించిందని, కల్యాణికి మహిళా కమిషన్ అండగా ఉంటుందని శైలజ భరోసా ఇచ్చారు. ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదని, ప్రభుత్వం, పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం చెప్పారు. మహిళా కమిషన్‌కు రాజకీయాలతో పనిలేదని, తమకు మహిళల రక్షణే ముఖ్యమని, కానిస్టేబుల్ కుటుంబానికి ఎవరైనా హాని తలపెట్టాలని చూసినా, ఏ ఇబ్బంది కలిగించినా మాజీ సీఎం అని కూడా చూడబోమని, దాని వెనుక ఎంతటి పెద్దలున్నా, ఎంతటి కరుడుగట్టిన నేరస్తులున్నా కమిషన్ ఉపేక్షించబోదని ఆమె తేల్చి చెప్పారు. కానిస్టేబుల్ చిరంజీవి కుటుంబానికి ఏ ఇబ్బంది వచ్చినా అందుకు వారే బాధ్యులవుతారని శైలజ హెచ్చరించారు. తెనాలిలో ఇటువంటి సంఘటనలు జరగటం బాధ కలిగించిందని, భవిష్యత్‌లో రౌడీల ఆగడాలు తగ్గిపోతాయని, మళ్లీ తెనాలి ప్రశాంత వాతావరణంలో ఉంటుందని కమిషన్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి వ్యాఖ్యానించారు.

ఉపాధి అవకాశాలు పెంచేలా పాఠ్య ప్రణాళిక

- వీసీల సమావేశంలో ఉన్నత విద్యాశాఖ అధికారులు

అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అవసరాలకు తగ్గట్టుగా, ఉపాధి అవకాశాలను పెంచేలా పాఠ్యప్రణాళిక (కరిక్యులమ్)ను రూపొందించాలని ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ యూనివర్సిటీల ఉప కులపతుల (వీసీ)కు సూచించారు. మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం జరిగిన వీసీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ కాలేజీలతో పాటు ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, సాంకేతిక కాలేజీలు, డిగ్రీ కాలేజీలకు కూడా కరిక్యులమ్ విషయంలో మార్గనిర్దేశం చేయాలన్నారు. తమ పరిధిలోని విద్యాసంస్థల సమగ్ర సమాచారం ఆయా యూనివర్సిటీల వద్ద ఉండాలన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి మాట్లాడుతూ... వర్సిటీల్లో బోధన సిబ్బంది నియామకానికి ఉన్న అవరోధాలను సమీక్షించామన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు న్యాయ, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని బోధనా సిబ్బంది భర్తీలో ఉన్న కోర్టు కేసులను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. కొత్తగా డ్యూయల్ మేజర్ డిగ్రీ ప్రవేశపెట్టామన్నారు. సాంకేతిక కోర్సుల విషయంలో అన్ని యూనివర్సిటీలు ఒకే కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌ను పాటించాలన్నారు. యూనివర్సిటీల్లో రీసెర్చ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలోకి ఆలయాలు: కమిషనర్

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఆలయాల భద్రత దృష్ట్యా ఆర్జేసీ, డీసీ కేడర్ ఆలయ ప్రాంగణాలన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలన్నారు. చెప్పుల స్టాండ్, క్లాక్ రూమ్స్, సెల్‌ఫోన్ కౌంటర్స్, రూమ్ బుకింగ్ కౌంటర్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలని నిర్దేశించారు. ఆలయంలో రెగ్యులర్ ఉద్యోగికి సీసీ కెమెరాల పర్యవేక్షణ బాధ్యత అప్పగించాలని స్పష్టం చేశారు. ఆర్జేసీ, డీసీ కేడర్ ఆలయాల్లో వర్షపు నీటి నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.

ఇంటర్ కాలేజీలకు 'ఫైర్' అడ్డంకి

- ప్రైవేటు జూనియర్ కాలేజీల సంఘం

ఇంటర్మీడియట్ కాలేజీల అఫిలియేషన్లకు ఫైర్ ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) అడ్డంకిగా మారిందని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తొమ్మిది మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న జీ+2 భవనాల్లో కొనసాగుతున్న ఇంటర్ కాలేజీలకు ఫైర్ ఎన్‌వోసీ నుంచి 2020లో మినహాయింపునిచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటికి కూడా తప్పనిసరిగా ఫైర్ ఎన్‌వోసీ ఉండాలని ఇంటర్ విద్యామండలి అధికారులు స్పష్టం చేయడంతో యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. ఫైర్ ఎన్‌వోసీ ఖర్చుతో కూడుకున్న పని అని అంటున్నాయి. దీనిపై ఏపీ జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రతినిధులు బుధవారం మంగళగిరిలో సమావేశమయ్యారు. జీ+2 భవనాలకు కూడా ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తే గ్రామీణ, విద్యార్థులు తక్కువగా ఉండే కాలేజీలకు కష్టంగా మారుతుందన్నారు. జీ+2 భవనాలకు మినహాయింపు ఇవ్వాలని మంత్రి లోకేశ్‌ను కోరాలని నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు వీవీ ప్రసాద్ తెలిపారు.

పర్యాటక కేంద్రాల్లో పచ్చదనం

- ఏపీటీడీసీ యూనిట్లలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం
- 'ఒక యూనిట్-ఒక మొక్క-ఒక హరిత బాధ్యత' నినాదం

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ బుధవారం ఒక ప్రకటనతో తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పర్యాటక కేంద్రమూ పచ్చదనంతో నిండేలా కార్యాచరణ రూపొందించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఏపీటీడీసీ కూడా 'ఒక యూనిట్ - ఒక మొక్క - ఒక హరిత బాధ్యత' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని తెలిపారు. 5వ తేదీన ఏపీటీడీసీ యూనిట్లల్లో మొక్కలు నాటాలని డీవీఎంలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. పర్యాటక కేంద్రాల శాశ్వత అభివృద్ధికి ఆరోగ్యవంతమైన పర్యావరణం కీలకమన్నారు. ఒక మొక్కను నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు జీవన యోగ్యమైన ప్రకృతిని అందించగలమన్న భరోసా కలగాలని స్పష్టంచేశారు. ఏపీటీడీసీ యూనిట్లల్లో ప్రతి అధికారి, ఉద్యోగి కచ్చితంగా ఒక మొక్క నాటాలన్నారు.

'ఉపాధి' నిధులు 1,136 కోట్లు విడుదల

ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన మెటీరియల్, అడ్మిన్ నిధులు రూ.1,136 కోట్లు రాష్ట్రానికి మంజూరయ్యాయి. మెటీరియల్ నిధులు రూ.960.15 కోట్లు, అడ్మిన్ నిధులు రూ.176.35 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గతేడాదికి సంబంధించి ఉపాధి హామీ పథకం పరిపాలనా వ్యయం బకాయిలు రూ.176.35 కోట్లు, మెటీరియల్ నిధులు గతేడాదికి రూ.790.43 కోట్లు, ఈ ఏడాదికి రూ.169.72 కోట్లు మంజూరుచేస్తూ ఆదేశాలిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 75 శాతం మెటీరియల్ నిధులు విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం వాటా 25 శాతం అంటే రూ.320.15 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర వాటా జమ చేస్తే మొత్తం రూ.1,280 కోట్ల మేర మెటీరియల్ నిధులను ఇటీవల సిమెంట్‌రోడ్లు, మినీగోకులాలు నిర్మించిన కాంట్రాక్టర్లకు చెల్లించే అవకాశముంది. మొదటి విడతలో మొదటి కంతుగా కేంద్రం ఈ వాటా విడుదల చేసింది. ఈ నిధులు ఖర్చు చేసిన తర్వాత మిగిలిన నిధులు కూడా కేంద్రం విడుదల చేయనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్‌కు హసీనా పరీక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై విచారణ జరుపుతోన్న ట్రిబ్యునల్ ఆమెపై అరెస్టువారెంట్ జారీచేసింది. గత ఏడాది విద్యార్థుల ఆందోళనలను అణచివేయడానికి అవామీలీగ్ ప్రభుత్వం అతి క్రూరంగా వ్యవహరించి, సామూహిక మారణ కాండకు పాల్పడిందన్నది ప్రాసిక్యూషన్ ఆరోపణ. దీనిని పరిగణన లోకి తీసుకున్న బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) హసీనాతో పాటు అప్పటి బంగ్లా హోంమంత్రి, ఇనస్పెక్టర్ జనరల్‌కు సైతం అరెస్టువారెంట్లు జారీ చేసింది. సామూహిక హత్యాకాండలో ఈ ముగ్గురిదే ప్రధానపాత్రని నిర్ధారించింది. విద్యార్థులపై దాడులు చేయవలసిందిగా భద్రతాదళాలతో పాటు అధికారపార్టీ కార్యకర్త లను, అనుబంధ గ్రూపులను సైతం హసీనా ప్రభుత్వం ఆదేశించి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరణించడానికి కారణమైందని చీఫ్ ప్రాసిక్యూటర్ వాదన. ఈ హత్యలన్నీ పక్కా ప్రణాళికతో ఉద్దేశ పూర్వకంగా చేసినవని ఆయన వాదన. అభియోగాలను నమోదు చేసిన న్యాయస్థానం ఈ నెల 16లోగా హసీనాను ప్రవేశపెట్టాలంటూ ఆదేశాలు కూడా ఇచ్చింది. దోషులుగా తేలితే ఐసీటీ–బంగ్లాదేశ్ చట్టం ప్రకారం వీళ్ళకు ఉరిశిక్ష పడుతుందట.

హసీనా దుర్మార్గాలను నిరూపించడానికి 81మంది సాక్షులను, వందలాది వీడియోలు, మెసేజ్‌లను కూడా న్యాయస్థానం ముందు ప్రభుత్వం ఉంచింది. హసీనామీద వందకు పైగా కేసులు పెట్టి, భారత దేశం నుంచి వెనక్కు రప్పించాలని ప్రయత్నిస్తున్న యూనిస్ ప్రభుత్వానికి ఐసీటీ ఆదేశాలు కొత్త శక్తినిస్తాయి. భారత ప్రభుత్వం పలురకాల కారణాలు, అభ్యంతరాలతో హసీనా అప్పగింతకు సిద్ధ పడకపోవడం తెలిసిందే. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగిన హసీనా తన పదవిని పరిరక్షించుకోవడానికి నిరంకుశంగా, అప్రజా స్వామికంగా వ్యవహరించిన మాట నిజం. ఆమె ఆదేశాల మేరకే భద్రతాబలగాలు విద్యార్థులమీద అంత అమానుషంగా విరుచు పడ్డాయి. అందుకు ఆమెను బాధ్యురాలిని చేసి, శిక్షించేందుకు సిద్ధ పడినప్పుడు ఆ ప్రక్రియ పారదర్శకంగా, నిజాయితీగా జరగాలి. ఆమె పట్ల కక్షపూరితంగా కాక, ప్రస్తుత పాలకులు తటస్థంగా ఉండాలి. కానీ, నోబెల్ పురస్కార గ్రహీత నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో హసీనా ఉనికినీ, చిహ్నాలను తుడిచిపెట్టేయా లన్న కక్షతో కదులుతోంది. అవామీలీగ్ నాయకులను జైళ్ళలోకి తోయ డమే కాదు, దశాబ్దాలనాటి ఓ ఉగ్రవాద చట్టాన్ని రాత్రికిరాత్రి తమకు అనుగుణంగా సవరించి, ఇటీవల ఏకంగా ఆమె పార్టీనే ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించింది. ఇక, హసీనాకు ట్రిబ్యునల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన మర్నాడే ఆ దేశ సుప్రీంకోర్టు 1971 ఊచకోతలో పాకిస్థాన్‌తో కుమ్మక్కయిన మతోన్మాద జమాతే ఇస్లామీని రాజకీయ పార్టీగా ఎన్నికల్లో పాల్గొనేందుకు అనుమతించడం విశేషం.

ఉన్నతంగా, తటస్థంగా దేశాన్ని నడిపించాల్సిన యూనిస్ ప్రభుత్వం ఏకపక్షంగా, ఒక మతతత్వసంస్థలాగా వ్యవహరిస్తోంది. బంగ్లాదేశ్‌కు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సాధించిన ముజిబుర్ రహ్మాన్ ఆనవాళ్ళేమీ దేశంలో మిగలకుండా చేసే ప్రయత్నాలు అక్కడ బలంగా, ప్రణాళికాబద్ధంగా సాగుతున్నాయి. విగ్రహాల కూల్చివేత, బంగ్లావిమోచనంలో ఆయన పాత్రను కుదించడం, పాకిస్థాన్ మెచ్చే రీతిలో పాఠ్యపుస్తకాలను తిరగరాయడం ఇత్యాదివి సాగిపోతు న్నాయి. జూన్ 1నుంచి జారీ అయిన నోట్ల మీద కూడా ఆయన ఫోటో లేకుండాపోయిన విషయం తెలిసిందే. కొత్తపాఠ్యపుస్తకాల్లో ముజిబుర్ రహ్మాన్‌ను వెనక్కునెట్టేసి, జియావుర్ రహ్మాన్‌ను ఆకాశాని కెత్తే ప్రయత్నమూ జరిగింది. బంగ్లావిముక్తి పోరాటానికి మసిపూసి, దాని ఆవిర్భావానికి దోహదపడిన పరిస్థితులను, కారణాలను చెరిపి వేసి, ఆనాటి ఆదర్శాలకు పాతరేసి, పాకిస్థాన్ అనుకూల, మత ఛాందస దేశంగా బంగ్లాదేశ్‌ను మార్చేందుకు బలమైన ప్రయత్నం జరుగుతోంది. ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు చెందిన జమాత్–ఉద్ దావా నాయకులు కొందరు ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగిస్తూ, 1971లో పాకిస్థాన్‌ను దెబ్బతీసి ఇందిరా గాంధీ బంగ్లాదేశ్‌ను సృష్టిస్తే, గత ఏడాది అందుకు ప్రతీకారం తీర్చుకున్నామంటూ హసీనా వ్యతిరేక ఉద్యమంలో తమ సంస్థ పాత్ర ప్రముఖంగా ఉన్నదని చెప్పుకున్నారట. పొరుగుదేశం పరిణామాలు భారత్‌కు పరీక్షపెట్టే విధంగా పరిణమిస్తున్నాయి.

కన్నడపై కమల్ వ్యాఖ్యలు సబబేనా?



ద్రావిడ భాషా కుటుంబంగా ఉన్న తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద వంటి భాషలలో తమిళ భాష అత్యంత ప్రాచీనమైనదని ఇప్పటికి లభించిన సాహిత్య, శాసనాధారాలవల్ల రుజువైంది. అయితే, తమిళ భాష నుంచే మిగిలిన ద్రావిడ భాషలు ఉద్భవించాయా? లేదా, అవి మొదటి నుంచీ వేరే భాషలుగానే ఉంటూ వచ్చాయా? అనేది తగు శాస్త్రీయ ఆధారాలతో చేయాల్సిన చర్చ.

సినీ నటుడు కమల్ హాసన్ ఇటీవల చెన్నైలో ఒక సినిమా వేడుకలో మాట్లాడుతూ కన్నడకు తమిళ భాష జన్మనిచ్చిందని చేసిన వ్యాఖ్య కన్నడనాట ఆగ్రహావేశాలు రేకెత్తించింది. ఈ వ్యాఖ్యలపై కర్ణాటకలోని పలు పోలీస్ స్టేషన్లలో కమల్‌పై కేసులు నమోదైనాయి. కన్నడ భాషకు 2,500 ఏళ్ల చరిత్ర ఉందనీ, తమిళభాష కన్నడానికి జన్మనివ్వటం ఏమిటని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొదలు అంతా ఆగ్రహించారు. జూన్ 5న విడుదల కానున్న కమల్ హాసన్ తాజాచిత్రం 'థగ్ లైఫ్ 'ప్రదర్శనలకు కర్ణాటకలో ఆటంకం ఏర్పడింది. ఇందుకు స్పందనగా కమల్ మాట్లాడుతూ చరిత్రకారుల ద్వారా తాను తెలుసుకున్న చరిత్రనే ప్రేమతో చెప్పాను తప్ప తనకు వేరే ఉద్దేశమే లేదన్నారు. తన వ్యాఖ్యను ఉపసంహరించుకోవడం గానీ క్షమాపణలు చెప్పడం కానీ చేయబోనని, ఈ విషయాన్ని చరిత్రకారులు, భాషా శాస్త్రవేత్తలకు వదిలేద్దామనీ కమల్ అన్నారు.

కమల్ వ్యాఖ్య బాగోగులేమిటో చూద్దాం. దక్షిణాది భాషలైన తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద మొదలైన భాషలను ద్రావిడ భాషా కుటుంబంగా వ్యవహరిస్తారు. అతి ప్రాచీనమైన ఈ ద్రావిడ భాషలలో ఏది అత్యంత ప్రాచీన భాష అనే విషయం పరిశీలించే ముందు అసలు ద్రావిడులు అంటే ఎవరు? వారు ఎక్కడి నుంచి వచ్చారు? అనేది చూడాలి. ద్రావిడులు ఆర్యులకన్నా ముందు అప్పటి భారతదేశంలో నివసించినవారు. వారు నవీన శిలాయుగంలో నెగ్రిటో, ప్రోటో ఆస్ట్రలాయిడ్ జాతుల తరువాత భారతదేశానికి వచ్చి స్థిరపడిన మెడిటరేనియన్ జాతివారని చరిత్ర పరిశోధకుల నిర్ధారణ. ఈ జాతివారు మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి వాయవ్య భారతదేశం మీదుగా నాటి భారతదేశంలో ప్రవేశించారని కొందరు పరిశోధకులు భావించారు. ఇందుకు ఆధారంగా వారు నేటి పాకిస్థాన్‌లో ఉన్న బలూచిస్థాన్‌లోని బ్రాహుయిస్థాన్ ప్రజలు బ్రాహుయి (Brahui) అనే ద్రావిడ భాషను మాట్లాడుతూ ఉండటాన్ని పేర్కొన్నారు. ద్రావిడ భాషలు మాట్లాడే మిగతా దక్షిణ భారతదేశం నుంచి 1500 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ ప్రజలు ద్రావిడ భాష అయినట్టి బ్రాహుయిని నేటికీ మాట్లాడుతూ ఉండటాన్ని బట్టి, సామాన్య శకపూర్వం (అంటే BCE) 3,000 సంవత్సరానికి పూర్వమే మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి వలస వస్తూ కొందరు ద్రావిడ జాతీయులు అక్కడ స్థిరపడి ఉంటారనే నిర్ధారణకు వచ్చారు. దక్షిణ ఆసియా భాషలపై విశేష పరిశోధనలు చేసిన ఎలీనా బషీర్, భద్రిరాజు కృష్ణమూర్తి వంటి వారి గ్రంథాలు ఈ అభిప్రాయాన్ని బలపరిచాయి. మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి ద్రావిడులు సముద్రమార్గాన దక్షిణ భారతదేశానికి వచ్చి స్థిరపడి, ఆ తరువాత క్రమంగా ఉత్తర భారతదేశానికి కూడా వ్యాపించి ఉంటారని ఇంకొందరి భావన. ఏది ఏమైనా ద్రావిడులంతా మౌలికంగా నవీన శిలాయుగంలో BCE 3,000 ప్రాంతంలో మధ్యధరా సముద్రం, పశ్చిమ ఆసియాలోని ఇరాన్ ప్రాంతం నుంచి వలస వచ్చిన వ్యవసాయ సంస్కృతి నిర్మాతలనే విషయాన్ని దాదాపుగా చరిత్ర కారులందరూ అంగీకరిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతపు తవ్వకాలలో ప్రత్యేకించి క్రీటు దీవిలో లభించిన క్రీటన్ జ్యూస్ (Cretan Zeus) విగ్రహాలు ద్రావిడులు పూజించే పిళ్ళార్ (వినాయక) విగ్రహాలకు మూలరూపాలని పరిశోధకులు తేల్చారు. నేటి టర్కీలో అంతర్భాగమైన అనటోలియాలోని లికియా (Lycia)లోని దిర్మిల్ ప్రాంతాన్ని అనాదిగా లికియన్లు త్రిమిలి అని పిలుస్తారనీ, దానినే బాబిలోనియన్లు తర్మిలా (Tarmila) అనీ, గ్రీకులు తర్మిలే (Termilae) అనీ పిలుస్తారనీ 'త్రిమిలి' శబ్దమే తమిళ, ద్రవిడ శబ్దాలకు మూలమని భాషావేత్తల నిర్ధారణ.

ప్రతి భాష ఏదో ఒక చారిత్రక దశలో తప్పక ఏదో మరొక భాష నుంచి వేరై ఉంటుంది. ఏ భాషా వేరుగా పుట్టింది మాత్రం కాదనేది గమనార్హం. అసలు ద్రావిడ భాషలేవీ ఏర్పడక ముందుదైన ప్రాగ్ద్రావిడ భాష నుంచి ఈ ద్రావిడ భాషలన్నీ రూపొందాయని భాషావేత్తల అభిప్రాయం. అయితే ద్రావిడ భాషలన్నిట్లోకీ తమిళం అతి ప్రాచీనమైన భాష అనేదానికి ఎన్నో ఆధారా లున్నాయి. ఒక వాడుక భాషగా తమిళం సంస్కృతం కంటే కూడా ప్రాచీనమైనది. ఇక సాహిత్యాధారాల విషయం చూస్తే తమిళ సాహిత్యం BCE మూడవ శతాబ్ది నుంచి లభిస్తూ ఉండగా సంస్కృత సాహిత్యం BCE రెండవ శతాబ్ది నుంచి మాత్రమే లభిస్తున్నది. తమిళం నేటికీ ప్రజల వాడుక భాషగా కొనసాగుతూ ఉండగా, సంస్కృతం సామాన్య శక పూర్వం ఆరవ శతాబ్దిలోనే ప్రజల వాడుక నుంచి తప్పుకుని, కేవలం పండిత భాషగా మిగిలిపోయింది.

సామాన్య శకం 850లకు చెందిన 'కవిరాజమార్గ' అనే గ్రంథం కన్నడ భాషలో ఇప్పటికి లభిస్తున్న అతి ప్రాచీన సాహిత్యం. రాష్ట్రకూట పాలకుడైన మొదటి అమోఘవర్షుడు ఈ గ్రంథాన్ని తాను ఒక్కడే కానీ వేరొకరితో కలిసి గానీ రాసివుంటాడని పరిశోధకుల అభిప్రాయం. కన్నడ కవిత్వం, ఛందస్సు, వ్యాకరణం గురించి రాయబడిన అతి ప్రాచీన గ్రంథం ఇదే. 'కావ్యాదర్శమ్' అనే సంస్కృత గ్రంథానికి ఇది అనుకరణ అని పరిశీలకులు భావిస్తారు. ప్రాచీన కర్ణాటక చరిత్ర, నాటి ప్రజల భాషా సంస్కృతులు తెలుసుకోవాలంటే 'కవిరాజమార్గ' చదవాలి. జైన కవులు రాసిన కవితలే కన్నడ భాషలోని తొట్టతొలి కవితలు. పదవ శతాబ్దానికి చెందిన కన్నడ ఆదికవి పంప కన్నడ కవులలో ఆద్యుడు. ఆ జైన కవులు రాసిన రచనలన్నీ యథాతథంగా నేటికీ నిలిచివున్న కారణంగా అవి కన్నడ భాష ప్రాచీనతకు స్పష్టమైన ఆధారాలుగా ఉన్నాయి.

అలా తమిళ సాహిత్యం, కన్నడనాట జైన కవుల రచనలు నేటికీ యథాతథంగా లభిస్తున్న కారణంగా ఆ భాషల ప్రాచీనతకు అవి తిరుగులేని ఆధారాలుగా నిలుస్తున్నాయి. మన తెలుగునాట కడప జిల్లాలో లభించిన సామాన్యశకం 575 నాటి రేనాటి చోడ పాలకుడు ధనంజయుడి పూర్తి తెలుగు శాసనమే అతి ప్రాచీనమైనది. గుంటూరు జిల్లా భట్టిప్రోలులోని బౌద్ధ క్షేత్రంలో లభించిన సామాన్యశక పూర్వం 400 నాటి శాసనంలో కొన్ని తెలుగు పదాలు ఉన్నాయి. అలాగే ఏలూరు సమీపంలోని గుంటుపల్లి దగ్గర ఉన్న కంఠంనేనివారి గూడెం, కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని గుమ్మడిదుర్రు, కృష్ణా జిల్లా దివిసీమలోని ఘంటసాల గ్రామంలోని బౌద్ధ క్షేత్రాలలో లభించిన శాసనాలలోనూ పలు తెలుగు పదాలున్నాయి. అయితే సంస్కృత మహాభారతాన్ని ఆంధ్రీకరించిన CE 11వ శతాబ్దానికి చెందిన నన్నయభట్టు తెలుగులో ఆదికవిగా భావించబడ్డాడు. అంతకు పూర్వపు సాహిత్యమేదీ తెలుగులో లభించకపోవడమే ఇందుకు కారణం. ప్రాచీన ఆంధ్రదేశం బౌద్ధ మతానికి పట్టుగొమ్మ. బౌద్ధులు తమ ధర్మ ప్రచారాన్ని స్థానిక భాషలలోనే చేసేవారు. ఆ కారణంగా బౌద్ధ ధర్మానికి సంబంధించిన ఎన్నో తెలుగు గ్రంథాలు ఒకప్పుడు ఉండే ఉంటాయి. అయితే ఆంధ్ర దేశంలో బౌద్ధం బలహీనపడిన దశలో మహాయాన తాంత్రిక శాఖ అయినట్టి వజ్రయానం పలు దురాచారాలకు లోనై ప్రజాభిమానం కోల్పోయింది. ఆ దశలో హైందవ పునరుజ్జీవనోద్యమంలో భాగంగా బౌద్ధ స్తూపాలు, చైత్యాలు విధ్వంసం చేయబడటమే కాదు, బౌద్ధ సాహిత్యం తగులబెట్టబడి ఉంటుందని చరిత్ర కారుల అంచనా. అలా తెలుగు భాష ప్రాచీనతకు సాహిత్యాధారాలు లేకుండా పోయాయి. ఏమైనా తెలుగు భాష తమిళం కంటే ప్రాచీనమైనదని ఎవ్వరూ అనటం లేదు. కమల్ హాసన్ కన్నడ భాషను నిందించ లేదు. కించపరచలేదు. కమల్ అభిప్రాయం నచ్చని వారు దానిని తగు ఆధారాలతో తిప్పికొట్టవచ్చు. అంతే కాని, రాజకీయ ప్రయోజనాలు ఆశించి, రెండు రాష్ట్రాలలో భావోద్వేగాలు రెచ్చగొట్టేవారి దుశ్చర్యలు కూడనివి.


మరో ముఖ్యమైన విషయం. త్రిమిలి శబ్దం నుంచే తమిళ, ద్రమిల, ద్రవిడ శబ్దాలు రూపొందాయని పరిశోధనలు రుజువుపరచాయి. మధ్యధరా సముద్రంలోని క్రీటు దీవి, త్రిమిలి ప్రాంతం నుంచి వలసవచ్చి భారత దేశంలో స్థిరపడిన మెడిటరేనియన్లను అందుకే ద్రావిడులు అన్నారు. ద్రావిడ శబ్దం తమిళ శబ్దానికి పర్యాయపదంగా స్థిరపడింది. తమిళుల అభ్యున్నతి కోసం పనిచేసే పార్టీల పేరులో ద్రావిడ శబ్దం అందుకే ఉంది. ద్రావిడ భాషా కుటుంబంగా ఉన్న తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద వంటి భాషలలో తమిళ భాష అత్యంత ప్రాచీనమైనదని ఇప్పటికి లభించిన సాహిత్య, శాసనాధారాలవల్ల రుజువైంది. తమిళ భాష నుంచే మిగిలిన ద్రావిడ భాషలు ఉద్భవించాయా? లేదా? అవి మొదటి నుంచీ వేరే భాషలుగానే ఉంటూ వచ్చాయా? అనే విషయం తగు శాస్త్రీయ ఆధారాలతో చేయాల్సిన విద్యావిషయకమైన చర్చ. అంతేగానీ, భాషా జాతుల మధ్య ద్వేషాలకు దారితీసేందుకు ఎవరు ప్రయత్నించినా వారు దేశ సమగ్రతకూ, సామరస్యానికీ హాని కలిగించినట్లే, అది రాజ్యాంగ విరుద్ధమైన చర్యే.

■ ముత్తేవి రవీంద్రనాథ్
చరిత్ర పరిశోధకులు

ఈ ఏడాది నినాదం.. ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం

ప్లాస్టిక్‌తో కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. నేల, చెరువులు, నదులు, సముద్రాలన్నింటినీ ఇది కమ్మేస్తోంది. కాలువలు, నదుల ద్వారానే ఏటా 1.1 కోట్ల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2040 కల్లా 2.9 కోట్ల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు సముద్రంలోకి చేరే ప్రమాదముంది.

కోయంబత్తూరు దగ్గర్లోని భారతీయార్ యూనివర్సిటీకి సమీపంలో 'మరుదామలై' అటవీప్రాంతం ఉంది. ఆ అటవీప్రాంతంలో ఇటీవల ఓ ఏనుగు మృతి చెందింది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆ ఏనుగు కడుపులో 15 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్లు గుర్తించారు! సందర్శకుల ద్వారా అటవీప్రాంతంలోకి కూడా ప్లాస్టిక్ భూతం ఇంతగా చేరిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏనుగులే కాదు నిత్యం ఎన్నో జీవరాసులు ఈ ప్లాస్టిక్ భూతానికి బలవుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో వాటిల్లబోయే ప్రమాదాలకు ఈ ఘటనలను ముందస్తు హెచ్చరికగా భావించాలి.



'మరుదామలై' అటవీప్రాంతంలో ఇటీవల ఓ ఏనుగు మృతి చెందింది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆ ఏనుగు కడుపులో 15 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్లు గుర్తించారు! సందర్శకుల ద్వారా అటవీప్రాంతంలోకి కూడా ప్లాస్టిక్ భూతం ఇంతగా చేరిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. కొన్నేళ్ల క్రితం ప్లాస్టిక్ ఉత్పత్తి ఏడాదికి 20లక్షల టన్నులు ఉండగా 2019లో ఇది 45 కోట్ల టన్నులకు పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే 2060 నాటికి మూడింతలు పెరిగే ప్రమాదముంది. ఈ కాలుష్య కట్టడికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు ఇలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించాలి. ఆ వ్యర్థాలను పునర్వినియోగించే దిశగా అడుగులు వేయాలి. ప్రస్తుతం పది శాతం కంటే తక్కువగానే ప్లాస్టిక్ పునర్వినియోగం జరుగుతోంది. దీన్ని భారీగా పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఇప్పటికే భూమ్మీద 600 కోట్ల టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు పోగు పడ్డాయని లాన్సెట్ పత్రిక ఓ అధ్యయనంలో వెల్లడించింది. ఆ ప్లాస్టిక్ వ్యర్థాలు చాలా వరకు జల వనరుల్లో చేరుతుండడం అతి పెద్ద సమస్యగా మారింది. అక్కడ అవి సూక్ష్మ రేణువులుగా విచ్ఛిన్నమవుతున్నాయి. వాటిలోని రసాయనాలు పర్యావరణానికి, సకల జీవులకూ హాని కలిగిస్తున్నాయి. ప్రధానంగా మానవ శరీరంలోని హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతో పాటు క్యాన్సర్, మధుమేహం, సంతానలేమి వంటి ఇతర సమస్యలకు దారి తీస్తున్నాయంటున్నారు వైద్య నిపుణులు. ప్రపంచంలో ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో 5.2 కోట్ల టన్నులకు పైగా బహిరంగ ప్రదేశాలలో కాల్చివేస్తున్నారు. ఆ సమయంలో విడుదలయ్యే విష వాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఇవి జీవుల్లో అనేక రుగ్మతలకు కారణమవుతున్నాయి. ఓ సర్వే ప్రకారం గాలి ద్వారా మనం నిత్యం 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులని పీలుస్తున్నాం.

ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మీద నియంత్రణ విధించింది. చాలా వరకు ప్లాస్టిక్ ఉత్పత్తి సంస్థలను బ్యాన్ చేసింది. ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలను పూర్తిస్థాయిలో రీసైక్లింగ్ చేయించే దిశగా అడుగులు వేస్తోంది. సర్క్యులర్ ఎకానమీ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల భారాన్ని తగ్గించి ఆ రంగంలో ఉపాధి కల్పన కోసం ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. రీసైక్లింగ్ సంస్థలకు రాయితీ కల్పించి ప్రోత్సహించాలని సంకల్పిస్తోంది.

ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా కొన్ని దేశాల్లోని కార్పొరేట్ సంస్థలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. 'ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండకూడదు అనుకుంటే.. దాని జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం' అనే నినాదంతో అడుగులు వేస్తున్నాయి. యూకేలో ఇప్పటికే పలు సూపర్ మార్కెట్లు కూల్‌డ్రింక్ టిన్స్, గ్రీటింగ్ కార్డ్స్, బెడ్‌షీట్స్ వంటి వాటిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం మానేశాయి. ఉత్తర అమెరికాలోని వాల్‌మార్ట్ షాపింగ్ మాల్లో కూడా ప్లాస్టిక్ వాడకం తగ్గించారు. స్వీడన్‌కు చెందిన ఐసీఏ రిటైల్ సంస్థ పండ్లు, కూరగాయలపై బ్రాండ్ల పేర్లను లేజర్‌తో ముద్రించే ప్రయత్నం చేస్తోంది. యూనీలివర్, జాన్సన్ వంటి సంస్థలు టూత్‌పేస్ట్, డిటర్జెంట్లను మందుబిళ్ళల రూపంలో తయారుచేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి. అమెరికాలో పాల పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా సీసాలు, జగ్గుల్లో విక్రయించే విధానం ఇప్పటికే మొదలైంది. ఇది అన్ని దేశాలూ ఆచరించదగిన శుభపరిణామం.

అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మేము సైతం అంటూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించే మార్గాలను అన్వేషించి ఆచరణలో పెట్టాలి. ఇటీవలి కాలంలో అందుబాటులోకి వస్తున్న బయో ప్లాస్టిక్ వస్తువులతోపాటు సంప్రదాయ గుడ్డ సంచులు, జనపనార బ్యాగులు, విస్తళ్ళు, పేపర్ గ్లాసులు తదితర ప్రత్యామ్నాయాలు వాడాలి. చాలా వరకు పట్టణ ప్రాంతాల్లో ఇంటిలో చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. గ్రామస్థాయిలో కూడా మార్పు రావాలి. ఇళ్లలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలి. తప్పని పరిస్థితుల్లో వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను క్రమపద్ధతిలో వేరు చేసి రీసైక్లింగ్‌కు ప్రోత్సహించాలి. పిల్లలకు ప్లాస్టిక్ డబ్బాల్లో భోజనం పంపకుండా స్టీల్ బాక్సుల్లో పెట్టడం అలవర్చుకుంటే అటు పిల్లలకీ ఆరోగ్యం, ఇటు పర్యావరణ హితం కూడా. ఇలాంటి సామాజిక అంశాల పట్ల పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలి. యువత కూడా రీసైక్లింగ్ రంగంలోకి అడుగుపెట్టాలి. ప్రభుత్వాలు ఆ దిశగా అంకుర పరిశ్రమలను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

○ డా. పి కృష్ణయ్య, ఐఏఎస్ (రిటైర్డ్)
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

'అంబేడ్కర్ ఉంటే ఏం చేసే'వారంటే...!

'ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం చేసేవారు?' అని 'డానీ' రాసిన వ్యాసం చూశాను (మే 24). అంబేడ్కరూ, రాజ్యాంగమూ, హింసామార్గమూ అనే విషయాల్లో, డానీ గమనించని సంగతులు కొన్ని ఉన్నాయనిపించి, ఇది రాస్తున్నాను.

(1) 'మావోయిస్టులది, ప్రకటిత హింసా మార్గం' అన్నారు డానీ. మావోయిస్టులు హింసని ప్రయోగించిన సందర్భాల్ని గమనించవలిసిందే గానీ, వారి మార్గాన్నంతా హింసా మార్గం గానే భావించరాదని నా అభిప్రాయం.

అసలు చరిత్రలో, శ్రామికుల వర్గాన్ని అన్యాయంగా, బల ప్రయోగంతో అణచడానికి దోపిడీ వర్గం ఏర్పర్చుకున్నదే రాజ్యాంగ యంత్రం! మానవ చరిత్రలో ప్రారంభం నించీ, శ్రమ దోపిడీ వర్గానిదే ప్రకటిత హింసామార్గం. అనాదిగా, బానిస యజమానుల కాలం నించీ ప్రారంభమైంది దోపిడీ వర్గ హింసా మార్గమే. ఆ హింసా మార్గాన్ని ఎదుర్కొని, పాలక వర్గాధికారాన్ని కూల్చివేసి, దోపిడీనించీ విముక్తి చెందడానికి, శ్రామిక వర్గానికి 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' చూపిన మార్గం 'బలప్రయోగం'! ఆ మార్గంలో, ఆ వర్గం ఎన్ని అపజయాలు పొందినా, అదే దానికి స్వయం రక్షణ మార్గం. చరిత్రని చూస్తే, హింసని ప్రారంభించింది, దోపిడీ పీడనలకు గురి అయ్యే శ్రామిక జనాలు అని చెప్పడానికి ఎక్కడా ఆధారాలు లేవు. ఈ కాలపు ఉదాహరణే తీసుకుంటే, చారెడైనా భూమిలేని కూలీలూ, కౌలు రైతులూ, 'దున్నేవాళ్ళకే భూమి' అనే నినాదంతో, కమ్యూనిస్టుల నాయకత్వంలో సిద్ధపడితే, ప్రభుత్వం ఊరుకోదు. బలప్రయోగంతో అణిచివేస్తుంది. అప్పుడు స్వయంరక్షణ కోసం కమ్యూనిస్టులు కూడా, తప్పనిసరై, హింసా మార్గాన్నే అనుసరిస్తారు. 'సాయుధ పోరాటమే ఏకైక మార్గం!', 'వర్గ శత్రువు రక్తంలో చేతులు ముంచనివాడు విప్లవ కారుడే కాదు!' అనే తప్పుడు నినాదాల్ని, ప్రారంభకాలం నాటి మావోయిస్టు నాయకుడు చారుమజుందారు కూడా, మొదట్లోనే ఇవ్వలేదు. తెలంగాణ రైతాంగ పోరాటంలో గానీ, నక్సల్ బరీ పోరాటంలో గానీ, హింసని మొదట ప్రారంభించింది కమ్యూనిస్టులు కాదని చరిత్ర చెబుతోంది. కాబట్టి, 'మావోయిస్టులది ప్రకటిత హింసా మార్గం' అనడం న్యాయం కాదు.



(2) 'భారత రాజ్యాంగం ఆధునిక పవిత్ర గ్రంథం' అనీ, ప్రభుత్వం చేసే హింస, ఆ పవిత్ర గ్రంథంలో ఉన్న 'ఆదర్శాలకూ, మార్గదర్శకాలకూ అనుగుణంగా' లేదనీ భావించారు డానీ. ప్రభుత్వం చేపట్టిన హింసామార్గాన్ని ఖండించడానికి, రాజ్యాంగాన్ని 'పవిత్ర గ్రంథం'గా వర్ణించనక్కరలేదు. వర్గాలుగా విడిపోయి వున్న ఏ దేశంలో అయినా, రాజ్యాంగం అనేది, అక్కడ ఉండే ప్రభుత్వాలకు, ప్రత్యర్థుల్ని, ముఖ్యంగా విప్లవకారుల్ని అణచడానికి రకరకాల చట్టాల్ని అందుబాటులో ఉంచుతుంది. అసలు, ఒక సమాజంలో సైన్యమూ, పోలీసూ, రకరకాల సాయుధ బలగాలూ, ఆయుధాలూ, గూఢచారి వ్యవస్థ ఉన్నాయంటే, అవసరమైనప్పుడు, ఆ ప్రభుత్వాలు హింసా మార్గం అనుసరించడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అర్థం. అందుకే, ఇప్పటి సందర్భంలో, కగార్లనీ, బ్లాక్ ఫోరెస్టుల్నీ, డ్రోన్లనీ, రకరకాల పేర్లున్న అరడజను సాయుధ బలగాల్నీ ఉపయోగించడం! వీటిని ఉపయోగించకూడదని, డానీ చెప్పిన 'పవిత్ర రాజ్యాంగం'లో ఎక్కడా లేదు!

(3) 'ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమానత్వాన్ని' సాధించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించకపోతే, బాధితులైన ప్రజలు తిరగబడతారని రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్‌గా అంబేడ్కర్ హెచ్చరించారని డానీ అంటున్నారు. అవును, ఆయన అలా అన్న మాట నిజమే! మరి, ఆయన అలా హెచ్చరించిన సమయంలోనే, 1948 సెప్టెంబరులో, తెలంగాణ గ్రామాలలోకి, కమ్యూనిస్టుల నాయకత్వాన నడుస్తున్న రైతాంగ పోరాటం ఒక రకమైన సమానత్వాన్ని కోరుతూ జరుగుతున్నదే గదా? మరి అలాంటి బాధితుల పోరాటాన్ని అణచడానికి, 50 వేల సైన్యాన్ని పంపిన ప్రభుత్వంలో అంబేడ్కర్ ఒక మంత్రిగా ఎలా ఉండగలిగారు? ఇప్పటి ప్రభుత్వం అనుసరిస్తున్న హింసా మార్గాన్ని ఖండించడానికి, అణచివేత చట్టాలకూ, సాయుధ బలగాలకూ వీలునిచ్చిన రాజ్యాంగాన్ని తయారుచేసిన రచనా కమిటీలో ఉన్నవ్యక్తి మాటల్ని ఉటంకించడం వల్ల, పాఠకులు అటు రాజ్యాంగాన్ని గానీ, ఇటు ఆ వ్యక్తిని గానీ, సరిగా అర్థం చేసుకోవడం వీలు కాదు. ఆనాడే, రైతాంగం మీదా, వారి తరఫున పోరాడుతున్న కమ్యూనిస్టుల మీద, తన ప్రభుత్వమే హింసాకాండ జరుపుతున్నప్పుడు, ఏమి చెయ్యని అంబేడ్కరు, ఇప్పుడు జరుగుతున్న హింసని చూసి 'ఏమి చేసే వాడో' అని ప్రశ్నించడం తార్కికంగా లేదు.

కొన్ని విషయాల్ని గమనించకపోయినా, ఆదివాసీల పట్లా, వారిని సంఘటితం చేసి, వారి తరఫున పోరాడుతున్న మావోయిస్టుల పట్లా, సహృదయమైన ప్రేమతోనే సాగింది డానీ వ్యాసం. కానీ, అణచివేతకి ఆస్కారం ఇచ్చే రాజ్యాంగాన్ని 'పవిత్ర గ్రంథం' అనడం, అంబేడ్కరు ఉంటే ఏదో చేసే వారన్నట్టు రాయడం వల్ల, కొన్ని భ్రమల్ని కలిగించే ప్రమాదం ఉంది.

◆ నౌరోజీ

మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందా?

భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీకి ఎన్డీఏ పక్షాలు బాకాలు ఊదుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై అసమగ్ర అంకెల గారడీతో గొప్పలు చెబుతున్నారు. ఇటీవల జరిగిన నీతిఆయోగ్ సమావేశంలో ప్రపంచంలోకెల్లా మన దేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) నాలుగవ స్థానానికి చేరిందని, త్వరలో మూడవ స్థానానికి ఎగబాకుతుందని.. మోదీ పరిపాలనే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రధాన కారణమంటూ బీజేపీతోపాటు ఎన్డీఏ పక్ష నేతలు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మోదీకి భజన చేయడం అర్థరహితం. 2025 నాటికి జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు, భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు. జపాన్ జనాభా 12 కోట్ల 30లక్షలు ఉండగా, భారత్ జనాభా దాదాపు 144 కోట్లు. జనాభా ఆధారంగా జపాన్ తలసరి ఆదాయం 39,350 డాలర్లు, అయితే భారత్ తలసరి ఆదాయం 2,880 డాలర్లు. దీన్ని మసిపూసి మారేడుకాయ చేసి మన దేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందినట్లుగా ఎన్డీఏ పక్షాలు చెప్పుకోవడం అవివేకం.

2015లో మోదీ అధికారంలోకి వచ్చే నాటికి దేశానికి రూ.84లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. 2025 నాటికి అవి రూ.224 లక్షల కోట్లు అయ్యాయి. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ మరింత దిగజారింది. ఆహార సూచికలో ప్రపంచవ్యాప్తంగా 127 దేశాల్లో భారత్ 105వ స్థానానికి పరిమితమైంది.

1987 వరకు చైనా, భారత్ ఆర్థిక వ్యవస్థలు సమాంతరంగా ఉన్నాయి. 1987లో చైనా ఆదాయం 0.27 ట్రిలియన్ డాలర్లుగా, భారత్ ఆర్థిక వ్యవస్థ సమానంగా ఉన్నది. 2025లో భారత్ జీడీపీ 4.19 ట్రిలియన్ డాలర్లు ఉంది. అంటే 0.27 ట్రిలియన్ డాలర్ల నుంచి 4.19కి ట్రిలియన్ డాలర్లకు మనం కాస్త ఎదిగాం. కానీ చైనా 0.27 ట్రిలియన్ డాలర్ల నుంచి 19.23 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. అంటే భారత్ కంటే నాలుగైదు రెట్లు అధికంగా చైనా ఆర్థిక వ్యవస్థ ఉంది. ప్రస్తుతం చైనా తలసరి ఆదాయం 13,687 డాలర్లు కాగా, భారత్ తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. ఈ క్రమంలో జపాన్ కంటే జీడీపీలో కొద్దిగా భారత్ దాటింది, దీంతో ఆ తర్వాత జర్మనీని భారత్ దాటిపోతుందనే ప్రగల్భాలు పలుకుతున్నారు. మన దేశ ఆర్థిక వ్యవస్థను జపాన్‌తో కాదు, చైనాతో పోల్చుకోవాలి.

దేశంలో నరేంద్ర మోదీ అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు కేవలం శత కోటీశ్వరులుకే మేలు చేయగా, పేదవర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఏడేళ్ళ కింద



జపాన్‌లో శత కోటీశ్వరులు 45 మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 39కి పడిపోయింది. అదే భారత్‌లో 2015లో శత కోటీశ్వరులు 97 మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 210కి ఎగబాకింది. మోదీ శత కోటీశ్వర్లులను పెంచడంతో, భారత్‌లో జీడీపీ పేదల దరిచేరడం లేదు. భారత్‌లో ఒక శాతం జనాభా చేతిలో 40 శాతం సంపద ఉండగా, 50 శాతం మంది ఉన్న పేద వర్గాల చేతిలో కేవలం మూడు శాతం సంపద ఉంది. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో పేదలు పేదలుగానే ఉండగా, శత కోటీశ్వరులు మరింతగా పెరిగిపోతున్నారు.

2015లో మోదీ అధికారంలోకి వచ్చే నాటికి దేశానికి రూ.84లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. ఇందులో స్వదేశీ అప్పులు 47.38 లక్షల కోట్లు, విదేశీ అప్పులు 37.4లక్షల కోట్లు ఉంది. 2025 నాటికి అవి రూ.224 లక్షల కోట్లు అయ్యాయి. ఇందులో స్వదేశీ అప్పులు 166.57 లక్షల కోట్లు, విదేశీ అప్పులు 57.4లక్షల కోట్లకు పేరబెట్టి, దేశాన్ని పూర్తిగా మోదీ అప్పులపాల్జేశారు. మోదీ పగ్గాలు చేపట్టిన తరువాత అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ మరింత దిగజారింది. ఆయన అధికారంలోకి రాక ముందు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇదే రూపాయి విలువ తగ్గుదల మీద బాబా రామ్‌దేవ్‌తో సహా బీజేపీ నేతలంతా నానా యాగీ చేశారు. మోదీ అధికారంలోకి వచ్చే నాటికి మార్కెట్‌లో డాలర్‌కు రూపాయి మారకం విలువ 60రూపాయలుగా ఉండగా, ప్రస్తుతం అది 86కు చేరింది. తాజా లెక్కల ప్రకారం ఆహార సూచికలో ప్రపంచ వ్యాప్తంగా 127 దేశాల్లో కెల్లా భారత్ 105 స్థానానికి పరిమితమైంది. మోదీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లల్లో మన దేశ ఆకలి సూచీ స్కోరు 28.2 నుంచి 27.38కి మారింది. అదే కాలంలో పాకిస్థాన్ స్కోరు 29.8 నుంచి 27.98కి తగ్గింది. దేశ తలసరి ఆదాయం చూస్తే భారత్ 136వ స్థానంలో ఉంది. దివాళా తీసిన శ్రీలంక 133వ స్థానంలో ఉంది.

2014లో మోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేకపోయారు. రైతుల సమస్యల్ని పరిష్కరించకపోవడంతో వారి ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. మద్దతు ధర పెంచకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని యువతను నమ్మించి, అధికారంలోకి వచ్చాక మోదీ మోసగించారు. విదేశాల్లో ఉన్న బ్లాక్ మనీని వెనక్కి రప్పిస్తానని చెప్పినా, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు. బ్లాక్‌మనీ అరికట్టడానికి పెద్ద నోట్ల రద్దు డ్రామాలాడారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన హామీల అమలు ఊసే లేదు. దేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. ధరల్ని నియంత్రించలేదు. పైపెచ్చు సమాజంలో చీలికలు తెచ్చారు. కుల, మతాల మధ్య చిచ్చు రగిలించారు. మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అవేమీ గుర్తించకుండా అంకెల గారడీతో జపాన్‌తో పోల్చుతూ, మన దేశం ముందుకు పోతున్నదన్న భ్రమలకు తెరలేపారు. మోదీకి, ఎన్డీఏ కూటమికి చిత్తశుద్ధి ఉంటే భారత్ ఆర్థిక వ్యవస్థను జపాన్‌తో కాకుండా చైనాతో పోటీపడే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.

• కె. రామకృష్ణ
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్

ఇక ఈజీ ఎఫ్ఐఆర్

కమిషనరేట్‌లో కొత్తగా ఏఐ సాఫ్ట్‌వేర్ టూల్

- ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న పోలీసులు
- ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు, రిమాండ్ రిపోర్టులు చేత్తో రాయకుండా ఉండేందుకే..
- తొలుత బాధితుడి వివరాలు రికార్డు
- ఆ తర్వాత దానంతటదే ఫిర్యాదు తయారీ
- ఎఫ్ఐఆర్‌ను కూడా చకచకా పూర్తిచేసేస్తుంది

8



ఇక పోలీస్‌స్టేషన్లలో నిమిషాలకొద్దీ చేత్తో రాసే ఫిర్యాదులకు.. ఆ తర్వాత గంటలకొద్దీ రాసే ఎఫ్ఐఆర్‌లకు.. నిందితులను కోర్టుకు తీసుకెళ్లేటప్పుడు రాసే సీడీ (కేసు డైరీ)తో పాటు రిమాండ్ రిపోర్టులు రాయడానికి ఇక చెల్లు. కమిషనరేట్‌లో త్వరలో అందుబాటులోకి రానున్న ఏఐ టూల్ ద్వారా ఫిర్యాదు చేయడం నుంచి రిమాండ్ రిపోర్టు రాయడం వరకు అన్నీ సులభం కానున్నాయి.



బీచ్ పండుగకు వేళాయె!

నేడు మంగినపూడిలో మసులా బీచ్ ఫెస్టివల్ ప్రారంభం

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- 60 అడుగుల గేట్ వే ఆఫ్ అమరావతి స్థూపం ఆవిష్కరణకు సిద్ధం

6

జెట్ సిటీకి కదలిక!

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పూర్తి చేయటానికి ప్రభుత్వం సిద్ధం

రాష్ట్ర క్యాబినెట్‌లో జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ప్రతిపాదన

- బ్యాలెన్స్ పనులు పూర్తి చేసేందుకు ఏపీ ఎడ్కో, ఏపీఐఐసీలకు బాధ్యత
- రూ.20.39 కోట్ల నిధులు కేటాయింపు
- పూర్తికాగానే.. ఫుట్‌వేర్ ఇండస్ట్రీస్‌కు కేటాయింపు
- ఆ తర్వాత వరుసగా.. 2, 3, 4 ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులు



జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్ సిటీ) ప్రాజెక్టుకు కదలిక వచ్చింది. పునర్నిర్మాణానికి అడుగులు పడ్డాయి. జెట్ సిటీలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులను పూర్తి చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాల శాఖ దీనికి సంబంధించిన ప్రతిపాదనను తీసుకురాగా, సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం ఈ ప్రతిపాదనను ఆమోదించింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):
గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినప్పుడే.. రాష్ట్రంలో ఆర్థిక నగరంగా జక్కంపూడిని తీర్చిదిద్దాలని నిర్ణయించారు. లివ్ అండ్ వర్క్ విధానంలోనే నివాసం, పని ఒకే చోట ఉండేలా జెట్ సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 15 వేల ఇళ్ల నిర్మాణ పనులకు టెండర్లు పిలవగా, గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 10 వేల ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో 6,750 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇక్కడ నివశించే వారు పనిచేయటం కోసం ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ అంటే విడివిడిగా పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయకుండా ఒకే కాంప్లెక్స్ కింద యూనిట్లు పనిచేస్తాయి. అప్పట్లో నగరంలోని ఫుట్‌వేర్ ఇండస్ట్రీస్ కోసం దీని ఏర్పాటుకు పూనుకున్నారు. జక్కంపూడిలోని వేమవరం దగ్గర మొదటి దశ ఫ్లాటెడ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చకచకా మిగతా 6లో..



● సంబరాలు



కూటమి పార్టీలకు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన రోజు(జూన్ 4)ను పురస్కరించుకుని బుధవారం జిల్లావ్యాప్తంగా సంబరాలు జరిగాయి. నగరంలోని స్క్యూ బ్రిడ్జి సమీపంలో ఉన్న ఇస్కాన్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

● నిరసనలు



ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం 'వెన్నుపోటు దినం' కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి సర్కిల్-3 కార్యాలయంలోని రెవెన్యూ ఆఫీసు వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

బదిలీల వేళ పదోన్నతులు

బదిలీల వేళ.. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్‌లో కొందరు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించటం వివాదాస్పదమవుతోంది. ఈ ముసుగులో జడ్పీ కార్యాలయ అధికారులు భారీగా ముడుపులు దండుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

జడ్పీలో ధనకార్యాలు



- ఆరుగురు ఉద్యోగులకు పదోన్నతుల వివాదం
- నిబంధనలకు విరుద్ధంగా బదిలీల సమయంలో..
- భారీగా డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు
- ఏవో పోస్టింగుల్లోనూ అవినీతి వ్యవహారాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు బదిలీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు ఈనెల 9వ తేదీ వరకు గడువు విధించింది. అయితే, కృష్ణాజిల్లా పరిషత్‌లో బదిలీల వేళ ఉద్దేశపూర్వకంగా పదోన్నతులకు తెరతీశారు. జడ్పీ చైర్‌పర్సన్ హారిక, సీఈవో కన్నమనాయుడు సమక్షంలో కొందరైతే సంబరాలు చేసుకున్నారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ అమల్లో ఉన్నపుడు పదోన్నతులు ఇవ్వకూడదు. ఎందుకంటే.. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్లు ఉంటే వారికి వారు స్థానచలనం కలిగేటప్పుడు అన్యాయం జరుగుతుందని. బదిలీలు పూర్తిగా నిర్వహించాక పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తే ఎవరికి ఏ సమస్యా ఉండదు. కానీ, ఉమ్మడి కృష్ణా జడ్పీ అధికారులు అకస్మాత్తుగా పదోన్నతుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న కొందరికి సీనియర్ అసిస్టెంట్లుగా మిగతా 6లో..

ఏవో పోస్టింగుల్లో అవినీతి కంపు

జడ్పీ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఏవోలను సస్పెండ్ చేశారు. వీరు 4 నుంచి 8 నెలల్లోపు తగిన కారణాలు చూపిస్తే తిరిగి పోస్టింగ్ పొందొచ్చు. సస్పెండ్ అయిన 6 నెలల తర్వాత కూడా ఇప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వీరికి తిరిగి పోస్టింగ్‌లు ఇప్పిస్తామన్న ఆఫర్ ఇచ్చి భారీగా డబ్బు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, వీరికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా.. మరో ఇద్దరికి వారి స్థానాల్లో పోస్టింగ్‌లు కల్పించారు. ఈ వ్యవహారంలోనూ కాసులు చేతులు మారాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం.. సస్పెండ్ అయిన పోస్టుల్లో ఆరు నెలల వరకు ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వకూడదు. కానీ జడ్పీ అధికారులు అనధికారికంగా పోస్టింగ్‌లు ఇచ్చేశారు.



అదిరేలా..

రైల్వేస్టేషన్ డిజైన్లు



- రూ.845 కోట్లతో విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి
- సరికొత్త డిజైన్లు విడుదల చేసిన రైల్వే అధికారులు
- సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం
- గుణదల, ఐఆర్ఆర్ ఆర్వోబీ, వాంబేకాలనీ ఆర్‌యూబీలకు మోక్షం
- రెండు నెలల్లో అనుమతులు తీసుకుంటామని హామీ
- తెరపైకి సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్ ప్రతిపాదన
- ఎర్రకట్ట బ్రిడ్జి స్థానంలో నాలుగు వరుసల ఆర్వోబీ



విజయవాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ డిజైన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. ఈ డిజైన్లను విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు బుధవారం విడుదల చేశారు. వీటిని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్‌కు డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ అందించారు. ప్రైవేట్ అండ్ పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూ.845 కోట్లతో ఆధునికీకరించనున్నారు. ఇప్పుడున్న రైల్వేస్టేషన్ భవనాలను తొలగించి, రాయల్ డిజైన్‌తో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ ఆధునికీకరణలో భాగంగా పశ్చిమ వైపు ఎంట్రన్స్ కూడా మిగతా 6లో..

బంగారం శ్రీను దొరికాడు

హైదరాబాద్‌లో పట్టుకున్న సింగ్‌నగర్ పోలీసులు

విజయవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బంగారం చీటీలు నిర్వహించి రూ.కోట్లు టోకరా వేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు ఎట్టకేలకు చిక్కాడు. అతడిని హైదరాబాద్‌లో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. ఈయన బాధితులు ఇప్పటి వరకు మొత్తం 60 మంది పోలీసులను ఆశ్రయించగా, రూ.80 కోట్ల వరకూ టోకరా వేసినట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేశారని తెలుసుకున్న శ్రీనివాసరావు ఖాతాదారులకు ఆడియో సందేశాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పంపారు. రెండు రోజుల్లో వచ్చి బకాయిలు సర్దుబాటు చేస్తానని అభయమిచ్చాడు. తర్వాత తన దొంగబుద్ధిని బయట పెట్టుకున్నాడు. న్యాయవాది ద్వారా కోర్టులో లొంగుబాటు పిటిషన్‌ను దాఖలు చేయించాడు. దీన్ని కోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత విజయవాడ లోటస్ ల్యాండ్‌మార్క్‌లో ఉన్న భార్య, హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె సాయి అమృత, అల్లుడు అభిలాష్, కుమారుడు నిఖిల్‌ను మాయం చేశాడు. పోలీసులు అతడి కోసం గాలించడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కొన్నిరోజులుగా ఒక బృందం హైదరాబాద్‌లోనే నిఘా కొనసాగించింది. చివరికి ముచ్చెర్లకు పోలీసులు సంకెళ్లు వేశారు. అతడిని విజయవాడ తీసుకొచ్చి విచారణ చేయనున్నారు.





అతిథులకు ఆహ్వానం..



సందర్శకులను ఆకట్టుకునేలా తీరం వెంబడి ఏర్పాటు చేసిన కళాకృతులు

జాతీయ స్థాయిలో గురువారం నుంచి కృష్ణాజిల్లా మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మసులా బీచ్ ఫెస్టివల్ ప్రేక్షకుల ను ఉర్రూతలూగించనుంది. వేలాది క్రీడాకారులు, కళాకారులతో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కృష్ణా జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించనున్నారు. నెలరోజులుగా కళాకారులు నిర్మిస్తున్న కళాఖండాలు బీచ్‌లో ఒక ప్రత్యేకత సంతరించుకున్నాయి. నాలుగు రోజుల పాటు 15 లక్షల మంది సందర్శకులు బీచ్‌కు రానున్న దృష్ట్యా జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి నాలుగు రోజులు 'మసులా ఫెస్ట్' సంబరాలు

- మంగినపూడి బీచ్‌లో కొలువుదీరిన కళాకృతులు
- ప్రత్యేక ఆకర్షణగా గేట్ వే ఆఫ్ అమరావతి
- 60 రకాలకు పైగా ఫుడ్ స్టాల్స్
- జల క్రీడలకు జిల్లాకు చేరుకున్న క్రీడాకారులు
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు

విజయవాడ/మచిలీపట్నం టౌన్ జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీరంలో.. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడతారు. బీచ్‌లో ఇసుక తెన్నెలపై సరదాగా గడపాలన్న ఆశ అందరికీ ఉంటుంది. వారి ఆశలను నిజం చేస్తూ మచిలీపట్నం సాగరతీరాన నేటి నుంచి 8వ తేదీ (ఆదివారం) వరకు నాలుగు రోజుల పాటు 'మసులా ఫెస్ట్' బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా జాతీయ స్థాయి క్రీడలు, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు మంగినపూడి బీచ్ వేదిక కానుంది. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానుండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



కార్యక్రమం విజయవంతం కావాలని యాగం నిర్వహిస్తున్న కొల్లు నీలిమ

ప్రత్యేక ఆకర్షణగా గేట్ వే ఆఫ్ అమరావతి

'మసులా ఫెస్ట్'లో గేట్ వే ఆఫ్ అమరావతి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే మంగినపూడి బీచ్‌ను సర్వాంగ సుందరంగా రకరకాల బొమ్మల ఆకృతులతో అందంగా తీర్చిదిద్దారు. బీచ్ ఫెస్టివల్‌లో స్టాల్స్, కార్యక్రమాలను పరిచయం చేసేలా మరో గేటు కూడా ఏర్పాటు చేశారు. సముద్ర జీవులైన శంఖం, అమీబా, నత్త, చేపల బొమ్మలు సందర్శకులను కనువిందు చేయనున్నాయి. బీచ్‌లో వంద అడుగులతో త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేశారు.

60 రకాలకు పైగా ఫుడ్‌స్టాల్స్

వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన సుమారు 60రకాల ఫుడ్‌స్టాల్స్‌తో బీచ్ ఫెస్టివల్ ఆహారప్రియులను అలరించనుంది. రాష్ట్రానికి చెందిన వంటకాలే కాకుండా దేశంలోనే ప్రసిద్ధి చెందిన రుచులకు మంగినపూడి బీచ్ వేదిక కానుంది. ఫుడ్‌స్టాల్స్‌తో పాటు కలంకారీ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల స్టాల్స్ పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.

క్రీడలతో కొత్త కళ

ఈసారి బీచ్ ఫెస్టివల్ క్రీడలతో కొత్తకళ సంతరించుకోనుంది. జాతీయ స్థాయిలో బీచ్ కబడ్డీ, వాలీబాల్, జలక్రీడలు సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేలా.. కనోయింగ్(సముద్ర అలలపై బోటు విహారం) మరింత ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే 29 రాష్ట్రాలకు చెందినన క్రీడాకారులు బందరు చేరుకున్నారు.

> బందరులో జరిగే 'మసులా ఫెస్ట్' రాష్ట్ర పర్యాటక రంగానికి తోడ్పాటును అందిస్తుందని మంత్రి నారా లోకేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజులపాటు నిర్వహించ
>
> **విజయవంతం చేయాలి**
>
> 
>
> నున్న బీచ్ ఫెస్టివల్ దేశంలోనే అతిపెద్దదిగా ఆయన అభివర్ణించారు. పర్యాటక రంగం అభివృద్ధితో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మంత్రి రవీంద్రను ఆదర్శంగా తీసుకుని తీరప్రాంత ఎమ్మెల్యేలు తమవంతు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. బీచ్‌ఫెస్టివల్‌లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. - మంత్రి నారా లోకేశ్

కార్యక్రమ విజయవంతం కావాలని..

బీచ్ ఫెస్టివల్ విజయవంతం కావాలని వేద పండితుల సహకారంతో పీవీ ఫణికుమార్ రుద్రహోమం నిర్వహించారు. హోమ కార్యక్రమాల్లో మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ పాల్గొన్నారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ప్రతినిధులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, చిత్తజల్లు నాగరాము తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

> మసులా బీచ్ ఫెస్టివల్-2025 జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నాం. 2018లో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈసారి
>
> **జాతీయ స్థాయిలో ఫెస్ట్..**
>
> 
>
> నాలుగు రోజులపాటు బీచ్ ఫెస్టివల్‌ను మెగా ఈవెంట్‌గా నిర్వహిస్తున్నాం. 'మన ఊరు-మనపండుగ' నినాదంతో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నాం.
>
> - మంత్రి కొల్లు రవీంద్ర

అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

- కలెక్టర్ బాలాజీ



మసులా బీచ్ ఫెస్టివల్‌లో పర్యాటకశాఖ, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ, రెవెన్యూ, ముడా, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు నెల రోజులుగా పనిచేస్తున్నారు. యాత్రీకులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాం. చిలకలపూడి నుంచి మంగినపూడి బీచ్ వరకు యాత్రికులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. కోనేరుసెంటర్ నుంచి ఆర్టీసీ బస్సులు, బీచ్‌కు వచ్చే అతిథులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

బీచ్ ఫెస్టివల్‌కు ప్రత్యేక రూట్లు

- ఎస్పీ గంగాధరరావు



బీచ్ ఫెస్టివల్‌కు వెళ్లే వాహనాలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రత్యేక రూట్లలో దారి మళ్లించాం. టూరిస్టు బస్సులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశాం. అలాగే టూ వీలర్లకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశాం. కార్లు, ఆటోల్లో వచ్చి తిరిగి వెళ్లేవారు గిరిపురం, సత్తెనపాలెం, వాటర్ ట్యాంకు జంక్షన్, కెనరా బ్యాంకు పక్క నుంచి కంసాలివారిపాలెం, జి సత్తెనపాలెం, గోకవరం, కాకర్లమూడిపాలెం, నందమూరు గ్రామాల మీదుగా నేషనల్ హైవేకు చేరుకోవాల్సి ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు

గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. చల్లపల్లి, విజయవాడ, గుడివాడ వైపు నుంచి వచ్చే వాహనాలను చిలకలపుడి రింగ్, చిలకలపుడి రైల్వే గేటు వైపుగా తరలిస్తారు. బీచ్‌కు ఎడమ వైపు కార్లు, కుడివైపు బైక్‌లు పార్కింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు. బస్సులు, లారీలు బైక్‌లు పార్కింగ్ చేసే వైపు కొంచెం దూరంగా తిరిగి ప్రయాణానికి తిప్పుకునే విధంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.

> మంగినపూడి బీచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్‌కు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు వస్తున్నారు.
>
> **ప్రజలు తరలి రావాలి**
>
> 
>
> జాతీయస్థాయి క్రీడాకారులు ఫెస్టివల్‌కు రావడం ముదావహం. క్రీడాభిమానులు ఈ పోటీలను తిలకించి స్ఫూర్తిని పొందుతారని ఆశిస్తున్నాం.
>
> - ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

> బీచ్ ఫెస్టివల్‌లో స్టాల్స్ ఫుడ్‌కోర్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. యువత కేరింతలు కొట్టేలా ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. గొప్ప కళాకృతులు బీచ్ ఫెస్టివల్‌కు
>
> **ప్రత్యేక స్టాల్స్, ఫుడ్‌కోర్టులు**
>
> 
>
> రానున్నాయి. ప్రణాళికాబద్ధంగా బీచ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు.
>
> - డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

కార్యక్రమాల వివరాలు..

- గురువారం జాతీయస్థాయి క్రీడలతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఉదయం 9 గంటలకు క్రీడాకారుల ఆధ్వర్యంలో 60 అడుగుల ఎత్తులో అసెంబ్లీ, అమరావతి నమూనాతో ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి, 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కణ.
- శుక్రవారం సాయంత్రం నుంచి మూడురోజుల పాటు సినీ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 100కు పైగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు. తొలిసారిగా జాతీయస్థాయిలో సీ కయాకింగ్ స్పోర్ట్స్. 16 రాష్ట్రాల నుంచి 600 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు. బీచ్ వాలీబాల్ పోటీలు పురుషులకు, మహిళలకు వేర్వేరుగా లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పురుషుల జట్లు పాల్గొంటారు. విశాఖపట్నం పశ్చిమగోదావరిజిల్లా, గుంటూరు జిల్లాల మహిళల జట్లు పాల్గొంటాయి.



డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, వసంత కృష్ణప్రసాద్

రైల్వే సమస్యలు పరిష్కరించండి

- డీఆర్ఎం నరేంద్రతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ

రైల్వేస్టేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గుణదలలోని రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి), రాయనపాడు స్టేషన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌ను కోరారు. బుధవారం డీఆర్ఎంను ఆయన చాంబర్‌లో కలిసి విజయవాడ సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా వారు సెంట్రల్, పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో సమస్యలను డీఆర్ఎంకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పనులకు అనుమతులకు పూర్తి సహకారం అందజేస్తామని ఎంపీ తెలిపారు. అనంతరం డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఏడీఆర్ఎం ఎడ్విన్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్లు మనోహర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, సీనియర్ డీఈ ఎన్.వరుణ్‌బాబు, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, సీనియర్ డీవోఎం నరేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..!

- సీపీకి వినతిపత్రం ఇచ్చిన గులకరాయి కేసు నిందితుడు

విజయవాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు అజిత్‌సింగ్ నగర్‌లో మాజీ సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కేసులో తనను అన్యాయంగా ఇరికించారని నిందితుడు వేముల దుర్గారావు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు వినతిపత్రం అందజేశాడు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి దుర్గారావు సీపీని కలిశాడు. అప్పటి పోలీసు అధికారులు తనను, తన భార్యను బెదిరించి నేరం మోపారని ఆరోపించాడు. ఆ అధికారులపై కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని కోరాడు.

ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా అమరావతి

- 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా నిర్మిస్తున్నాం
- వనమహోత్సవ ఏర్పాట్లలో మంత్రి నారాయణ

తుళ్లూరు, (అనంతవరం) జూన్ 4 : ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా అమరావతి ఉండాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి నారాయణ బుధవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వనమహోత్సవంలో పాల్గొని, అనంతవరం పార్కులో గురువారం మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడైనా నిర్మాణాలకు పదిశాతం బ్లూ అండ్ గ్రీన్ ఉంటుంది. కాని అమరావతిలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. సింగపూర్, జపాన్‌తో సంప్రదించి అక్కడి మాదిరిగా మంచి ప్లాంటేషన్ ఉండేలా చూడమని సీఎం ఆదేశించారన్నారు. ఆయా దేశాల్లో శాస్త్రీయంగా ఉండేలా మొక్కలు నాటుతారన్నారు. అదేవిధానంలో అమరావతిలో కూడా రకరకాల మొక్కలు శాస్త్రీయ విధానంలో నాటేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ చైర్మన్ లక్ష్మీ పార్థసారధి, రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, తెలుగు రైతు నాయకులు నూతలపాటి రామారావు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ సీఐ కొంకా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గాడిన పడిన వ్యవసాయ రంగం

- మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో కొనకళ్ల నారాయణ



మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డను సత్కరిస్తున్న కొనకళ్ల నారాయణ, వెనిగండ్ల

గుడివాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగం గాడిలో పడిందని, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, రైతులకు మేలుచేసే కార్యక్రమాలను మార్కెట్ యార్డు కమిటీ నిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, రాష్ట్రంలో సైకోపాలన పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజునే మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాకతో రైతాంగం సంతోషంగా ఉందని, ధాన్యం నగదును కేవలం 24గంటల్లో వారి ఖాతాల్లో జమ చేసి మంచి ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే బూట్లు తుడుస్తా అని ప్రగల్భాలు పలికిన వ్యక్తి ఏడాదిగా ఎక్కడికి పారిపోయాడో చెప్పాలన్నారు. గుడివాడ అభివృద్ధిని ఎవరు అడ్డుకోవాలని చూసినా సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం సబ్సిడీపై విత్తనాలను, వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, రాంబాబు, దానేటి సన్యాసిరావు, మురళీ, జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామినేని వెంకటకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత నూతన కమిటీ చైర్మన్ చాట్రగడ్డ రవి, సభ్యులు భారీ ర్యాలీగా మార్కెట్ యార్డుకు తరలివచ్చారు. అనంతరం మార్కెట్ యార్డు కార్యదర్శి భాస్కరరావు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా చాట్రగడ్డ రవి, వైస్ చైర్మన్‌గా గొరిపర్తి వెంకటనాగ సుబ్బారావు, సభ్యులుగా ఆలుమూరి మురళీకృష్ణ, చీకటి నాగలక్ష్మి, గంపా వెంకటరమణ, గుల్లపల్లి రమాదేవి, కట్టా శ్రీనివాసరావు, కొండపల్లి రాఘవరెడ్డి, లింగం శివరావు, సూరపనేని ప్రదీప్, వెలగలేటి వెంకటేశ్వరమ్మ, యడ్లపల్లి నాంచారమ్మ, రషీద్ బేగ్, తోటనాగలక్ష్మి, వీర్ల విజయలక్ష్మి, వడ్డే క్రాంతికుమార్‌లు ప్రమాణస్వీకారం చేశారు.

9న విశాఖ స్టీల్ కార్మికులకు సంఘీభావ నిరసన

వన్‌టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీలు ఉత్పత్తిలో 13వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు కంపెనీల ఒత్తిడితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 5,400 మందిని తొలగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు, నష్టపరిహారం చెల్లించకుండా, ఏకపక్ష నిర్ణయంతో తొలగించటం చట్టవిరుద్ధమన్నారు. దీనికి నిరసనగా కార్మికులు మే 20 నుంచి నిరవధిక సమ్మెకు నోటీసు ఇచ్చారని తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్‌ను ఖైదీల జైలుగా మార్చిందని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర మాట్లాడుతూ, 40 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్టీల్ ప్లాంట్ దగ్గర పోలీసుల మోహరింపు పెరుగుతుందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌ను నూరుశాతం ప్రైవేటీకరించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పోలారి మాట్లాడుతూ, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అనకాపల్లిలో ఇనుప ఖనిజ గనుల కోసం కేంద్ర ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాస్తి కిషోర్ బాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మరీదు ప్రసాదబాబు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావంగా ఈనెల 9న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేసే కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



ఫెరోజ్

స్నేహితుడిపై హత్యాయత్నం

- ట్యూబ్‌లైట్ పగులగొట్టి గొంతులో పొడిచిన నిందితుడు
- వివాహేతర సంబంధమే కారణం
- బాధితుడు, నిందితుడి ఇంట్లో గంజాయి స్వాధీనం

విజయవాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య నిప్పు రాజేసింది. ఒకరి ప్రాణాన్ని మరొకరు తీసుకునే పరిస్థితిని తెచ్చింది. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న స్నేహితుడిని ట్యూబులైట్ పగలగొట్టి పొడిచాడు ఓ యువకుడు. ఈ ఘటన విజయవాడ చుట్టుగుంటలో బుధవారం జరిగింది. ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంతానికి చెందిన షెకావత్ ఆలీ టైల్స్ వర్కర్. కొన్నాళ్ల క్రితం ఆలీ ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఒక పాప ఉంది. కొంతకాలం తర్వాత దంపతుల మధ్య వివాదాలు మొదలయ్యాయి. తనను వేధిస్తున్నాడని ఆలీ భార్య మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు క్రైం నంబర్ 10/2025తో కేసు నమోదు చేశారు. ఆలీ కోసం తరచుగా ఇంటికి వెళ్లిన అరండల్ పేటకు చెందిన ఫెరోజ్ అతడి భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కేసు నమోదైన తర్వాత ఆలీ కుటుంబాన్ని వదిలేసి హైదరాబాదుకు వెళ్లిపోయాడు. తర్వాత ఈ వివాదాలకు కారణం ప్రాణ స్నేహితుడైన ఫెరోజ్ అని గుర్తించాడు. ఇద్దరూ కలిసి కొన్నాళ్ల క్రితం మద్యం తాగుతున్న సందర్భంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. తన భార్యతో వివాహేతర సంబంధం నడపడం సరికాదని, అది మంచి స్నేహం కాదని ఫెరోజ్‌తో ఆలీ అన్నాడు. ఈ సందర్భంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో చంపేస్తానని ఫెరోజ్‌ను ఆలీ బెదిరించాడు. వివాదాల తర్వాత ఆలీ భార్య పిల్లను తీసుకుని చుట్టుగుంటలోని ఓ బార్‌కు పక్క వీధిలో ఉన్న పుట్టింటికి వెళ్లిపోయింది.

భార్య, పిల్లను చూడటానికి వచ్చి..

హైదరాబాదు నుంచి ఆలీ భార్య, పిల్లను చూసేందుకు రెండురోజుల క్రితం విజయవాడకు వచ్చాడు. ఆలీ ఇంట్లో ఉన్న విషయాన్ని అతడి బావమరిది బాషా ఫోన్‌చేసి ఫెరోజ్‌కు చెప్పాడు. అత్తగారి ఇంట్లో ఆలీ నిద్రిస్తుండగా మధ్యాహ్నం నుంచి ఫెరోజ్ అతడి స్నేహితుడు అమ్మకల్లు కలిసి అక్కడికి వెళ్లారు. ఫెరోజ్ ఒక కట్టర్‌ను వెంటబెట్టుకుని తీసుకెళ్లాడు. నిద్రలేచి బయటికి వచ్చిన ఆలీపై కట్టర్‌తో దాడి చేశాడు. కట్టర్ ఛాతీకి తగలడంతో ఆలీకి గాయమైంది. వెంటనే అతడు ఇంట్లోకి వెళ్లి ట్యూబ్‌లైట్ తీసుకొని రెండు ముక్కలు చేశాడు. పగిలిన ట్యూబులైట్‌తో ఫెరోజ్ గొంతులో బలంగా పొడిచాడు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని ఫెరోజ్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటన తర్వాత ఆలీ నేరుగా మాచవరం పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆలీ ఉన్న గదిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్ లభించింది. తర్వాత ఫెరోజ్ ఇంట్లో తనిఖీలు చేయగా అక్కడా గంజాయి లభించింది. ఫెరోజ్‌పై మొత్తం 15 కేసులు ఉన్నాయి. రెండు హత్య కేసులు, 12 దొంగతనాలు, ఒక గంజాయి కేసులో ఫెరోజ్ నిందితుడిగా ఉన్నాడు. తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలో అతడిపై కేసులు నమోదయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో ధవళేశ్వరం బొమ్మూరు పోలీస్‌స్టేషన్లలో రెండు హత్య కేసులు ఉన్నాయి. కృష్ణాజిల్లాలో పెదపారుపూడి, ఉయ్యూరు, ఆత్కూరు పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. ఫెరోజ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

జెట్ సిటీకి కదలిక!

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. నిర్మాణం మూడొంతులు జరిగినా.. కొంత పనులు మిగిలి ఉన్నాయి.

వైసీపీ ప్రభుత్వం రాకతో ఆగిన పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులను నిలుపుదల చేయటం జరిగింది. ఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ తర్వాత మరో నాలుగు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను నిర్మించాల్సి ఉండగా.. అవన్నీ కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో జెట్ సిటీలో అత్యంత కీలకమైన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయటానికి ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎడ్కీ), ఏపీఐఐసీల మధ్య ఒప్పందాన్ని కుదర్చింది. రూ.20.39 కోట్ల పని బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయటానికి నిర్ణయించింది. దీని బ్యాలెన్స్ పనులు పూర్తి చేసిన తర్వాత అందులోని స్పేస్‌ను ఫుట్ వేర్ ఇండస్ట్రీస్‌కు ఏపీఐఐసీ కేటాయింపులు జరుపుతుంది. తొలి దశలో దీనిని పూర్తి చేయగలిగితే రెండో దశలో ఫర్నిచర్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి రెండో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుడతారు. ఒక వైపు జెట్ సిటీలో నిర్మాణ పనులు, మరోవైపు పనిచేసే ప్రదేశాలుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను పూర్తి చేయటం ద్వారా ఈ ప్రాంతాన్ని తొలిదశలో కొంతమేర ఆర్థిక నగర రూపు తీసుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

అదిరేలా..

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేయనున్నారు. అలాగే, స్టేషన్ మొత్తాన్ని సువిశాలంగా విస్తరించనున్నారు. మొత్తంగా 1,54,177 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. 10 ప్లాట్‌ఫాంలు, 35 లిఫ్టులు, 30 ఎస్కలేటర్లు ఉంటాయి. కమర్షియల్ ఏరియా 69,585 మీటర్లు ఉంటుంది. మొత్తం 12 హైలెవల్ ప్లాట్‌ఫాంలను అభివృద్ధి చేస్తారు. స్కైవాక్, కొత్త ఎఫ్‌వోబీలు ప్రత్యేకం.

రెండు నెలల్లో మూడు ఆర్‌వోబీలు

నగరంలో రైల్వేతో ముడిపడి ఉన్న ఆర్వోబీ, ఆర్‌యూబీ, సింగ్‌నగర్ ఫ్లైఓవర్, ఎర్రకట్ట బ్రిడ్జి తదితర అంశాలకు సంబంధించి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్‌లు డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్‌తో బుధవారం సమావేశమయ్యారు. సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రధానమైన రైల్వే అంశాలపై చర్చించారు. గుణదల ఆర్వోబీ, ఇన్నర్ రింగ్‌రోడ్డుకు వెళ్లేచోట ఆర్వోబీ, దేవినగర్-వాంబేకాలనీ ఆర్‌యూబీ, పప్పులమిల్లు దగ్గర ఆర్‌యూబీ, సింగ్‌నగర్ రెండో ఫ్లై ఓవర్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. గుణదల ఆర్వోబీ, ఇన్నర్ రింగ్‌కు వెళ్లే వైపు ఆర్వోబీ, దేవీనగర్-వాంబేకాలనీ ఆర్‌యూబీ ప్రతిపాదనలకు రెండు నెలల్లోపు రైల్వేబోర్డు నుంచి అనుమతులు తీసుకుంటామని డీఆర్ఎం హామీ ఇచ్చారు. సింగ్‌నగర్ రెండో ఫ్లైఓవర్ విషయాన్ని రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్తామని, ఎవరి నిధులతో ఖర్చు చేయాలన్న దానిపై స్పష్టత తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు యుద్ధ ప్రాతిపదికన క్లియరెన్స్ తీసుకోవాలని కోరారు. రైల్వే సమస్యలను నిత్యం ప్రజాప్రతినిధులతో చర్చించేందుకు వీలుగా ఒక లైజనింగ్ అధికారిని కూడా నియమిస్తామని డీఆర్ఎం తెలిపారు.

బదిలీల వేళ పదోన్నతులు

(5వ పేజీ తరువాయి)

పదోన్నతి కల్పించారు. ఈ పదోన్నతుల వ్యవహారం మాటున జడ్పీ కీలక అధికారి పాత్ర ఉందని, భారీగా ముడుపులపర్వం నడిచిందన్న ఆరోపణలు వస్తున్నాయి. జడ్పీ కార్యాలయంలోని సీసీ ఒకరు.. పదోన్నతులు అందుకోబోయే కొందరి నుంచి భారీగా ముడుపులు వసూలు చేసినట్టు తెలుస్తోంది.

గత ఐదేళ్ల ముచ్చట

జడ్పీలో పోస్టింగ్‌లు అంటే ముడుపుల వ్యవహారంగా మారింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో బదిలీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. జడ్పీ చైర్‌పర్సన్ భర్త అనధికారికంగా జడ్పీ కార్లను ఉపయోగించటంతో పాటు ఆయిల్‌ను కూడా విచ్చలవిడిగా వాడుకునేవారు. ఆయన చెప్పినట్టుగానే పాలన నడిచేది. తన అనుచరులకు పోస్టులు ఇచ్చుకునేవారు. జడ్పీలో పనిచేసే వారిని ఇంటి దగ్గర పని చేయించుకునేవారు. ఆస్తులను అన్యులకు కట్టబెట్టారు. రెన్నోవేషన్ పేరుతో జరిగిన పనుల్లోనూ అవినీతి జరిగింది. విజయవాడలోని జడ్పీ కార్యాలయంతో పాటు జడ్పీ ఆవరణలో ఉన్న జేసీ కార్యాలయాన్ని కూడా పడేసేందుకు ప్లాన్ వేయగా, అప్పటి కలెక్టర్ దిల్లీరావు అడ్డుపడ్డారు. ఈ వ్యవహారాలు మీడియాకు చెబుతున్నారన్న అనుమానంతో కొందరు ఉద్యోగులను శివారు ప్రాంతాలకు బదిలీ చేశారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (కూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 122,131, 142
చికెన్ విత్ స్కిన్ 234
చికెన్ స్కిన్‌లెస్ 244
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

మంత్రి అనగానికి విలేజ్ సర్వేయర్స్ ఆహ్వానం

విద్యాధరపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 14న జరగనున్న విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశానికి హాజరుకావాలని అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బుధవారం కలిసి ఆహ్వాన పత్రికను, శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సమావేశానికి హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుబాబు, జనరల్ సెక్రటరీ సాయికిరణ్, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, జాయింట్ సెక్రటరీ మహేష్ నాయుడు, మహిళా విభాగం సెక్రటరీ సౌందర్య, రాష్ట్ర కోశాధికారి కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాలి

కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులు

మొగల్రాజపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ విషయమై సమాజంలోని ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పాఠశాల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 320 మంది హాజరయ్యారు. వీరిలో 80 మంది వ్యాసరచన పోటీల్లో ప్రతిభకనబర్చగా మిగిలిన 240మంది చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చారు. యువతలో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకొచ్చేందుకు ఈతరహా పోటీలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. వాయుకాలుష్యం, శబ్దకాలుష్యం, జలకాలుష్యం తగ్గాలంటే ముందుగా ప్రజల్లో చైతన్యం రావాలని అన్నారు. డ్రీమ్ యంగ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న కేవీపీఎస్ దళిత ప్రజాసంఘాలు

మొగల్రాజపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో దళిత యువకులపై బహిరం గంగా థర్డ్ డిగ్రీ ప్రయో గించిన పోలీసులపై మాన వ హక్కుల ఉల్లంఘనగా ప్రకటిస్తూ చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ దళిత ప్రజాసంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక శిఖామణి సెంటర్లో బుధవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలు వాడటం, అమ్మేవారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవడం తప్పుకాదన్నారు. అయితే అలాంటి వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చాలిగాని చట్టాన్ని పోలీసులు చేతిలోకి తీసుకుని నడి రోడ్డుమీద థర్డ్‌డి గ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తగు న్యాయం చేయాలని సత్వరమే సానుకూల చర్యలు చేపట్టకపోతే కేవీపీఎస్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగనుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నగర సీపీఎం కార్యదర్శి పి.కృష్ణ, పటమట మురహరి, ఎస్.శ్యామ్ బాబు, ఎం.ప్రసాద్, పి.బెనర్జీ. బి.కోటేశ్వరరావు, కె.ఆంతోని తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి...పర్యాటకాన్ని పరిరక్షించండి

ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ఒక యూనిట్ - ఒక మొక్క - ఒక హరిత బాధ్యత' అనే వినూత్న కార్యక్రమాన్ని జూన్ 5, 2025న ప్రారంభించనుంది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ 'పర్యాటక కేంద్రాల శాశ్వత అభివృద్ధికి ఆరోగ్యవంతమైన పర్యావరణం కీలకం. ఒక మొక్కను నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు జీవన యోగ్యమైన ప్రకృతిని అందించగలమన్న భరోసా కలగాలి. ఈ కార్యక్రమం కింద ప్రతి యూనిట్ అధికారులు, సిబ్బంది స్వయంగా ఒక మొక్కను నాటి, దాని సంరక్షణకు బాధ్యత తీసుకోవాలి. ప్రకృతిని ప్రేమించండి...మొక్కలు నాటండి...పర్యాటకాన్ని పరిరక్షించండి...అంటూ పర్యాటక అభివృద్ధి సంస్థ తరపున పిలుపునిచ్చారు.

చైన్‌స్నాచింగ్‌ల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి



జరిమానా విధిస్తున్న పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్

బెంజిసర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్‌ల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారని పటమట సీఐ వల్లభనేని పవన్‌కిషోర్ తెలిపారు. బుధవారం పటమట హైస్కూల్ రోడ్డు, పంటకాలువ రోడ్డు ప్రాంతాల్లో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించారు. పలు నిషేధిత గుట్కాలు, విదేశి బ్రాండ్ సిగరెట్ల అమ్మకాలను గుర్తించి సీజ్ చేశారు. విక్రయించే వారికి జరిమాన విధించారు. సూమారు 10 మంది పాన్ షాపుల యాజమానులకు రూ. 200 చొప్పున జరిమానా విధించారు. రహదారులు ఆక్రమించి వీధి వ్యాపారాలు చేస్తున్న వారిని హెచ్చరించారు. రైతుబజార్ సమీపంలోని పలు వీధి వ్యాపారాలను వెనక్కి జరుపుకోవాలని చెప్పారు. ఆల్ఫా హోటల్ సమీపంలో రహదారిని ఆక్రమించి పార్కింగ్ వినియోగిస్తున్న హోటల్ యాజమాన్యాన్ని మందలించారు. కార్యక్రమంలో ఎస్.ఐలు హరికృష్ణ, జి.రేవతి, దుర్గాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.





డాన్‌బాస్కో స్కూల్ పక్కన పూడిపోయిన డ్రెయినేజీ

గురునానక్ కాలనీ వైపు పగిలిపోయిన డ్రెయినేజీ

వ్యర్థాలతో పూడుకున్న డ్రెయినేజీ

తీవ్ర దుర్గంధం..దోమల స్వైరవిహారం
ఏడాదిగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

పటమట, ఆంధ్రజ్యోతి: పదో డివిజన్ డాన్‌బాస్కో స్కూల్ పక్కన డ్రెయినేజీ పూర్తిగా పూడిపోయి వ్యర్థాలు ముందుకు కదలడం లేదు. ఏడాది కాలంగా స్థానికులు శానిటరీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆప్రాంతంలో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. డాన్‌బాస్కో స్కూల్, ఉషోదయ సూపర్‌మార్కెట్ మధ్య ఉన్న ఈ డ్రెయినేజీ వల్ల ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. స్కూల్ విద్యార్థులు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. గురునానక్ కాలనీ వైపు డ్రెయినేజీ నిర్మాణం పూర్తిగా పాడైంది. అధికారులు వెంటనే డ్రెయినేజీలో పూడిక తీయించి మురుగు పారేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం ర్యాలీ

పటమట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గం వైసీపీ ఆధ్వర్యంలో పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి సర్కిల్ - 3 తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, చేసిన మోసాలను తెలుపుతూ తూర్పు నియోజకవర్గ సర్కిల్ - 3 కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బి.ఎస్.ఆర్.కె ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. జగన్మోహన్ రెడ్డి కన్నా మంచి పాలన చేస్తానని నమ్మించి మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. వైసీపీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.



దేవినేని వెంకటరమణ, ప్రణీత చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

దేవినేని వెంకటరమణకు టీడీపీ నేతల నివాళి

పటమట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని వెంకటరమణకు టీడీపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. విజయవాడ ఆటోనగర్ టీడీపీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి దేవినేని వెంకట రమణ 26వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వెంకట రమణ, ప్రణీత చిత్రపటాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నెప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, మంత్రిగా తక్కువ కాలంలో రమణ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని అందరం పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు పొన్నం రవికుమార్, పామర్తి కిషోర్ బాబు, కోడూరు అంజనేయ వాసు, చిట్టా నిర్మల, తదితరులు పాల్గొన్నారు.





అన్నప్రసాద నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న ఈవో శీనానాయక్

రెండోరోజు నవగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి క్షేత్రంలో మల్లేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రెండో రోజు బుధవారం ఉదయం 8.30నుంచి మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసముల కార్యక మాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి మూలమంత్ర హవనములు, మండప పూజ, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, వేద పండితులు పాల్గొన్నారు.

భక్తులకు నాణ్యమైన అన్న ప్రసాదం అందించాలి
ఈవో శీనానాయక్

దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నాణ్యమైన అన్న ప్రసాదం అందించాలని దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ అధికారులను ఆదేశించారు. మహామండపం 7అంతస్థుల మెట్ల మార్గం నుంచి కాలినడకన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెండో అంతస్థులో జరుగుతున్న అన్నప్రసాద వితరణను పరిశీలించారు. ఆహారపదార్థాల నాణ్యతపై భక్తులను అడిగి ఆరా తీశారు. అన్నప్రసాద స్వీకరణ అనంతరం భక్తుల అభిప్రాయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించి, దానిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మహామండపం దిగువన పారిశుధ్య పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీవో రవీంద్ర, ఏఈవో జె.శ్రీనివాసము, తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని కాంట్రాక్టర్ మృతి

విద్యాధరపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని కాంట్రాక్టర్ మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం గొల్లపూడి డీమార్ట్ వద్ద జరిగింది. వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం ఆంధ్రా బ్యాంకు రోడ్డులో ఉంటున్న కాంట్రాక్టర్ పిన్నమనేని బాబూరావు (59) బుధవారం సాయంత్రం సరుకులు తీసుకోవడానికి తన కారులో గొల్లపూడిలోని డీమార్ట్‌కు వెళ్లాడు. కారును డీమార్ట్ ఎదురుగా రోడ్డు పక్కన పార్క్ చేశాడు. డీమార్ట్‌లో సరుకులు కొనుగోలు చేసిన బాబూరావు కారు వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం నుంచి అతి వేగంగా వచ్చిన ఓ కారు బాబూరావును ఢీకొంది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని సమీపంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు సోదరుడు పిన్నమనేని రాఘవేంద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక ఈజీ ఎఫ్ఐఆర్



ఆంధ్రజ్యోతి-విజయవాడ

- కమిషనరేట్‌లో కొత్తగా ఏఐ సాఫ్ట్‌వేర్ టూల్
- ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న పోలీసులు
- ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు, రిమాండ్ రిపోర్టులు చేత్తో రాయకుండా ఉండేందుకే..
- తొలుత బాధితుడి వివరాలు రికార్డు
- ఆ తర్వాత దానంతట అదే ఫిర్యాదు తయారీ
- ఎఫ్ఐఆర్‌ను కూడా చకచకా పూర్తిచేసేస్తుంది

ఫిర్యాదు ఇలా:

ఏదైనా ఒక విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే ముందుగా పీఎస్‌లోని రిసెప్షన్‌కు వెళ్లాలి. విషయం తెలుసుకుని అక్కడి సిబ్బంది తెల్లకాగితంపై ఫిర్యాదు రాసుకుంటారు. తర్వాత దాన్ని ఇన్‌స్పెక్టర్ వద్దకు తీసుకెళ్తారు.

ఎఫ్ఐఆర్ ఇలా :

ఫిర్యాదుదారుడ్ని విచారణ చేశాక ఎఫ్ఐఆర్ నమోదు చేయాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటారు. ఎఫ్ఐఆర్ కాపీలో ఉన్న 15 కాలమ్‌లను చేత్తో పూర్తిచేస్తారు. కొన్నిసార్లు కంప్యూటర్‌లో టైపు చేస్తారు. తర్వాత ఫిర్యాదుదారుడి వాంగ్మూలం రాసుకుంటారు. ఆ తర్వాత సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకుంటారు.ఎఫ్ఐఆర్‌లో బాధితుడి పేరు, తండ్రి పేరు, కులం, చిరునామా, నేరం జరిగిన ప్రదేశం స్టేషన్‌కు ఎంత దూరంలో ఉంది, ఆ ప్రదేశంలో ఏ దిక్కున ఉంది, బాధితులు ఫిర్యాదును ఏ రూపంలో ఇచ్చాడు, జరిగిన నేరానికి ఏ చట్టంలో ఏయే సెక్షన్లు వర్తిసాయి, నిందితుల పేర్లు, పుట్టిన తేదీలు, సమయం, వారి ఎత్తు, ఫిర్యాదులోని సారాంశం, కేసు దర్యాప్తు అధికారి పేరు ఇలా మొత్తం రెండు పేజీల్లో ఉండే 15 కాలమ్‌లను పోలీసులు పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బాధితులను విచారణ చేసి సీఆర్పీసీ 161 ప్రకారం వాంగ్మూలం నమోదు చేస్తారు. తర్వాత ఘటన జరిగినప్పుడు చూసిన సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకుంటారు. దీన్ని పోలీసు పరిభాషలో పార్ట్2గా వ్యవహరిస్తారు.



రిమాండ్ రిపోర్టు ఇలా :

నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తీసుకెళ్లినప్పుడు సీడీ (కేసు డైరీ)తో పాటు రిమాండ్ రిపోర్టును అందజేస్తారు. ఈ రిపోర్టును కంప్యూటర్‌లో టైపు చేస్తారు.

ఏఐ టూల్‌తో ఇలా.. :

పైన పేర్కొన్న పనులన్నీ ఏఐ టూల్ ద్వారా చేయించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయిస్తున్నారు. ఇక నుంచి స్టేషన్‌కు వచ్చిన బాధితులను వెబ్ కెమెరా ఉన్న కంప్యూటర్ ముందు కూర్చోబెడతారు. అక్కడ ఉండే సిబ్బంది బాధితులను ప్రశ్నిస్తారు. వారు చెప్పే మాటలన్నీ కంప్యూటర్‌లోని సాఫ్ట్‌వేర్ రికార్డు చేసుకుంటుంది. వారు చెప్పేదంతా వీడియో రికార్డు అవుతుంది. బాధితులు చెప్పిన మాటలను బట్టి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఒక ఫిర్యాదును ఈ సాఫ్ట్‌వేర్ తయారు చేసి ఇస్తుంది. ఎఫ్ఐఆర్ నమోదుకు ఎస్‌హెచ్‌వో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాక పోలీసులు బాధితులను మళ్లీ కంప్యూటర్ ముందు కూర్చోబెడతారు. అందులో కాలమ్‌లను బట్టి సిబ్బంది ప్రశ్నలు వేస్తారు. బాధితులు చెప్పే సమాధానాల ప్రకారం ఆ కాలమ్‌ను ఏఐ పూర్తిచేస్తుంది. మొత్తం పని పూర్తయిన తర్వాత ఎఫ్ఐఆర్‌ను ఓకే చేయాలా.. అని అడుగుతుంది. దీనికి సిబ్బంది నెంబరు ఇచ్చి ఓకే చేస్తే ఎఫ్ఐఆర్ తయారవుతుంది.

చట్టాలు.. తీర్పులు సైతం..

ఒక్కో నేరానికి ఒక్కో చట్టం ప్రకారం సెక్షన్లు నమోదు చేస్తారు. ఆయా కేసుల్లో హైకోర్టులు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఉంటాయి. ప్రస్తుతం కోర్టులో వివిధ కేసుల్లో వాదనలు జరుగుతున్నప్పుడు న్యాయవాదులు ఈ తీర్పులను ప్రస్తావిస్తున్నారు. ఇలా వెలువడిన కోర్టుల తీర్పులను, వివిధ నేరాలకు సంబంధించి రూపొందించిన చట్టాలను ఏఐ టూల్‌తో అనుసంధానం చేస్తారు. బాధితులు చెప్పిన మొత్తం వాంగ్మూలం విన్న తర్వాత ఏ చట్టంలోని ఏయే సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయవచ్చన్న విషయాన్ని ఈ టూల్ కంప్యూటర్‌లో చూపిస్తుంది. యూఎస్ కేంద్రంగా పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ హైదరాబాద్‌లో ఓ శాఖను నిర్వహిస్తోంది. ఏఐ ద్వారా ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసే ప్రాజెక్టును ఈ కంపెనీ తయారు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రయోగాలు జరుగుతున్నాయి. కంపెనీ ప్రతినిధులు బుధవారం పటమట పోలీస్‌స్టేషన్‌లో పలు ప్రయోగాలు చేశారు. కొత్తగా రూపొందించబోయే ఏఐ టూల్‌కు అనుగుణంగా ప్రస్తుతం స్టేషన్లలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పనిచేస్తాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. రెండు, మూడు రోజులు చేసిన తర్వాత లోటుపాట్లను గుర్తించి సరిచేస్తారు. రాబోయే రెండు, మూడు నెలల్లో ఏఐ ఎఫ్ఆర్‌ఐను అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు నిర్ణయించారు.



పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న దళారీ పూలదాసు సుబ్బారావు

పీడీఎస్ బియ్యం రవాణాకు అడ్డుకట్ట

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సివిల్‌సప్లై అధికారులు
- నిందితుడిపై క్రిమినల్, 6 ఏ కింద కేసులు నమోదు
- ఏఎస్‌వో శ్రీనివాస్

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 40 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని వ్యానులో తరలిస్తున్న బియ్యం దళారి పూలదాసు సుబ్బారావును సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. రాణిగారితోటకు చెందిన దళారి సుబ్బారావు ద్వారకానగర్‌లోని రేషన్ డీలర్ కృష్ణమూర్తి నుంచి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తీసుకొని బ్లాక్ మార్కెట్‌లో కావాల్సిన వారికి విక్రయిస్తుంటాడు. అందిన సమాచారం మేరకు ఏఎస్‌వో శ్రీనివాస్ మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో కృష్ణమూర్తి రేషన్ డిపో నుంచి వ్యానులో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న సుబ్బారావును కృష్ణలంక సర్వీసురోడ్డు-డొంకరోడ్డు మలుపు వద్ద పట్టుకొని వాహనాన్ని తనిఖీ చేయగా 40 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని కనుగొన్నారు. వెంటనే నిందితుడి సహా వాహనాన్ని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. డీలర్ కృష్ణమూర్తి, దళారి సుబ్బారావుపై పోలీసు కేసుతో పాటు 6ఏ కింద కూడా కేసు నమోదు చేస్తున్నట్టు ఏఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

ఓటర్ల అద్భుత తీర్పే కూటమి ప్రభుత్వం

- మంత్రి నాదెండ్ల మనోహర్

రాణిగారితోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు సరిగ్గా ఏడాది క్రితం ఇదేరోజు ఒక అద్భుతమైన తీర్పుతో కూటమికి అధికారాన్ని ఇచ్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎన్డీయే కూటమి ఏర్పడి ఏడాది పూర్తవడంతో జనసేన ఆధ్వర్యంలో స్క్యూ బ్రిడ్జి వద్ద ఉన్న ఇస్కాన్ టెంపుల్ ఆవరణలో బుధవారం సుపరిపాలన మొదలై ఏడాది అనే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్ మాట్లాడుతూ ఎవరెన్ని ప్రలోభాలు, ఇబ్బందులకు గురిచేసినా దేశానికి ప్రధానమంత్రి మోదీ నాయకత్వం, రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వం అవసరమని గ్రహించిన ప్రజలు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఓటుతో అద్భుతమైన తీర్పు అందించి దుర్మార్గ పాలనకు అంతం పలికారన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గ పాలన నుంచి విముక్తి పొంది ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి అధికారం ఇచ్చి రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి బాటలు వేశారని, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు, సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేశారు, ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలకే కాదు హెల్మెట్‌కీ కావాలి భద్రత!

- బైక్‌లకు తగిలించిన హెల్మెట్లు మాయం
- నగరంలో వరుస చోరీలు
- రక్షణకు ప్రత్యేక తాళం కొనుగోలు చేస్తున్న వాహనదారులు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: నారా చంద్రబాబు నాయుడు కాలనీలో ఓ ప్రైవేటు కార్యాలయం ఉంది. ఇందులో సుమారు 20-30 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారంతా రోడ్డుపక్కన ద్విచక్ర వాహనాలను పెట్టుకుంటారు. కొంతమంది హెల్మెట్లను తమ వాహనాల అద్దాలకు తగిలిస్తే, మరికొంతమంది తమవెంటే కార్యాలయంలోకి తీసుకెళ్తారు. ఒక ఉద్యోగి యథావిధిగా హెల్మెట్‌ను తన వాహన అద్దానికి తగిలించాడు. సాయంత్రం వచ్చి చూసుకునేసరికి హెల్మెట్ కనిపించలేదు. ఎవరిని అడిగినా తెలియదని చెప్పారు. దీంతో



హెల్మెట్ దొంగతనానికి గురైందని నిర్ధారించుకుని మరో హెల్మెట్ కొనుక్కున్నాడు. దీన్ని కాపాడుకునేందుకు రూ.150తో ఒక లాక్‌ను కొనుగోలు చేశాడు. కొద్దిరోజుల క్రితం ఓ సాధారణ పౌరుడికి ఎదురైన పరిస్థితి ఇది. బెంజ్‌సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. పోలీసులంతా తమ వాహనాలను ఓ పక్కన పెట్టుకుని వాటిపైనే హెల్మెట్లు పెట్టుకున్నారు. హెల్మెట్ లేని వాహనదారులను ఆపి జరిమానాలు విధిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పూర్తయ్యాక సిబ్బంది అంతా ఇళ్లకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. వాహనాల వద్దకు వెళ్లి తలపై హెల్మెట్ పెట్టుకుందామనేసరికి ఓ ఎస్ఐకి హెల్మెట్ కనిపించలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా షాక్ ఇచ్చే పోలీసులకు ఓ దొంగ ఇచ్చిన హెల్మెట్ ఝలక్ ఇది. విజయవాడలో ద్విచక్ర వాహనాలు మాయమవ్వడం సాధారణం. వాటిలో కదలికలను తీసుకొచ్చేసరికి పెట్రోలు మాయం కేసులు పెరిగాయి. ఇప్పుడీ రెండే కాదు, వాహనానికి నడిపే వ్యక్తి తలపై ఉండాల్సిన హెల్మెట్లు



కూడా అదృశ్యమవుతున్నాయి. వాహనానికి తగిలించి హెల్మెట్ కనిపిస్తే చాలు సెకన్ల వ్యవధిలో మాయం చేస్తున్నారు. ఇప్పటికే వాహనాలు, పెట్రోలు పోతోందన్న ఆందోళనలో ఉన్న వాహనదారులకు ఇప్పుడు కొత్త బెంగ మొదలైంది. బైక్‌కు హెల్మెట్ తగిలించి టీస్టాల్ వద్ద ఆగినా, కిరణా షాపు ముందు బ్రేక్ వేసినా అది భద్రంగా ఉంటుందా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. దీనికి కారణం నగరంలో ఎడాపెడా హెల్మెట్లు దొంగతనాలే. హైకోర్టు రోడ్డు ప్రమాదాలపై కన్నెర్ర చేసిన తర్వాత పోలీసులు ట్రాఫిక్ నిబంధనల అమలుపై కొరడా ఝళిపించారు. ఇందులో ప్రధానమైనది హెల్మెట్‌ధారణ. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందేనన్న నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ముందుగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించినా పెద్దగా మార్పు రాలేదు. దీంతో ఎక్కడికక్కడ 'నో హెల్మెట్ - నో ఎంట్రీ' విధానాన్ని అమలు చేశారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేశారు. హెల్మెట్ కొనుగోలు చేసి తీసుకొచ్చి చూపించిన వారి వాహనాలను మాత్రమే విడుదల చేసిన సందర్భాలున్నాయి.

హెల్మెట్లపై రూ.1000 దెబ్బ

ఎన్‌ఫోర్స్‌మెంట్ దూకుడు పెంచిన ట్రాఫిక్ పోలీసులు దానికి తగ్గట్టుగానే జరిమానాలను పెంపుదల చేశారు. రూ.100 ఉన్న జరిమానాను రూ.1000కి పెంచారు. ఇది వాహనదారుల్లో దడ పుట్టించింది. ప్రతి ఒక్కరూ తలపై హెల్మెట్ పెట్టుకోవడాన్ని ఒక సంస్కృతిగా మార్చుకున్నారు. ఒకవేళ పెట్టుకోకపోయినా వెంట తీసుకెళ్లడాన్ని అలవాటు చేసుకున్నారు. ఇప్పటివరకు హెల్మెట్లను ఎవరు తీస్తారులేనన్న ధీమాతో బైక్‌లపై వదిలేస్తున్నారు. కొద్దినెలలుగా వీటి విషయంలోనూ దొంగలు చేతివాటం చూపిస్తున్నారు. వాహనాలకు తగిలించిన హెల్మెట్లను మాయం చేస్తున్నారు. నగరంలో ఇప్పటి వరకు సుమారుగా 150 - 200 హెల్మెట్లు చోరీ అయినట్టు అంచనా. అయితే ఎక్కడా కేసులు నమోదు కాలేదు. కానీ వాహనదారులే పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హెల్మెట్లకు ప్రత్యేక తాళాలు కొనుగోలు చేస్తున్నారు. హెల్మెట్‌ను బైక్ వెనుక వైపు ఉండే ఇనుప హుక్‌కు తగిలించి తాళం వేస్తున్నారు. తాజాగా చోరీల జాబితాలో హెల్మెట్ చేరడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

రాజధాని రైతుల ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు రిటర్నబుల్, ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు 2025 జూన్ 5న గురువారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్ సమావేశ మందిరంలో ఈ లాటరీ జరుగుతుందని సీఆర్‌డీఏ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లాటరీలో భాగంగా అమరావతిలోని 15 గ్రామాలకు సంబంధించిన 119 మంది రైతులకు 304 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయించడం జరుగుతందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక గ్రామాల రైతులకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు తుళ్లూరు 1, 2, నెక్కళ్లు, అనంతవరం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, శాఖమూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, పిచ్చుకలపాలెం గ్రామాల రైతులకు ప్లాట్లను కేటాయించేందుకు ఈ లాటరీ నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

8 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు తెలుపుతున్న సీఐ గిరిబాబు

తిరువూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణం శివారు బోర్డర్ చెక్‌పోస్టు వద్ద తెలంగాణ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు యువకుల నుంచి 8 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ గిరిబాబు, ఎక్సైజ్ కేవీజీవీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం, బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సీలేరు నుంచి, ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు యువకుల్ని అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు రూ.40 వేలు విలువైన 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ముగ్గురిలో ఒకరు మైనర్ కావడంతో జువనైల్ హోంకు తరలించగా, మిగిలిన ఇద్దరూ తిరువూరు మండలం లక్ష్మీపురానికి చెందిన మద్దిరాల లోకేష్, ఖమ్మం జిల్లా మధిర పట్టణం, శివాలయం పక్కగల కల్యాణపు వంశీని తిరువూరు కోర్టులో హాజరుపరిచినట్టు వివరించారు.

ఏటీవీఎం ద్వారా రైల్వేకు రూ.78లక్షల ఆదాయం

రైల్వేస్టేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే డిజిటల్ టికెటింగ్‌ను ప్రోత్సహిస్తున్న వేళ విజయవాడ డివిజన్‌లో ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్ (ఏటీవీఎం) ద్వారా గత ఆర్థిక సంవత్సరం 2024-2025లో అన్ రిజర్వ్‌డ్ టికెట్ ద్వారా రూ.78 లక్షల ఆదాయం చేకూరింది. ప్రయాణికులకు సులువైన సౌకర్యాలను అందించటం డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించటం లక్ష్యంగా ఏటీవీఎంలను ఏర్పాటు చేశారు. దీంతో లక్షలాది మంది ప్రయాణికులు వేగంగా అన్‌రిజర్వ్‌డ్ టికెట్లను పొందుతున్నారని డివిజన్ రైల్వే మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని 29 మేజర్ ప్రధాన రైల్వే స్టేషన్లలో 72 ఏటీవీఎంలను నెలకొల్పినట్టు తెలిపారు. వీటిని ఆపరేట్ చేయటానికి 94 మంది ఫెసిలిటేటర్లను నియమించారు. మొత్తంగా డివిజన్‌లో మొత్తంగా 2,41,51,165 టికెట్లను ప్రయాణికులు కొనుగోలు చేయగా, వాటిలో 33శాతం అంటే 78,19,581 ఏటీవీఎం ద్వారా ప్రయాణికులు పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సిబ్బందిని అభినందించి ఏటీవీఎంల ద్వారా టిక్కెట్లు పొందటంలోని సౌలభ్యాల గురించి వివరించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అన్‌రిజర్వ్‌డ్ టికెట్లను ఏటీవీఎం ద్వారా పొందవచ్చునన్నారు.

జిల్లాలో హరితవనాల విస్తరణకు కృషి

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం: కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల, గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో నిర్వహించాలని, జిల్లాలో హరిత విస్తీర్ణం పెంపునకు అధికారులు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పూర్తయిన పంట కుంటల వద్ద మొక్కలు నాటాలని, బండ్ ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 2025-26కు గాను 80 లక్షల ఉపాధి పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 25.76 లక్షల పనిదినాలు పూర్తయ్యాయన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు 3వేల పంట కుంటలు లక్ష్యంగా కాగా ఇప్పటికి 753 పూర్తికాగా మిగిలిన వాటి పూర్తికి కృషిచేయాలన్నారు. 2025-26లో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు చేపట్టేందుకు ప్రతి గ్రామపంచాయతీకి 20 ఎకరాలు, జిల్లాలో 4 వేల ఎకరాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1,888 ఎకరాలను గుర్తించామన్నారు. డ్వామా పీడీ ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి హాజరయ్యారు. డివిజన్, మండల స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

మీ ఆలోచనలు పంచుకోండి

క్యూఆర్ కోడ్

రాష్ట్రంలో జనాభా సమతుల్యత లక్ష్యంగా జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ)పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, విధాన రూపకల్పనలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి 9 ప్రశ్నలకు తమ అభిప్రాయాలను ఈనెల 20లోగా పంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న జనాభా మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించే యోచనలో ఉన్నట్లు వివరించారు. ప్రజలు తమ అభిప్రాయాలను పంచుకొని, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

యోగాతోనే రోగరహిత జీవితం

సత్యనారాయణపురం: యోగాతోనే రోగరహిత జీవితం సాధ్యమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా బుధవారం సైనికోద్యోగులు, పెన్షనర్లతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో శరీరంలో నూతన శక్తి వస్తుందన్నారు. అనంతరం జిల్లా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లాసైనికసంక్షేమ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ కే కల్యాణ్‌వీణ, మాజీ సైనికులు, సీఐ టి.ధనుంజయనాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, కాలుష్యనియంత్రణ ఈఈ పీ శ్రీనివాస్, డాక్టర్ వీ రాణి పాల్గొన్నారు.

పశ్చిమలో పోటాపోటీ ఆందోళనలు

- రాష్ట్రం నుంచి జగన్ రెడ్డిని బహిష్కరించాలన్న టీడీపీ నేత బుద్దా వెంకన్న
- కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయలేదన్న మాజీ మంత్రి వెలంపల్లి
- తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వేర్వేరుగా వినతి పత్రాలు





తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బుద్దా వెంకన్న, వెలంపల్లి శ్రీనివాస్

విద్యాధరపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలోని 4వ డివిజన్ అధికార కూటమి నేతలు, విపక్ష వైసీపీ నేతలు పోటాపోటీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లను నగరం నుంచి బహిష్కరించినట్టు జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. అయిదేళ్ల జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనపై బుధవారం భవానీపురంలో 40వ డివిజన్ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి విజయవాడ పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న బుద్దా వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడేలా వ్యవహరించేవాళ్లకు రాష్ట్రంలో చోటు లేదన్నారు. పక్క రాష్ట్రాల్లో ఆస్తులున్న జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు పడిలేచిన కెరటమన్నారు. ఓడినా, గెలిచినా చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దేశంలో మోదీని, రాష్ట్రంలో చంద్రబాబును ఎవరూ ఓడించలేరన్నారు. అనంతరం నేతలతో కలిసి అయిదేళ్లలో జగన్ రెడ్డి హయాంలో జరిగిన అరాచక పాలనపై విచారణ చేయాలని తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్లు కొట్టేటి హనుమంతరావు, గుండారపు హరిబాబు, పార్టీ నేతలు కామ దేవరాజు, కె.శివశర్మ, వేమూరి మల్లికార్జున చౌదరి, నందకుమారి పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో..

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మాజీ మంత్రి, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ అధిష్టానం పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పశ్చిమలోని 40వ డివిజన్ పరిధి, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని వైఎస్ విగ్రహం వద్ద నుంచి పున్నమి హోటల్ ఎదురుగా ఉన్న పశ్చిమ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రూ.లక్షా 50వేల కోట్ల అప్పు చేశారన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అనంతరం తహసీల్దార్ ఇంతియాజ్ పాషాకు వినతిపత్రం ఇచ్చారు. కార్పొరేటర్లు బండి సుశీల, మండేపూడి చటర్జీ, వై.ఆంజనేయ రెడ్డి, షేక్ రహమ్‌తున్నీసా, ఎండీ ఇర్ఫాన్, భూపతి కోటిరెడ్డి, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, ఎలకల చలపతిరావు, పార్టీ నేతలు షేక్ ఆసీఫ్, కె.రాంబాబు, పొదిలి చంటిబాబు, పి.శరత్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్

హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవచ్చా?

Q A

డాక్టర్! నాకు 42 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలున్నారు. ఇప్పుడు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా టీకా తీసుకోవచ్చా?

- ఒక సోదరి, హైదరాబాద్

హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సోకుతుంది. ఈ వ్యాధి లైంగిక క్రీడ ద్వారా సంక్రమిస్తుంది. తీవ్రమైన లక్షణాలు కనబరచని ఈ వ్యాధిని మన సహజసిద్ధ రోగనిరోధక వ్యవస్థ సమర్థంగానే అడ్డుకోగలుగుతుంది. అయితే 16 నుంచి 18 ఏళ్ల వయసున్న యువతుల్లో ఈ ఇన్ఫెక్షన్ క్యాన్సర్‌కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇందుకు 3 నుంచి 7 సంవత్సరాల సమయం పట్టవచ్చు. హెచ్‌పివి వైరస్ వల్ల గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌తో పాటు యోని క్యాన్సర్, జననాంగ, మలద్వార క్యాన్సర్లు, నోటి, గొంతు, పురుషాంగ క్యాన్సర్లు కూడా రావచ్చు. జెనైటల్ వార్ట్స్ కూడా తలెత్తవచ్చు. హెచ్‌పివి వ్యాక్సిన్ ఈ క్యాన్సర్లన్నింటినీ సమర్థంగా అడ్డుకుంటుంది. ఈ వ్యాక్సిన్‌ను తొమ్మిదేళ్ల బాలికల నుంచి 45 ఏళ్ల మహిళల వరకూ అందరూ తీసుకోవచ్చు. 9 - 14 ఏళ్ల బాలికలు ఈ టీకా రెండుసార్లు తీసుకోవాలి. మొదటి టీకా తీసుకున్న ఆరు నుంచి 12 నెలల లోపు రెండో టీకా తీసుకోవాలి. 15 - 45 ఏళ్ల యువతులు, మహిళలు మూడు సార్లు తీసుకోవలసి ఉంటుంది. మొదటి టీకా తీసుకున్న రెండు నెలలకు రెండవ టీకా, తర్వాత ఆరు నెలలకు మూడవ టీకా తీసుకోవాలి.



టీకా తీసుకున్నప్పటికీ...

ఈ టీకాలు పెళ్లికి ముందే తీసుకోవడం వల్ల ఉపయోగం ఉంటుంది. ఈ వ్యాక్సిన్‌లో అన్ని రకాల హెపివి ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ దక్కదు. కాబట్టి సురక్షితమైన లైంగిక పద్ధతులు పాటిస్తూ, కండోమ్స్ వాడుకోవడం వల్ల అన్ని విధాలా రక్షణ దక్కుతుంది. అలాగే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను కనిపెట్టే పాప్‌స్మియర్ పరీక్ష కూడా క్రమం తప్పకుండా చేయించుకుంటూ ఉండాలి. 45 ఏళ్ల మహిళలు కూడా నిర్భయంగా మూడు డోసుల హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడంతో పాటు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. 50 ఏళ్ల వయసు వరకూ ప్రతి మూడు సంవత్సరాలకోసారి, ఆ తర్వాత ప్రతి ఐదేళ్లకోసారి... ఇలా 60 వరకూ పరీక్ష చేయించుకుంటూ ఉండాలి. పిల్లలు కలిగిన మహిళలు, భవిష్యత్తులో పిల్లలను వద్దనుకుంటే ఇన్‌ఫెక్షన్లను అడ్డుకునే కండోమ్స్ వాడుకోగలిగితే హెచ్‌పివి నుంచి శాశ్వత రక్షణ పొందే వీలుంటుంది.

- డాక్టర్ ప్రమత శిరీష
కన్సల్టెంట్ అబ్‌స్ట్రెట్రిక్స్ అండ్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, బర్త్‌రైట్ బై రెయిన్‌బో, సికింద్రాబాద్

చెర్రీ టమాటాలతో ప్రయోజనాలెన్నో..!

చెర్రీ టమాటాలు గుండ్రంగా ఉండి చిన్న సైజు టమాటాల్లాగే కనిపిస్తాయి. మామూలు టమాటాల్లో కంటే వీటిలో విటమిన్లు, ఇతర పోషకాలు రెండు రెట్లు అధికంగా ఉంటాయి. వీటిని అలాగే తినవచ్చు. లేదంటే చిన్న ముక్కలుగా కోసి గ్రీన్‌సలాడ్, పాస్తా సలాడ్‌లాంటి వాటిలో కలుపుకోవచ్చు. పలుచని చక్రాల్లా కోసి బర్గర్, శాండ్‌విచ్‌ల మధ్య పెట్టుకుని తినవచ్చు. రకరకాల వంటకాల్లో కూడా వాడుకోవచ్చు. చెర్రీ టమాటాలు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.....



- వీటిలో ఆర్గానిక్ ఆమ్లం, ఆస్కార్బిక్ ఆమ్లం, లైకోపీన్, బీటా కెరోటిన్లు పుష్కలంగా ఉంటాయి. చెర్రీ టమాటాలను తరచూ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు రావు. క్యాన్సర్ కారకాల నుంచి రక్షణ లభిస్తుంది. ఎముకలు బలోపేతమవుతాయి.
- చెర్రీ టమాటాల్లో ఎ, సి, ఇ, కె విటమిన్లతోపాటు పీచు పదార్థాలు, కెరోటినాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అంటువ్యాధులను దరిచేరనివ్వవు. కంటి సమస్యలు, దృష్టి దోషాలను నివారిస్తాయి. చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణాశయ సమస్యలు, మలబద్ధకం రాకుండా కాపాడతాయి. శరీర బరువును నియంత్రణలో ఉంచుతాయి. శరీరంలో క్రొవ్వు నిల్వలను కరిగించి రక్త ప్రసరణ సజావుగా జరిగేలా చేస్తాయి.

స్ఫూర్తి



ఆ స్వర్ణం వెనుక అమ్మ సంకల్పం

అది ఒక అటవీ ప్రాంతం... వసతులేమీ లేని కుగ్రామం.. ఆ ప్రాంతంలో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారే! అక్కడి ప్రజలకు పూట గడవటమే గగనం. అలాంటి దుర్భర పరిస్థితులలో పెరిగిన ఆదివాసి అమ్మాయి రజిత. ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఆమె తల్లి భద్రమ్మను 'నవ్య' పలకరించింది.

"అవునా.. నా బిడ్డ బంగారం గెలిచిందా.." భద్రమ్మకు రజిత స్వర్ణం గెలిచిందని చెప్పినప్పుడు ఆమె అన్న తొలిమాటలు. అక్కడే ఉన్న ప్లాస్టిక్ ఫ్రేమ్‌లో రజిత ఫొటో చూసినప్పుడు ఆమె కళ్లలో ఒక గర్వం. తాను ఎంతో కష్టపడి పెంచిన చిన్నతల్లి ఏదో సాధించిందనే ఆనందం. భద్రమ్మకు ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ గురించి తెలియదు. ఒలింపిక్స్ గురించి తెలియదు. కేవలం తన చిట్టి తల్లి ఏదో ఒక గొప్ప పని చేసిందని మాత్రమే తెలుసు. రజిత స్వర్ణం వెనక భద్రమ్మ కృషి ఎన్నడూ మరవలేనిది. వాస్తవానికి భద్రమ్మ, ఆమె భర్త మారయ్యలది ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలోని బుసరాస్ గ్రామం. కరువు కాటకాలు రావటంతో ఆమె కుటుంబం అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండంలో రామచంద్రాపురం అనే గ్రామానికి వలస వచ్చింది. రామచంద్రాపురం చుట్టూ అడవులు. రోజూ అడవిలోకి వెళ్లి ఆహారాన్ని సంపాదించుకోవాల్సిన పరిస్థితి. రజిత పుట్టిన రెండేళ్లకు మారయ్య మరణించారు. దీంతో కుటుంబ భారమంతా భద్రమ్మపైనే పడింది.

దిన దిన గండం...

రోజూ కూలికి వెళ్లి సంపాదిస్తే కానీ పిల్లలకు కనీసం భోజనం కూడా పెట్టలేని పరిస్థితి. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఇతరులైతే బెంబేలు పడిపోతారు. కుదేలవుతారు. కానీ భద్రమ్మ వేటికీ తలవంచలేదు. జీవితంతో పోరాడాలనుకుంది. రోజూ కూలికి వెళ్లేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఫలసాయం సంపాదించుకు వచ్చేది. వాటితో తాను తిన్నా.. తినకపోయినా పిల్లలకు పెట్టేది. ఆ సమయంలోనే తన పిల్లలను బాగా చదివించుకోవాలనే భావన భద్రమ్మలో బలంగా పడింది. దీనితో పిల్లలను స్కూలుకు పంపాలనుకుంది. వలసగ్రామం కావటంతో రామచంద్రపురంలో స్కూలు లేదు. దూరంగా ఉన్న ప్రాంతాలకు పంపి చదివించాలనే డబ్బులు లేవు. ఈ సమయంలో సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అరూపే ఉన్నత పాఠశాల ఆమెకు ఆసరా అయింది.

చిన్ననాటి నుంచే...

చిన్నప్పటి నుంచి రజిత ఇతరులతో పోలిస్తే అలసట లేకుండా వేగంగా పరుగెట్టేది. పరుగులో ఆమెకు సహజమైన ప్రతిభ ఉందని ఎవరికీ తెలియదు. చిన్నప్పుడు రజిత "చటుక్కున ఊరంతా పరిగెత్తి వచ్చేసేది.." అంటారు భద్రమ్మ. స్కూలులో చేరిన తర్వాత రజితకు పాఠ్యాంశాల కన్నా ఆటలలోనే ఎక్కువ ఆసక్తి కనబరిచేది. ఆమెకు పరుగులో ప్రతిభ ఉందని తొలిసారి గుర్తించి ప్రోత్సహించినది అరూపే పాఠశాలకు చెందిన ఫాదర్ ఏసురత్నం. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో... జిల్లా స్థాయిలో 100 మీటర్ల రేసులో గెలిచిన రజిత ఆదివాసీ పిల్లల్లో ఒక స్టార్‌గా మారింది. ఆ తర్వాత కాలంలో జాతీయ స్థాయిలో ఆమెకు అనేక బహుమతులు వచ్చాయి. కానీ ఆమెను పేదరికం వెంటాడుతూనే ఉండేది. కాళ్లకు వేసుకోవటానికి సరైన షూలు ఉండేవి కావు. తనవద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులను రజితకు భద్రమ్మ అప్పుడప్పుడూ ఇస్తూ ఉండేది. ఈ సమయంలో రజిత పరుగు ప్రస్థానంలో భద్రమ్మతో పాటు, సోదరుడు జోగయ్య సహకారం వెలకట్టలేనిది. ప్రస్తుతం 2026లో జరగనున్న కామన్వెల్త్ పోటీలకు శిక్షణ పొందుతున్న రజిత 2028లో జరగబోయే ఒలింపిక్స్ అథ్లెటిక్స్ జట్టుకు కూడా ఎంపిక అయింది. మన్యం ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన అథ్లెట్‌గా రజిత పేరు చరిత్రలో నిలిచిపోతుంది. ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించి మన దేశానికి.. తెలుగు వారికి ఖ్యాతి తీసుకువస్తుందని ఆశిద్దాం.

జిల్లా స్థాయిలో 100 మీటర్ల రేసులో గెలిచిన రజిత ఆదివాసీ పిల్లలలో ఒక స్టార్‌గా మారింది. ఆ తర్వాత కాలంలో జాతీయ స్థాయిలో ఆమెకు అనేక బహుమతులు వచ్చాయి. కానీ ఆమెను పేదరికం వెంటాడుతూనే ఉండేది. కాళ్లకు వేసుకోవటానికి సరైన షూలు ఉండేవి కావు. తన వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులను రజితకు భద్రమ్మ అప్పుడప్పుడు ఇస్తూ ఉండేది.



• మంత్రి సత్యనారాయణ
చింతూరు



క్రీడా పోటీల్లో మన క్రీడాకారులు పతకాలు సాధించినప్పుడు ఎంతో ఉప్పొంగిపోతాం. ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి క్రీడాకారులను ఎంతో ప్రశంసిస్తాం. మరి మైదానంలోని ఆ క్రీడాకారులను ఫొటోలను మనకు అందించిన ఫొటోగ్రాఫర్లు మాత్రం చాలామందికి తెలియదు. అలాంటి ఓ ఫొటోగ్రాఫర్... గీతికా తాలుక్‌దర్. ఒలంపిక్స్‌ను కవర్ చేసే అవకాశం పొందిన తొలి భారతీయ మహిళా ఫొటోగ్రాఫర్ అయిన ఆమె గురించి ఆసక్తికర విషయాలు...



విజయ గీతిక

అసోం గువహటికి చెందిన గీతిక తన తాతయ్య స్ఫూర్తితో చిన్నప్పటి నుంచే ఫొటోగ్రఫీపై ఇష్టం పెంచుకుంది. చదువు పూర్తి చేసుకుని 2006లో ఫొటో జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించింది. పలు మీడియా సంస్థల్లో ఫొటో జర్నలిస్ట్‌గా పని చేసింది. ఫొటో జర్నలిజం అనగానే మనకు ఎక్కువగా కనిపించేది మగవారే. ఇప్పుడు పరిస్థితి కాస్త మెరుగుపడినప్పటికీ ఎక్కడో కానీ మహిళా ఫొటోగ్రాఫర్లను చూడలేం. "ఇక నేను కెమెరా పట్టుకుని, దాన్నే కెరీర్‌గా ఎంచుకొనే నాటికి పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉండేవి. ఎక్కడకు వెళ్లినా నేను తప్ప మరొక మహిళా ఫొటోగ్రాఫర్ కనిపించేది కాదు. అడుగడుగునా ఎన్నో సవాళ్లు ఎదురయ్యేవి. బంధువులు, సన్నిహితులు కూడా... 'ఈ ఫొటోగ్రఫీ నీకు అవసరమా' అంటూ నిరుత్సాహపరిచేవారు" అంటూ నాటి జ్ఞాపకాలను పంచుకున్న గీతిక ఏ రోజూ వెనకడుగు వేయలేదు. ఎవరు ఏమన్నా తనకు నచ్చిన రంగంలోనే కొనసాగాలని బలంగా నిర్ణయించుకుంది. తనను తాను నిరూపించుకోవడానికి, ఫొటోగ్రాఫర్‌గా నిలదొక్కుకోవడానికి అహర్నిశలూ శ్రమించింది. ఫొటోగ్రాఫర్ అంటే ఎన్నో ప్రాంతాలు తిరగాలి. గంటలకొద్దీ నిలబడే ఉండాలి. రాత్రీ, పగలూ అనే తేడా లేకుండా పనిచేయాలి. వీటిలో దేనికీ ఆమె భయపడలేదు. అందుకే ఎంతో మందికి ఆదర్శంగా నిలిచి, తొలి భారతీయ మహిళా క్రీడా ఫొటోగ్రాఫర్‌గా చరిత్రలో స్థానం దక్కించుకున్నారు.

> **పనిని ప్రేమిస్తా...**
>
> అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మహిళా ఫొటోగ్రాఫర్లలో నేను కూడా ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. పారిస్ ఒలంపిక్స్ కవర్ చేసేందుకు ఒలింపిక్స్ కమిటీ నుంచి అక్రిడేషన్ పొందడం నా జీవితంలోనే మరిచిపోలేని రోజు. నేను నా పనిని ప్రేమిస్తాను. పని చేస్తున్నప్పుడు ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తాను.

ఎన్నో క్రీడలు.. చిత్తరువులు...

ఎన్నో జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నీల్లో గుర్తుండిపోయే అపురూప క్షణాలను గీతిక తన కెమెరాలో బంధించారు.

2007లో నేషనల్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, పలు ఐపీఎల్, ఐఎస్ఎల్ (ఇండియన్ సూపర్ లీగ్) టోర్నీలు, ఫిఫా మహిళల ప్రపంచకప్‌లు, ఫిఫా ప్రపంచ కప్‌లు, సౌత్ ఏషియన్ గేమ్స్, ఐసీసీ వరల్డ్ కప్ వంటి ఎన్నో క్రీడా కార్యక్రమాలను ఆమె కవర్ చేసి పేరు తెచ్చుకున్నారు. 2020 టోక్యో ఒలంపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఎన్నో చిత్తరువులు తీశారు.

సమాజం ఆధునికత వైపు వేగంగా అడుగులు వేస్తున్నా... కొన్ని ప్రాంతాల్లో గిరిజనులు ఇంకా వెనుకబడే ఉంటున్నారు. అలాంటివారి కోసం చిన్న వయసులో పోరాటం మొదలుపెట్టింది నిహారిక నాయర్. గిరిజనులకు ఆధార్ కార్డులు అందేలా, వారి కోసం వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రత్యేక చొరవ చూపింది. గిరిజన కళాకారులకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్న నిహారిక నాయర్ కథ ఇది.

గిరిజనుల కోసం... ప్రాజెక్ట్ ట్రైబలి

బెంగళూరుకు చెందిన నిహారిక 8వ తరగతి చదువుకునేటప్పుడు గిరిజనులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి తెలుసుకుంది. దాంతో వారి కోసం ఏదైనా చేయాలనే తపన ఆమెలో కలిగింది. అలా 17 ఏళ్ల వయసులోనే గిరిజనులకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో 2020లో ప్రాజెక్ట్ ట్రైబలి ప్రారంభించింది. దాని ద్వారా కర్ణాటక, కేరళలలోని గిరిజనులు ప్రాథమిక హక్కులు పొందేలా, ఆదాయం సంపాదించుకునేలా తన వంతు సహాయం చేస్తోంది. వారి సంస్కృతి, వారసత్వం అంతరించిపోకుండా అండగా నిలుస్తోంది.





12 వేల మందికి ఆధార్

చాలా చోట్ల గిరిజనులు ప్రభుత్వం పథకాలను అందుకోరు. ఎందుకంటే కనీసం వారి పేర్లు ఓటరు జాబితాలో కూడా ఉండవు. అందుకే అలాంటి వారికి ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలు అందించాలని భావించింది. నిహారిక. అందుకోసం వేలాది మంది గిరిజనులు ఆధార్ కార్డులు పొందేలా చేసి, వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేసింది. అంతేకాకుండా గిరిజన వర్గాల్లో పోషకాహార లోపం ప్రబలంగా ఉంటుందని తెలుసుకుని ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంలోనూ చొరవ చూపింది. చాలామంది గిరిజనులు తమ కళలను మర్చిపోయి ఏదో ఒక పని చేసుకుంటూ ఉండడంతో, వారి కళలు, సంస్కృతి అంతరించి పోకూడదని గిరిజన కళాకారులకు శిక్షణ ఇప్పించి, వారి కళాకృతుల అమ్మకాన్ని సులభతరం చేసింది. వారికి జీవనోపాధి కలిగించింది. అవసరంలో ఉన్న గిరిజనులకు చేయూత అందించేందుకు నిధులు కూడా సేకించింది నిహారిక. గతేడాది ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన 1ఎం1బి యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో 'ప్రాజెక్ట్ ట్రైబలి'ని నిహారిక ప్రదర్శించి అలా గిరిజనుల ఎదుర్కొంటున్న సమస్యలను అంతర్జాతీయ వేదిక మీద చూపించింది.

అవినీతి వలన అన్యాయం

ప్రభుత్వాలు గిరిజనుల కోసం ప్రతీ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ అవినీతి కారణంగా వారికి ఓ ప్రయోజనాలు అందట్లేదని ఓ సందర్భంలో నిహారిక అన్నది. ఇక్కడ మరో ప్రధాన సమస్య గిరిజనులకు సరైన అవగాహన లేకపోవడమని ఆమె అభిప్రాయపడింది. పాఠశాలలకు ఉన్నప్పటికీ అవగాహన, ప్రేరణ లేకపోవడం వల్లనే చాలా మంది గిరిజన పిల్లలు, యువత చదువుకు దూరంగా ఉంటున్నారని పేర్కొంది. గిరిజనులకు చదువు లేకపోయినా, వారు చాలా పాత పద్ధతులను అనుసరించి జీవిస్తున్నప్పటికీ వారి నుంచి మనం చాలా నేర్చుకోవచ్చని ఆమె అన్నారు. మొక్కలు, వాటి ఔషధ గుణాలను అర్థం చేసుకోవడంలో వారికి చాలా ప్రావీణ్యం ఉందని అన్నది. తాను ఓ కుగ్రామానికి వెళ్లినప్పుడు వారు మూలికలు, మొక్కల్లో ఔషధాల గురించి మలయాళంలో రాసిన 300 పేజీల పుస్తకాన్ని తనకు చూపించారని వెల్లడించారు.

ఫ్లాస్క్ శుభ్రం చేయకపోతే...

మనం కార్యాలయాలకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పాలు, కాఫీ, టీ లాంటి వాటిని ఫ్లాస్క్‌లో పోసుకుని తీసుకువెళుతూ ఉంటాం. ఈ ఫ్లాస్క్ మూత బిగుతుగా ఉండి లోపలి పానీయం ఎక్కువ సమయం వేడిగా లేదా చల్లగా ఉండేలా చేస్తుంది. ఇలా ఉపయోగించుకున్న తరవాత ఆ ఫ్లాస్క్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. లేని పక్షంలో దాని లోపల హానికారక ఫంగస్ పెరిగి దుర్వాసన వస్తుంది. కనుక...



- ముందుగా ఫ్లాస్క్‌లో నీళ్లు పోసి వంచేయాలి. తరవాత దాని నిండా గోరువెచ్చని నీళ్లు పోసి ఉంచాలి. అరగంట తరవాత ఈ నీళ్లు వంచేసి పొడవాటి బ్రష్‌తో సున్నితంగా రుద్ది కడగాలి. అలాగే మూతను కూడా కడిగి రెంటినీ పూర్తిగా ఆరనివ్వాలి. తరవాత ఫ్లాస్క్‌కు మూత బిగించి భద్రపరచుకోవాలి.
- ఫ్లాస్క్ నుంచి కాఫీ లేదా టీ వాసన ఎక్కువగా వస్తూ ఉంటే దాని నిండా గోరువెచ్చని నీళ్లు నింపాలి. అందులో రెండు చుక్కల డిష్ వాషింగ్ లిక్విడ్, అర చెంచా బేకింగ్ సోడా, చెంచా వెనిగర్‌లలో ఏదో ఒకటి వేసి బాగా కలపాలి. పది నిమిషాల తరవాత ఆ నీళ్లు వంచేసి బ్రష్‌తో రుద్దాలి. వెంటనే మంచినీళ్లతో కడిగి ఆరబెడితే ఎలాంటి వాసనైనా తొలగిపోతుంది.
- రాత్రి పడుకునే ముందు ఫ్లాస్క్‌లో వాడేసిన టీ బ్యాగ్ లేదా ఒక చెంచా బియ్యం లేదా ఒక చెంచా ఉప్పు వేసి దాని నిండా నీళ్లు నింపి మూత పెట్టాలి. ఉదయాన్నే ఫ్లాస్క్‌ను రెండు నిమిషాలపాటు వేగంగా అటూ ఇటూ ఊపాలి. తరవాత ఆ నీళ్లు వంచేసి మంచినీళ్లతో కడిగి ఆరబెట్టాలి. లేదంటే వెంటనే వాడుకోవచ్చు.
- ఫ్లాస్క్ మూతకి రబ్బర్ సీల్ ఉంటే దాన్ని తీసి లిక్విడ్ సోప్‌తో శుభ్రం చేయాలి. మెత్తని స్పాంజ్‌తో రుద్ది కడగాలి.

నల్లటి వలయాలు ఇలా మాయం

నిద్రలేమి, కంప్యూటర్లు, ఫోన్లు ఎక్కువ సేపు చూడడం, ఒత్తిడి, హార్మోన్ల ప్రభావం, మారిన జీవన విధానం వంటి కారణాలతో కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడుతుంటాయి. వీటిని ఎలా తగ్గించుకోవచ్చంటే...

- చెంచా టమాటా రసంలో కొంచెం నిమ్మరసం కలిపి కళ్ల కింద రాయాలి. రోజుకు రెండు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- బంగాళాదుంప రసంలో దూది ముంచి నల్లటి వలయాల మీద పెట్టి పదినిమిషాల తరువాత చల్లటి నీటితో కడగాలి. లేదా బంగాళాదుంప ముక్కను కళ్ల కింద 10 నిమిషాల పాటు రుద్ది నీటితో కడగవచ్చు.
- గ్రీన్ టీ సంచులను నీటిలో ముంచి తీసి కొంచెం సేపు ఫ్రిడ్జిలో ఉంచాలి. వాటిని 10 నిమిషాల పాటు కళ్ల మీద పెట్టాలి.
- రాత్రి బాదం నూనెను కళ్ల కింద రాసి మసాజ్ చేసి, ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- కలబంద గుజ్జును రాత్రి కళ్ల కింద రాసి కొంచెం సేపు సున్నితంగా మర్దన చేసి ఉదయాన్నే కడిగేయాలి.
- నారింజ రసంలో కొంచెం గ్లిజరిన్ కలిపి కళ్ల కింద రాయాలి. దీని వల్ల నల్ల వలయాలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది.
- కీరదోసను గుండ్రటి ముక్కలు చేసి వాటిని కళ్లపై ఉంచాలి.
- పుదీనా ఆకులను పేస్టు చేసి కళ్ల కింద రాసి ఓ పది నిమిషాలు ఆగి కడగాలి. రోజు రాత్రి ఇలా చేస్తే నల్లటి వలయాలు తగ్గుతాయి.
- గులాబీ నీళ్లలో దూదిని ముంచి నల్లటి వలయాలపై ఉంచాలి. పావుగంట తరువాత చల్లటి నీటితో కడగాలి.
- మజ్జిగలో పసుపు కలిపి పేస్టులా చేసి దానిని కళ్ల కింద రాయాలి. పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో కడగేసుకోవాలి.





చిన్నస్వామి స్టేడియంలో ట్రోఫీతో ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్

ఇంత జరిగినా..?

తొక్కిసలాట, మరణాల తర్వాతా వేడుకలా..

ఆర్‌సీబీపై విమర్శల వెల్లువ

బెంగళూరు : చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురు ఫ్యాన్స్ ప్రాణాలు కోల్పోయి, భారీ సంఖ్యలో గాయపడినా సంబరాలలో పాల్గొన్నదంటూ ఆర్‌సీబీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ పక్క అభిమానులు చనిపోయినా మరో పక్క సన్మానం కొనసాగడమా..అని నెటిజన్లు ధ్వజమెత్తుతున్నారు. 'ఒక పరేడ్. తెలివిహీనులు, పెను విషాదం, బారీకేడ్లు లేకుండా, ప్రణాళిక లేకుండా ఇంత భారీ స్థాయిలో వేడుక నిర్వహించడమా? మూర్ఖులు మాత్రమే ఇలా చేస్తారు. పాలనా యంత్రాంగం మెదడు మొద్దుబారిపోయిందా' అని ఓ నెటిజన్ దుయ్యబట్టాడు. 'మృతదేహాలు అలా పడి ఉన్నా విజయోత్సవం కొనసాగడం దిగ్భ్రాంతికరం. ఉత్త పుణ్యానికి యువ కన్నడిగులు ప్రాణాలు కోల్పోయారు. అంత అమానవీయంగా ఎలా వ్యవహరించారు? అంత ఉదాసీనంగా ఎలా ఉండిపోయారు ? ఇది క్షమించరానిది. బాధ్యులను నేరస్తులుగా పరిగణించాలి' అని మరో యూజర్ ఏకిపారేశాడు. తొక్కిసలాట నేపథ్యంలో భద్రతా కారణాలు చూపుతూ విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ పరేడ్‌ను కర్ణాటక ప్రభుత్వం రద్దు చేసింది.

ప్రణాళికా లోపంవల్లే

బీసీసీఐ కార్యదర్శి సైకియా

న్యూఢిల్లీ: ప్రణాళికా లోపంవల్లే చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుందని బీసీసీఐ పేర్కొంది. 'ఈ సంఘటన చాలా దురదృష్టకరం. క్రికెట్‌కున్న పాపులారిటీలో ఇది ప్రతికూల కోణం. క్రికెటర్లపట్ల ప్రజలకు ఎంతో క్రేజ్ ఉంది. అందువల్ల ఈ కార్యక్రమాన్ని మెరుగైన ప్రణాళికతో నిర్వహించాల్సింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా పేర్కొన్నాడు. 'ఈస్థాయిలో విజయోత్సవాలను నిర్వహిస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి. ఎక్కడో కొన్ని లోపాలు జరిగాయి. అద్భుతంగా జరిగిన ఐపీఎల్‌కు ఇది విషాద ముగింపు' అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ సందర్భంగా..గత ఏడాది టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియాకు ముంబైలో చక్కగా నిర్వహించిన విజయోత్సవాన్ని సైకియా గుర్తు చేశాడు. 'గతంలోనూ ఐపీఎల్ విజయోత్సవాలు జరిగాయి. గత ఏడాది కోల్‌కతా నైట్‌రైడర్స్ కప్ గెలిచినప్పుడు కోల్‌కతాలో సంబరాలు సాఫీగా నిర్వహించారు' అని అన్నాడు.

అంతా గందరగోళం..

బెంగళూరు: కోహ్లీకి ఉన్న అభిమాన గణాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కర్ణాటక క్రికెట్ సంఘం తక్కువగా అంచనా వేయడం ఈ తొక్కిసలాటకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంచనాలకు అందని రీతిలో దేశ వ్యాప్తంగా విరాట్‌కు ఫ్యాన్స్ ఉన్న విషయం అందరికీ తెలిసిందే.

ప్రేక్షకుల హాజరుపై అంచనా లేకపోవడం: సన్మాన సభకు ఎంత మంది అభిమానులు వస్తారనే విషయంలో అంచనాలే లేకపోవడానికి తోడు ప్రణాళికా లోపం స్పష్టంగా కనిపించింది. స్టేడియం సామర్థ్యం 35వేలు కాగా..రెండు నుంచి మూడు లక్షల మంది ఫ్యాన్స్ పోటెత్తారు.

కార్యక్రమ వివరాలపై గందరగోళం: చివరి నిమిషందాకా విజయోత్సవ ర్యాలీ రద్దు గురించి తెలియకపోడంతో అభిమానులు గందరగోళానికి లోనయ్యారు. పరేడ్‌లో ఓపెన్ టాప్ వాహనంలో క్రికెటర్లు స్టేడియంలోకి రావాల్సి ఉంది. కానీ అది రద్దు కావడంతో ఆటగాళ్లు బస్సులో వచ్చారు. దాంతో వారిని చూడాలనే ఆత్రుతతో స్టేడియంలోకి అభిమానులు ఒక్కసారిగా చొచ్చుకు వచ్చారు. దీంతో గేట్లు విరిగిపోయాయి.

డ్రెయిన్ కూలి: పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఒక్కసారిగా స్టేడియంలోకి ప్రవేశించడంతో డ్రెయినేజీపై ఉన్న శ్లాబ్ కూలిపోయింది. దాంతో అభిమానులంతా భయాందోళనకు లోనయ్యారు. పైగా ఫ్యాన్స్ చెట్లు, స్టేడియం గేట్లు ఎక్కడంతో గందరగోళం మరింత పెరిగింది. కొద్ది సంఖ్యలో ఉన్న పోలీసులు అభిమానులను నియంత్రించలేక పోయారు.

అప్పుడు 16.. ఇప్పుడు 11

భారత క్రీడా చరిత్రలో విషాద ఘట్టాలు





ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ట్రోఫీ గెలవడంతో నగరమంతా ఉత్సాహంలో మునిగిపోయిన వేళ.. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరగడం.. 11 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేస్తోంది. ఈ దుర్ఘటనలో 33 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మన దేశంలో క్రీడాలో కొన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన రెండో విషాదాంతం ఇది. అంతకుముందు 1980లో కోల్‌కతాలో ఈడెన్‌గార్డెన్స్ స్టేడియంలో రెండు ఫుట్‌బాల్ జట్ల అభిమానుల మధ్య చెలరేగిన ఘర్షణకు 16 మంది బలయ్యారు.

1980, ఆగస్టు 16.. ఆరోజు కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్‌గార్డెన్స్ స్టేడియంలో చిరకాల ప్రత్యర్థులు మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ జట్ల మధ్య కోల్‌కతా ఫుట్‌బాల్ డెర్బీ మ్యాచ్. అందరిలోనూ ఎంతో ఆసక్తి రేకెత్తించే ఈ పోరును వీక్షించేందుకు 70వేల మంది తరలివచ్చారు. మ్యాచ్ మొదలైంది.. కొన్ని నిమిషాల అనంతరం మ్యాచ్‌లో మోహన్ బగాన్ ఆటగాడు బిదేశ్ బసును ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాలర్ దిలీప్ పాలిత్ తోసేశాడు. అంతే.. ఒక్కసారిగా స్టేడియంలో గోల మొదలైంది. ప్రేక్షకుల్లో నుంచి కొందరు మైదానంలోకి రాళ్లు రువ్వారు. గొడవ పెద్దదైంది. ఇరుజట్ల అభిమానులు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు తోసుకుంటూ చేతికి దొరికిన వాటితోనే పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పోలీసులు స్పందించేలోపే పరిస్థితి చేయి దాటిపోయింది. ఈ ఘటనలో ఏకంగా 16 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతా, 18 నుంచి 60 ఏళ్ల లోపు వారే. ఈ విషాదకరమైన ఘటన జరిగి 45 ఏళ్లు కావస్తోంది. ఇప్పటికీ ఆ ఘటనను గుర్తుచేసుకుంటే భయానకంగా ఉంటుందంటారు నాటి ఉదంతంలో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న కొందరు సాకర్ అభిమానులు. మళ్లీ ఇన్నాళ్లకు ఆ తరహా ఘటనను తలపిస్తూ బెంగళూరులో రాయల్ చాలెంజర్స్ జట్టు విజయోత్సవ యాత్ర విషాదాంతమైంది. చిన్నస్వామి స్టేడియానికి పోటెత్తిన అభిమానుల్లో 11 మంది అసువులు బాశారు. నాటి ఈడెన్ గార్డెన్స్ ఉదంతం తర్వాత భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద విషాద ఘటనగా ఆర్‌సీబీ యాత్ర మిగిలిపోయింది. కాగా, ఇప్పటిదాకా ఫుట్‌బాల్ మ్యాచ్‌ల సందర్భంగా ఇలాంటి సంఘటనలు జరగగా.. ఓ క్రికెట్ ఈవెంట్ సందర్భంగా దుర్ఘటన జరగడం ఇదే తొలిసారి.

ప్రపంచ క్రీడా చరిత్రలో మరికొన్ని విషాదాంతాలు..

అక్టోబరు 2022, ఇండోనేసియా

ఇటీవలికాలంలో అతిపెద్ద క్రీడా విషాద ఘటనగా దీన్ని చెప్పుకోవచ్చు. తూర్పు జావా ప్రావిన్స్‌లోని కంజురుహన్ స్టేడియంలో జరిగిన ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా 174 మంది చనిపోయారు. పెర్సెబాయ సురబాయ జట్టు చేతిలో అరెమా జట్టు ఓడిపోయింది. ఈ క్రమంలో స్టేడియంలోనే ఇరుజట్ల అభిమానులు ఘర్షణకు దిగడంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జ్ చేశారు. దీంతో జరిగిన తొక్కిసలాటలో భారీఎత్తున అభిమానులు దుర్మరణం పాలయ్యారు. ఏకంగా 320మందికిపైగా గాయపడ్డారు.

మే 2001, ఘనా

ఆఫ్రికా సాకర్ చరిత్రలో అత్యంత విషాదకర ఘటన ఇది. అక్రా ప్రధాన స్టేడియం వద్ద అభిమానులు ఘర్షణకు దిగడంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో 126 మంది దుర్మరణం పాలయ్యారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

చావుతో స్వాగతం

ఐపీఎల్ చాంపియన్లకు చావుతో స్వాగతం లభించినట్టయింది. మృతుల కుటుంబాలకు నా సానుభూతి. **- మాజీ కీపర్ కిర్మాణీ**

క్రికెట్‌కు ఇది విచారకరమైన రోజు. హృదయం తరుక్కుపోతోంది. **-అనిల్ కుంబ్లే**

మృతుల కుటుంబాలకు నా సానుభూతి. **- సచిన్ టెండూల్కర్**

స్నేహితురాలితో కుల్‌దీప్ నిశ్చితార్థం



న్యూఢిల్లీ: టీమిండియా స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ నిశ్చితార్థం తన బాల్య స్నేహితురాలు వన్షికతో బుధవారం జరిగింది. లఖ్‌నవూలో అతికొద్ది మంది బంధు మిత్రుల సమక్షంలో ఈ వేడుక జరిగింది. రింకూ సింగ్‌తో పాటు ఉత్తరప్రదేశ్ క్రికెటర్లు పలువురు ఈ నిశ్చితార్థానికి విచ్చేశారు.

ఈ కప్పు మీదే: కోహ్లీ



కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌తో కోహ్లీ

బెంగళూరు: భారీ స్థాయిలో హాజరైన ఆర్‌సీబీ ఫ్యాన్స్‌ను చూసి విరాట్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. అతడి కనులు చెమర్చాయి. దాంతో మైక్ అందుకొన్న వెంటనే కోహ్లీ ప్రసంగించ లేకపోయాడు. ఎట్టకేలకు తేరుకొని 'ఇకపై మనం ఈసారి కప్పు మనదే అంటూ మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈసారి కప్పు మనది కాబట్టి' అని అన్నాడు. అంతే..అభిమానుల హోరుతో చిన్నస్వామి స్టేడియం దద్దరిల్లింది. కోహ్లీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'అభిమానులూ..ఈ కప్పు మీది. ఎంతో అద్భుతమైన ఈ నగరానిది. ఈ 18 ఏళ్లలో మాకు మీరు అండగా నిలిచారు. ప్రపంచంలో ఎక్కడా..ఏ జట్టుకు ఇంత ఫ్యాన్ బేస్ ఉండడం నేను చూడలేదు' అని అన్నప్పుడు అభిమానులు కేరింతలు కొట్టారు. 'తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా తనేమిటో రుజువు చేసుకున్న పటీదార్‌కు జేజేలు పలకండి' అని కోహ్లీ పిలుపునిచ్చాడు.

'వైల్డ్‌కార్డ్' సంచలనం

- క్వార్టర్స్‌లో ఆండ్రీవాకు బోయిసన్ షాక్
- ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌కు అల్కారజ్, సినర్



బోయిసన్

పారిస్: క్లే కోర్టు గ్రాండ్‌స్లామ్‌లో స్థానిక క్రీడాకారిణి లోయిస్ బోయిసన్ సంచలన ప్రదర్శన కనబరచింది. వైల్డ్‌కార్డ్‌తో టోర్నీలో ఆడుతున్న ఈ ఫ్రెంచ్ భామ క్వార్టర్‌ఫైనల్లో అదరగొట్టింది. బుధవారం జరిగిన సింగిల్స్ పోరులో ప్రపంచ 361 ర్యాంకరైన బోయిసన్ 7-6(6), 6-3తో ఆరోసీడ్ మిర్రా ఆండ్రీవా (రష్యా)ను కంగుతినిపించింది. 1989లో మోనికా సెలెస్, జెన్నిఫర్ కాప్రియాటి తర్వాత తన ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్‌లో సెమీస్ చేరిన తొలి క్రీడాకారిణిగా 22 ఏళ్ల బోయిసన్ రికార్డు సృష్టించింది. అంతేకాదు.. 1999లో అమేలీ మౌరెస్మో (వింబుల్డన్‌లో) తర్వాత గ్రాండ్‌స్లామ్‌లో సెమీస్ చేరిన పిన్నవయసు ఫ్రెంచ్ క్రీడాకారిణిగానూ ఘనత వహించింది. గురువారం జరిగే సెమీఫైనల్లో రెండోసీడ్ కొకొ గాఫ్ (అమెరికా)తో బోయిసన్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో గాఫ్ 6-7 (8), 6-4, 6-1తో తన దేశానికే చెందిన ఏడో సీడ్ మాడిసన్ కీస్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ జానిక్ సినర్, రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. క్వార్టర్స్‌లో సినర్ 6-1, 7-5, 6-0తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)పై, అల్కారజ్ 6-0, 6-1, 6-4తో 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా)పై అలవోకగా గెలుపొందారు.

ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి జంట 21-14, 22-20తో పొలినా-కాంటెమిర్ (ఉక్రెయిన్) ద్వయంపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్-ఆద్య జోడీ 15-21, 21-16, 21-17తో యి హంగ్ వీ-నికోల్ గొంజాలెస్ చాన్ (తైపీ) జంటపై నెగ్గింది.

అగ్రస్థానంలో హంపి

స్టావంజర్ (నార్వే): కోనేరు హంపి ఎనిమిదో రౌండ్‌లో విజయం సాధించి నార్వే చెస్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. 8వ రౌండ్‌లో సరసాడాట్ ఖాడెమ్ అల్ షరీఫ్ (ఇరాన్)పై నెగ్గిన హంపి.. ప్రస్తుతం 13.5 పాయింట్లతో ప్రథమ స్థానానికి చేరుకుంది. వెన్‌జున్ (చైనా)ను ఓడించిన వైశాలి 9.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల్లో కరువానా (అమెరికా)కు చెక్ చెప్పిన అర్జున్ 10.5 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు. కార్ల్‌సన్‌పై వీ యి (చైనా) గెలిచాడు. గుకేష్, నకముర చేతిలో ఓడాడు. కురవానా (12.5) టాప్‌లో, కార్ల్‌సన్ (12) ద్వితీయ స్థానంలో, నకముర, గుకేష్ చెరో 11.5 పాయింట్లతో 3, 4స్థానాల్లో కొనసాగుతున్నారు.

ఆర్థిక నారీమణులు



శాంతి ఏకాంబరం



రాధా వెంబు



సంగీతా రెడ్డి



రోష్నీ నాడార్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక రంగంలో అత్యంత ప్రభావవంతమైన, స్ఫూర్తిదాయక మహిళల వివరాలతో కాడెరే, హురున్ ఇండియా సంయుక్తంగా ఓ జాబితాను విడుదల చేశాయి. ఈ తరహా లిస్ట్‌ను రూపొందించడం ఇదే తొలిసారి. కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్న నారీమణుల విభాగంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ డిప్యూటీ ఎండీ శాంతి ఏకాంబరం అగ్రస్థానంలో నిలిచారు. 62 ఏళ్ల శాంతి ఏకాంబరం.. రూ.3.82 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన కోటక్ బ్యాంక్ కీలక సారథుల్లో ఒకరుగా ఉన్నారు. ఇక తొలి తరం సంపద సృష్టికర్తల విషయానికొస్తే, జోహో సహ వ్యవస్థాపకురాలు రాధ వెంబు రూ.55,300 కోట్ల నెట్‌వర్త్‌తో నం.1గా ఉన్నారు. తొలి తరం సంపద సృష్టికర్తల విభాగంలోని టాప్ -10 నారీమణుల మొత్తం ఆస్తి రూ.2 లక్షల కోట్ల పైమాటే. వారి సారథ్యంలో నడుస్తున్న కంపెనీల మార్కెట్ విలువ రూ.12 లక్షల కోట్ల పైనే. రెండో తరం మహిళా సారథుల విభాగంలో రూ.4.87 లక్షల కోట్ల విలువైన హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి నలుగురు కూతుళ్లు ప్రీత, శోభన, సునీత, సంగీతా రెడ్డి కూడా నెక్స్ట్ జెనరేషన్ లీడర్ల విభాగం టాప్-10లో చోటు దక్కించుకున్నారు. రూ.97,600 కోట్ల మార్కెట్ విలువ కలిగిన అపోలో హాస్పిటల్స్ నెట్‌వర్క్ నిర్వహణలో ఈ నలుగురూ కీలకపాత్ర పోషిస్తున్నారు. మహిళా ఇన్వెస్టర్లలో అడ్వెంట్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్వేత జలాన్, దాతృత్వంలో రోహిని నీలేకని, అత్యధిక మంది పాలో అవుతున్న సెలబ్రిటీ ఇన్వెస్టర్లలో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ అగ్రగామిగా నిలిచారు.

ఎన్‌విడియా మళ్లీ ప్రపంచ నం.1

అమెరికాకు చెందిన ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా.. మైక్రోసాఫ్ట్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. మంగళవారం అమెరికా మార్కెట్లో ఎన్‌విడియా మార్కెట్ విలువ 3.45 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. అదే సమయంలో మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.44 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమైంది. ప్రపంచంలోని అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్‌విడియా అగ్రస్థానానికి చేరడం ఈ జనవరి 24న తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి. గడిచిన నెలరోజుల్లో కంపెనీ షేరు 24 శాతం వృద్ధి చెందడం ఇందుకు దోహదపడింది.

బిజినెస్

మదుపరులూ పారాహుషార్

కేటుగాళ్ల మోసాలపై జర జాగ్రత్త



న్యూఢిల్లీ : తమ పేరుతో సోషల్ మీడియాలో వచ్చే నకిలీ సమాచారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సెబీ మరోసారి మదుపరులను హెచ్చరించింది. తమ పేరు మీద కేటుగాళ్లు పంపించే నకిలీ సమాచారం నమ్మి వ్యక్తిగత సమాచారం షేర్ చేయడంగానీ, డబ్బులు పంపడంగాని చేయవద్దని కోరింది. కొంత మంది మోసగాళ్లు సెబీ లోగో, లెటర్‌హెడ్, అధికారుల పేర్లతో మదుపరులకు తప్పుడు సమాచారం పంపిస్తూ మోసం చేస్తుండడంతో సెబీ ఈ హెచ్చరిక చేసింది. తాము పంపించే ప్రతి ఉత్తర్వు లేదా జారీ చేసే ప్రతి లెటర్‌కు ప్రత్యేక నంబరు ఉంటుందని తెలిపింది. మదుపరులు తమ అధికారిక వెబ్‌సైట్‌లో తమకు వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే ముందుకు వెళ్లాలని సెబీ కోరింది.

సేవల రంగంలో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: సేవల రంగం మే నెలలో నిలకడ వృద్ధిని సాధించింది. ఈరంగానికి చెందిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ సూచీ 58.8 పాయింట్లకు చేరింది. ఏప్రిల్‌లో ఇది 58.7 పాయింట్లుంది. డిమాండు పుంజుకోవడం, కొత్త ఆర్డర్లు రావడం ఇందుకు దోహదపడింది.

అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్‌కు రూ.6,400 కోట్ల నిధులు



న్యూఢిల్లీ: తదుపరి దశ విస్తరణ కోసం వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల కన్సార్షియం నుంచి 75 కోట్ల డాలర్ల (రూ.6,400 కోట్లు) నిధులు సమీకరించినట్టు అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఏఏహెచ్‌ఎల్) ప్రకటించింది. కన్సార్షియంలో ఫస్ట్ అబూ దబీ బ్యాంక్, బార్‌క్లేస్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులున్నాయి. 40 కోట్ల డాలర్ల (రూ.3,400 కోట్లు) ప్రస్తుత రుణభారం తగ్గించుకోవడంతో పాటు విమానాశ్రయాల వ్యాపారం, ఈ వ్యాపారానికి అనుబంధంగా గల నాన్ ఏరో వ్యాపారాల విస్తరణకు ఈ నిధులు ఉపయోగించుకోనున్నట్టు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా అహ్మదాబాద్, లఖ్‌నవ్, మంగళూరు, జైపూర్, గువాహటి, తిరువనంతపురం విమానాశ్రయాలను విస్తరించనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం తమ నిర్వహణలోని విమానాశ్రయాల వార్షిక ప్రయాణికుల రవాణా సామర్థ్యం 9.4 కోట్లుండగా దాన్ని 11 కోట్లకు పెంచుతామని తెలియచేసింది. 2040 నాటికి దశలవారీగా ఈ సామర్థ్యాన్ని 30 కోట్లకు పెంచడం తమ లక్ష్యమని కంపెనీ సీఈఓ అరుణ్ బన్సల్ తెలిపారు. త్వరలోనే ప్రారంభం కానున్న నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం సామర్థ్యం తొలి దశలో రెండు కోట్లుంటుందని, దశలవారీగా దాన్ని 9 కోట్లకు చేర్చాలనుకుంటున్నామని ఆయన చెప్పారు.

వడ్డీరేటు మరింత తగ్గేనా?

రేపే ఆర్‌బీఐ పాలసీ

న్యూఢిల్లీ: దేశంలో కీలక వడ్డీ రేట్లు మరింత తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన బుధవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం, శుక్రవారం దీనిపై నిర్ణయం ప్రకటించనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమావేశాల్లో ఎంపీసీ కీలక రెపోరేటును పావు శాతం చొప్పున అర శాతం మేర తగ్గించింది. మరోవైపు ట్రంప్ సుంకాల పోటు నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధ్యమవుతుందా..లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏప్రిల్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి దిగివచ్చింది.

ఎంత తగ్గొచ్చు: ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రకటించే ద్వైమాసిక ఆర్థిక, ద్రవ్య సమీక్షలో ఎంపీసీ రెపో రేటును ప్రస్తుత ఆరు శాతం నుంచి మరో పావు శాతం లేదా అర శాతం కుదించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది ఒకే విడతగా ఉంటుందా, లేక రెండు విడతలుగా ఉంటుందా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

10న ఎఫ్‌ఎస్‌డీసీ భేటీ


న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఆర్థిక స్థిరత్వ, అభివృద్ధి మండలి (ఎఫ్‌ఎస్‌డీసీ) ఈ నెల 10న ముంబైలో సమావేశమవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సహా పలు రెగ్యులేటరీ సంస్థల చీఫ్‌లు ఈ సమావేశానికి హాజరవుతారు. 2024-25 ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.5 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో సీతారామన్ ఉన్నతాధికారులతో ఆర్థిక వ్యవస్థపై సమీక్షించనున్నారు.

7 సీస్ నుంచి కొత్త ఆన్‌లైన్ గేమ్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆన్‌లైన్ గేమింగ్‌లో అగ్రగామి అయిన 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ విశేష జనాదరణ ఉన్న మూడు కొత్త గేమ్‌లను ప్రవేశపెట్టింది. అవి వరల్డ్ క్రికెట్ చాంపియన్ లీగ్, ప్రపంచ గుర్రపు స్వారీ, కేక్ మ్యాచ్:పజిల్ తరహా గేమ్. అలాగే www.onlinerealgames.com సైట్‌ను పునః ప్రారంభించింది. కొత్తగా ప్రవేశపెట్టినవన్నీ దేశీయంగానే అభివృద్ధి చేసిన ఉచిత గేమ్‌లని తెలిపింది. వాటిని ప్లేస్టోర్, యాప్ స్టోర్, ఇండస్ యాప్ స్టోర్ల నుంచి దిగుమతి చేసుకోవచ్చునని తెలియచేసింది. గేమర్లకు అత్యుత్తమమైన మొబైల్ గేమింగ్ అనుభవం అందించడం తమ లక్ష్యమని 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ఎండీ ఎల్ఎం శంకర్ తెలిపారు.


జీఎంఆర్ ఏరోసిటీలో హిల్టన్ హోటళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): న్యూఢిల్లీలోని జీఎంఆర్ ఏరోసిటీలో రెండు అంతర్జాతీయ శ్రేణి హోటళ్ల ఏర్పాటుకు అంతర్జాతీయ ఆతిథ్య రంగ దిగ్గజం హిల్టన్ ముందుకు వచ్చింది. ఇందుకోసం జీఎంఆర్ గ్రూప్ సారథ్యంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌తో (డయల్) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. ఈ ఒప్పందం కింద వాల్‌డార్ఫ్ అస్టోరియా, హిల్టన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ బ్రాండ్ల కింద జీఎంఆర్ ఏరోసిటీలో హోటళ్లు ప్రారంభించనున్నట్టు పేర్కొంది. ఇందులో అస్టోరియా హోటల్ 150 గదులు, సూట్లు కలిగి ఉంటుంది. హిల్టన్ హోటల్ 350 గదులతో ఏర్పాటవుతుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,170 ▲	90,900 ▲	1,13,000 ▲
విజయవాడ	1,00,000 ▼	94,000 ▲	1,00,350 ▲
విశాఖపట్నం	1,00,080 ▲	90,900 ▲	1,13,000 ▲
రాజమండ్రి	99,160 ▲	90,900 ▲	1,04,100 ▲
ప్రొద్దుటూరు	96,700 ▼	88,960 ▼	1,00,010 ▼
ముంబై	96,750 ▼	88,620 ▼	1,00,980 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	530
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	101	అనంతపురం	107
గోదావరి	114		

మూడు రోజుల తర్వాత లాభాల్లోకి..

260 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: వరుసగా మూడు రోజులు నష్టపోయిన ఈక్విటీ సూచీలు బుధవారం మళ్లీ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతోపాటు మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఒకదశలో 350 పాయింట్ల వరకు పెరిగి 81,000 స్థాయిని దాటిన సెన్సెక్స్.. చివరికి 260.74 పాయింట్ల లాభంతో 80,998.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77.70 పాయింట్ల వృద్ధితో 24,620.20 వద్దకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 రాణించాయి.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 26 పైసల నష్టంతో రూ.85.87 వద్ద ముగిసింది. ముడిచమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.
- ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (ఏబీఎ్ఫఆర్ఎల్) నుంచి ఈ-కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ అనుబంధ విభాగమైన ఫ్లిప్‌కార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ పూర్తిగా వైదొలిగింది. ఏబీఎ్ఫఆర్ఎల్‌లో తనకున్న 6 శాతం వాటాను బ్లాక్ డీల్స్ ద్వారా రూ.583 కోట్లకు విక్రయించింది.

ఐపీఓకు ఏకస్

బెలగావీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ ఏకస్ లిమిటెడ్ ఐపీఓకు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,700 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉందని సమాచారం.

అపోలో మైక్రోసిస్టమ్స్ రూ.416 కోట్ల సమీకరణ

హైదరాబాద్‌కు చెందిన అపోలో మైక్రోసిస్టమ్స్ ప్రిఫరెన్షియల్ పద్ధతిన ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ వారంట్ల జారీ ద్వారా రూ.416 కోట్లు సమీకరించింది. ప్రమోటర్ గ్రూప్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిత్య కుమార్, ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్‌కు వీటిని జారీ చేసినట్టు కంపెనీ తెలిపింది.

2030 నాటికి సెన్సెక్స్ 1,50,000

వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) బీఎస్ఈ సెన్సెక్స్ 1,50,000 పాయింట్లకు చేరుకోవచ్చని ప్రముఖ ఇన్వెస్టర్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అంచనా వేశారు. 2035 నాటికి సూచీ 3,00,000 పాయింట్లకు చేరుకోవచ్చని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. బలమైన దేశ ఆర్థిక మూలాలతోపాటు మార్కెట్ స్థితిస్థాపకత ఇందుకు దన్నుగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు. "గత 45 ఏళ్ల చరిత్రను గమనిస్తే, మార్కెట్ 15 శాతం సంచిత వృద్ధితో (సీఏజీఆర్) పెరుగుతూ వచ్చింది. ఈ లెక్కన, ప్రస్తుతం 80,000 స్థాయిలో ఉన్న సెన్సెక్స్ వచ్చే ఐదేళ్లలో 1.5 లక్షల పాయింట్లకు ఎగబాకవచ్చు" అన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి...



మలయాళ చిత్రం 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాలీ ఓ క్రేజీ ఆఫర్ దక్కించుకున్నారు. తాజాగా, ఆయన లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి ఎంటరయ్యారు. ఎల్‌సీయూలో భాగమైన 'బెంజ్' సినిమాలో 'వాల్టర్' అనే కీలక పాత్రను పోషిస్తున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో ద్వారా వెల్లడించారు. "ఈ పాత్రను పోషిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. చాలా రోజులుగా ఈ అద్భుతమైన అప్‌డేట్‌ను మీతో పంచుకోవడానికి ఎదురుచూస్తున్నాను. ఈ పాత్ర ఎంతో ప్రత్యేకం" అని పేర్కొన్నారు. ఈ వీడియో చూస్తుంటే ఆయన సినిమాలో క్రూరమైన విలన్ ఛాయలున్న 'వాల్టర్' పాత్రతో పాటు మరో భిన్నమైన రోల్‌లోనూ కనిపించనున్నట్లు తెలుస్తోంది. లోకేశ్ కనగరాజ్ కథ అందించడంతో పాటు సమర్పిస్తున్న చిత్రం 'బెంజ్'. రాఘవలారెన్స్ కథానాయకుడిగా నటిస్తున్నారు. బక్కియరాజ్ కన్నన్ దర్శకత్వంలో లోకేశ్ కనగరాజ్, సుదాన్ సుందరమ్, జగదీష్ పళని స్వామి నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక.

అనుష్క పోస్టర్... 40కి పైగా ప్రమాదాలు!



అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన 'వేదం' 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు అల్లు అర్జున్. "'వేదం'కు 15 ఏళ్లు. నా కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రమిది. ఇతర సినిమాలతో పోలిస్తే నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. దర్శకుడు క్రిష్‌కు రుణపడి ఉంటాను. ఎంతో నిజాయితీగా సినిమా తీశారు. ఈ చిత్రంలో మంచు మనోజ్, అనుష్క వంటి సహనటులతో ప్రయాణించడం ఓ గొప్ప జ్ఞాపకం. ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు శోభు, ప్రసాద్ దేవినేనిలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.




ముందు అనుకున్న సినిమా వేరు

ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు ఓ సందర్భంలో పంచుకున్నారు క్రిష్. "'గమ్యం' తరువాత ఓ పూర్తి స్థాయి కమర్షియల్ చిత్రానికి ప్లాన్ చేశాను. అయితే ఆ సమయంలో అమరావతికి వెళ్లినప్పుడు జరిగిన ఓ సంఘటన 'వేదం' కథ సిద్ధం చేసేలా చేసింది. ఓ చిన్న పిల్లాడు వృద్ధుడిని వేలు పట్టుకుని లాక్కెళ్తున్న దృశ్యం నన్ను కదిలించింది. 'ఒక చిన్న పిల్లాడు వెట్టిచాకిరీ చేస్తాడు. వాడిని విడిపించుకోవడానికి వాళ్లమ్మ కిడ్నీలు అమ్ముతుంది' ఇలాంటి ఓ లైన్‌తో మొదలైంది 'వేదం' కథ. అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్క భాగం కావడంతో ఈ సినిమా పెద్ద సినిమాలా మారింది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా అనుష్క వెనక్కి తిరిగి కొంటెగా చూస్తున్న పోస్టర్‌ను పెద్ద హోర్డింగ్‌గా చేసి పంజాగుట్ట సర్కిల్‌లో పెట్టారు. ఆ సమయంలో 40కి పైగా ప్రమాదాలు జరిగాయి. పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఆ తర్వాత పోస్టర్‌ను తొలగించారు. అంతలా అనుష్క ఆకట్టుకున్నారు" అని అన్నారు దర్శకుడు క్రిష్.

పారితోషికం తిరిగిచ్చేసిన పవన్‌కల్యాణ్

● అదే బాటలో సిద్ధు జొన్నలగడ్డ



సినిమాల కోసం కోట్లల్లో పారితోషికాలు తీసుకుంటుంటారు స్టార్ హీరోలు. కథ నచ్చి, పారితోషికం తీసుకోకుండా సినిమాలు చేసిన హీరోలు కొందరైతే.. చిత్రం విడుదలయ్యాక నష్టాలొస్తే తాము తీసుకున్న రెమ్యునరేషన్‌ను వెనక్కి ఇచ్చిన వారు మరికొందరు. అయితే చిత్రసీమలో ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. కానీ, సినిమా విడుదలకు ముందే తన పారితోషికాన్ని నిర్మాతకు తిరిగిచ్చేశారు ఏపీ డిప్యూటీ సీఎం, హీరో పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి ఏ.ఎమ్.రత్నమ్ నిర్మాత. క్రిష్ దర్శకత్వంలో 2020లో మొదలైన ఈ చిత్రం పలు కారణాలతో సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లోనే ఉండిపోయింది. ఎట్టకేలకు చిత్రీకరణ పూర్తిచేసుకుని ఈ నెల 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. సినిమాకు తాను అడ్వాన్స్‌గా తీసుకున్న పారితోషికాన్ని నిర్మాతలకు తిరిగి ఇచ్చేశారు. ఇంతకాలం ఈ సినిమా సెట్స్ పైనే ఉన్నందుకు నిర్మాతపై పడ్డ అదనపు భారాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిర్మాతల గురించి ఆలోచించే నటుల్లో ముందు వరుసలో ఉంటారని నిరూపించుకున్నారు. మరో కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ కూడా తన పారితోషికాన్ని తిరిగి ఇచ్చేశారు. ఆయన కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'జాక్' ఏప్రిల్ 10న విడుదలైంది. సినిమా హిట్ టాక్ తెచ్చుకోవడంలో విఫలమైంది. దీంతో పారితోషికంగా తాను తీసుకున్న మొత్తంలో సగం(రూ. నాలుగు కోట్లు) తిరిగిచ్చేసి తన సహృదయాన్ని చాటుకున్నారు.

షూటింగ్‌కు సిద్ధం

పవన్‌కల్యాణ్ మరోసారి పోలీస్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. హరీశ్ శంకర్ దర్శకుడు. ఇటీవలే ఈ సినిమా షూటింగ్‌ను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా షూటింగ్ ఈ నెల రెండో వారం నుంచి మొదలవుతోందని మంగళవారం తిరుమలలో వెల్లడించారు ఆయన. త్వరలోనే పవన్‌కల్యాణ్ కూడా సెట్స్‌లోకి అడుగుపెడతారని తెలిపారు.

బాలీవుడ్‌లో మళ్లీ రష్మిక

హీరోయిన్ రష్మిక మంచి జోరు మీదున్నారు. తెలుగులోనే కాదు బాలీవుడ్‌లో కూడా ఆమె బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నారు. సల్మాన్ ఖాన్ సరసన నటించిన 'సికిందర్' చిత్రం ఇటీవల ఫ్లాప్ అయినా ఆ ప్రభావం ఆమె మీద లేదనే చెప్పాలి. హిందీలో ఆమెకు ఆఫర్లు వస్తునే ఉన్నాయి. ఇంతవరకూ రష్మిక ఐదు హిందీ చిత్రాల్లో నటించారు. వాటిల్లో 'యానిమల్', 'చావా' చిత్రాలు పెద్ద హిట్ . మిగిలిన మూడు సినిమాలు అనుకున్నంతగా ఆడలేదు. తాజాగా ఇప్పుడు మరో హిందీ సినిమాకు రష్మిక కమిట్ అయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. 2012లో వచ్చిన 'కాక్‌టైల్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'కాక్‌టైల్ 2' చిత్రంలో షాహిద్ కపూర్ సరసన రష్మిక నటించనున్నారు. క్రితీ సనన్ మరో కీలక పాత్ర పోషించనున్నారు. యూరప్‌లో సినిమాలోని కొన్ని కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. అలాగే మనదేశంలో కూడా విభిన్న ప్రాంతాల్లో షూటింగ్ చేస్తారట. వచ్చే ఏడాది 'కాక్‌టైల్ 2' చిత్రం విడుదలవుతుంది.





షూటర్ వస్తున్నాడు



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'షూటర్'. సుమన్, రాశి, ఆమని, ఎస్తేర్ ప్రధాన తారాగణం. ఎస్. శ్రీనివాసులు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. విభిన్న కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని అన్నారు.

వంద శాతం వినోదం



యువతను మెప్పించే కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'డేంజర్ బాయ్స్'. అభిజిత్ తీర్థహళి దర్శకుడు. వికాస్, రాధాభగవతి, అశ్వని హాసన్ ప్రధాన తారాగణం. నిర్మాత శ్రీరంగం సతీశ్ కుమార్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ప్రీ రిలీజ్ వేడుకలో ఆయన మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా దర్శకుడు మలిచారు. వంద శాతం వినోదాన్ని పంచుతుంది. హీరో పాత్ర చిత్రణ మునుపెన్నడూ చూడని విధంగా సాగుతుంది' అని చెప్పారు.

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా...



శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, రమా శంకర్ నిర్మించిన చిత్రం 'బద్మాషులు'. మహేశ్ చింతల, విద్యాసాగర్ కీలకపాత్రలు పోషించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ 'నూతన నటీనటులతో సరికొత్త తరహాలో కామెడీ థ్రిల్లర్‌గా 'బద్మాషులు' చిత్రాన్ని రూపొందించారు' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన వినోదాత్మక చిత్రం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న చిత్రమిదని నిర్మాత తెలిపారు.









విజయవాడ తూర్పు నియోజకవర్గంలో సుపరిపాలనకు ఏడాది సంబరాలలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే రామ్మోహన్‌లను సత్కరిస్తున్న స్థానిక నాయకులు



సుపరిపాలనకు ఏడాది కార్యక్రమంలో జనసేన కార్యాలయం వద్ద బాణసంచా కాలుస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, ఆ పార్టీ నేతలు



టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు, కార్యకర్తలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విధ్వంసం నుంచి వికాసం వైపు...

» పోస్టర్‌ను ఆవిష్కరించిన పల్లా

గాజువాక (విశాఖపట్నం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): 'అధికారం కోసం సొంత బాబాయిని హత్య చేయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుంది. తెనాలిలో కరుడుగట్టిన రౌడీలను పరామర్శించి ఆయన తన నేర స్వభావాన్ని మరోసారి రాష్ట్ర ప్రజలకు తెలియజేశారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఏడాది పాలనపై రూపొందించిన 'విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం' పోస్టర్‌ను బుధవారం ఆయన గాజువాక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

విధ్వంస పాలనపై ప్రజా ఆకాంక్షల విజయం: లోకేశ్



అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ... 'సరిగ్గా సంవత్సరం క్రితం విధ్వంస పాలనపై ప్రజా ఆకాంక్షలు ఘన విజయం సాధించాయి. ఈ గెలుపు ఐదు కోట్ల ప్రజల గెలుపు. చంద్రబాబు పాలనానుభవం, పవనన్న ఆశయానికి మోదీ ఆశీస్సులు పుష్కలంగా లభించడంతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం ప్రారంభమైంది. ఎన్డీయే ప్రభుత్వాన్ని ఆశీర్వదించిన ఐదు కోట్ల మంది ప్రజలకు కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ఇదే స్ఫూర్తితో మాకు అండగా నిలుస్తారని ఆశిస్తున్నాను. ప్రజాతీర్పు దినం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

ప్రజలు వెన్నుపోటుదారులా: కాల్వ



అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఒక రాజకీయ పార్టీగా రాష్ట్రంలో మనుగడ సాగించే అర్హతను వైసీపీ కోల్పోయిందని టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా ఇచ్చిన తీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా ప్రకటించి నిరసనలు తెలుపుతున్నారు. ప్రజల ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి, వారితోనే ఛీకొట్టించుకున్న జగన్... నేడు అదే ప్రజలను వెన్నుపోటుదారులుగా చిత్రీకరిస్తూ నిరసనలు చేయడం ఏమిటి?' అని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, 'జూన్ 4 కేవలం కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టిన రోజే కాదు. జనసామాన్యానికి సేవ చేయాలనే సంకల్పానికి స్వరం ఇచ్చిన రోజు' అని పేర్కొన్నారు.

పీడ విరగడై ఏడాది: నాగబాబు



'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పీడ విరగడై ఏడాది. స్వర్ణాంధ్రకు శ్రీకారం చుట్టి ఏడాది. గ్రామాల్లో సమూల మార్పులకు ఏడాది. సుస్థిర పాలనకు, సమగ్రాభివృద్ధికి ఏడాది' అని ఎమ్మెల్సీ, జనసేన ప్రధాన కార్యదర్శి కె నాగబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. 'సరిగ్గా ఏడాది క్రితం ప్రజా పక్షమైన కూటమికి పరిపాలన కట్టబెట్టిన ప్రజలు కూటమిపై నమ్మకంతో అసలు ప్రతిపక్షం అనే అవకాశమే ఎవరికీ ఇవ్వలేదు. అయినప్పటికీ ప్రతిపక్ష హోదా కావాలని గగ్గోలు పెట్టిన వారు... చివరికి అందరూ ఊహించినట్లుగానే రాక్షసపక్షం వైపే మేము అనే సందేశాన్ని ఇచ్చారు. సంఘ విద్రోహక శక్తులకు కొమ్ము కాస్తూ, ప్రజలపైనే దాడి చేస్తామంటే సమాజం ఒప్పుకోదు' అని అన్నారు.

కూటమిది చరిత్రాత్మక విజయం: సత్యకుమార్



'గత ఐదేళ్ల అరాచకం, అక్రమాలు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు మూకుమ్మడిగా 2024, జూన్ 4 ఓ చరిత్రాత్మక తీర్పు ఇచ్చారు' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. బుధవారం ఆయన ప్రజలకు ఒక లేఖ రాశారు. 'ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించిన ప్రజల మనోభావం వెల్లడైన రోజు. జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రజలు ఏకగ్రీవంగా గళమెత్తిన రోజు. రాజ్యాంగ ప్రసాదితమైన ప్రాథమిక హక్కులు... స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు ప్రజలు పట్టం కట్టిన పవిత్ర దినం. అలాంటి పవిత్ర దినాన్ని వెన్నుపోటు రోజుగా ప్రకటించిన జగన్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలను తీవ్రంగా అవమానించి తన మానసిక వికారాన్ని మరోసారి వెల్లడించుకున్నారు. ప్రజలు గమనించాలి. రాష్ట్రంలో మరోసారి అంధకారానికి ఏమాత్రం తావివ్వకూడదు' అని కోరారు.

తల్లి, చెల్లి, బాబాయికి వెన్నుపోట్లు: పార్థసారధి



'వెన్నుపోట్ల గురించి జగన్ మాట్లాడడమా? తల్లిని, చెల్లిని, బాబాయిని ఏ విధంగా వెన్నుపోట్లు పొడిచారో ప్రత్యేకంగా ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు' అని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. 'గత ప్రభుత్వం అన్నీ కలిపి ఒక కుటుంబానికి ఏడాదికి రూ.61 వేలు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం పింఛను ఇప్పటికే రూ.58 వేలు ఇచ్చింది' అంటూ లెక్కలతో వివరించారు. 'గంజాయి మత్తులో దౌర్జన్యాలు చేస్తూ, పోలీసులనూ కొట్టిన వారికి జగన్ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఏమిటి? అసలు వాళ్లు పరామర్శకు తగిన వాళ్లేనా?' అని ప్రశ్నించారు.

విజనరీకి స్వాగతం చెప్పిన సుదినమిది: రాజు



అనంతపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): 'వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ రెడ్డి. వెన్నుపోటు గురించి ఆయన మాట్లాడటం హాస్యాస్పదం' అని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎంఎస్ రాజు ఎద్దేవా చేశారు. అనంతపురంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'విధ్వంసకారుడు జగన్‌ను తరిమికొట్టి... విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలోని కూటమికి స్వాగతం చెప్పిన సుదినం 2024 జూన్ 4. మా ప్రభుత్వాన్ని, నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ వెన్నుపోటు దినమని పిలుపునివ్వడం జగన్ రాక్షస, సైకో, నేరపూరిత మనస్తత్వానికి నిదర్శనం' అని విమర్శించారు.

అరాచక పాలన అంతమై ఏడాది!

రాష్ట్రవ్యాప్తంగా కూటమి కార్యక్రమాలు.. బాణసంచా కాల్చిన పార్టీల నేతలు

» పలు ప్రాంతాల్లో భారీ ర్యాలీలు

» కర్నూలులో గొడ్డళ్లతో శ్రేణుల నిరసన

» వివేకా హత్యను గుర్తు చేసిన కార్యకర్తలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వైసీపీ ఐదేళ్ల నియంతృత్వ పాలనకు చరమగీతం పాడుతూ.. కూటమి పార్టీలకు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన రోజు(జూన్ 4)ను పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పార్టీల నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి.. కూటమి పార్టీలు ఘన విజయం దక్కించుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు ఆ జూన్ 4న వచ్చాయి. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని కూటమి పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు కేకులు కట్ చేసి ర్యాలీలు నిర్వహించారు. జగన్ ఐదేళ్ల అరాచక పాలన అంతమైన రోజేకాకుండా.. ఐదేళ్ల నిర్బంధానికి తెరపడిన రోజు ఇది అని టీడీపీ నాయకులు అన్నారు. ప్రజల తీర్పు వెలువడిన రోజును వెన్నుపోటు దినంగా వైసీపీ నిర్వహించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. యాడికి, విడపనకల్లు, అనంతపురం రూరల్, కనగానపల్లి, సీకే పల్లి, ఆత్మకూరు తదితర మండలాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిరలో టీడీపీ శ్రేణులు పలు కార్యక్రమాలు నిర్వహించాయి. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తలుపుల మండలం పెద్దన్నవారిపల్లెలో 'ఇంటింటికీ మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వెన్నుపోటుకు కేరాఫ్ జగనే

వెన్నుపోటుకు కేరాఫ్ జగన్‌రెడ్డేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత విమర్శించారు. కర్నూలు చెన్నమ్మకూడలిలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కర్నూలులో టీడీపీ నేతలు గొడ్డళ్లను చేత పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. జగన్, వైఎస్ అవినాశ్‌రెడ్డి, వివేకానందరెడ్డిల మాస్కులను ధరించారు. వివేకాను గొడ్డలితో నరుకుతున్న దృశ్యాన్ని ప్రదర్శించారు.

జనసేన విజయోత్సవం..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు, ఇంటింటా దీపాలు, బాణసంచా కాల్పులు, ఎడ్లబండిపై ఎమ్మెల్యే ఊరేగింపు నిర్వహించారు. రాజోలు జనసేన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురంలో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

తిరుపతి జిల్లాలో..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలలో నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టగా, టౌన్ క్లబ్ కూడలిలో మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించి కేక్ కట్ చేశారు. జనసేన ముగ్గుల పోటీలు నిర్వహించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ, డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు తదితరులతోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. నాయుడుపేటలో సామాన్య టీడీపీ కార్యకర్త పేదలకు అన్నదానం చేశారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహించారు. కురుపాం నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణాలో..

టీడీపీ శ్రేణులు ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాయి. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో లుక్కా సాయిరాం గౌడ్ నేతృత్వంలో కేకు కట్ చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న నేతృత్వంలో స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి విజయవాడ పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రౌడీషీటర్లను నగరం నుంచి బహిష్కరించినట్టు జగన్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని బుద్దా వెంకన్న అన్నారు.



విజయవాడలో టీడీపీ నిర్వహించిన ర్యాలీలో బుద్దా వెంకన్న తదితరులు

జనసేన నేతృత్వంలో..

జనసేన పిలుపు మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కూడా 'సుపరిపాలన' కార్యక్రమాలు జరిగాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని రామలింగేశ్వరనగర్‌లో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు పాల్గొన్నారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. ఏడాది కాలంలో అంకితభావంతో పవన్ కల్యాణ్ పనిచేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, మరో 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటామన్నారు.

సార్@బెంగళూర్

వెన్నుపోటు దినం నిరసనలకు పిలుపిచ్చి జగన్ డుమ్మా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వెన్నుపోటు దినం పేరిట రాష్ట్రమంతా బుధవారం నిరసనలు చేపట్టాలని.. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని క్యాడర్‌కు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. తీరా అసలు సమయానికి రాష్ట్రంలో కనబడకుండా ఆయన బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. వెన్నుపోటు దినంలో పాల్గొనేందుకు పార్టీ అధ్యక్షుడిగా రాజధానిలో తాడేపల్లి నివాసం నుంచి బయటకు వస్తారేమోనని ఆశించిన పార్టీ క్యాడర్ నిరాశకు గురైంది. బెంగళూరుకు పారిపోయి వైసీపీకే జగన్ వెన్నుపోటు పొడిచారంటూ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి ఏడాది అయిన సందర్భంగా బుధవారం రోజును జగన్ వెన్నుపోటు దినంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తర్వాత దశాదిశా లేకుండా నిరసన కార్యక్రమాన్ని చేపట్టే బాధ్యతను క్యాడర్‌పై వదిలేశారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రాజకీయ పార్టీ పిలుపునిస్తే.. ఆ పార్టీ అధ్యక్షుడు ముందుండి నిరసనలో పాల్గొంటారు. పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేసి, ప్రజలు భాగస్వాములయ్యేలా కార్యాచరణ రూపొందిస్తారు. నిరసనలో పాల్గొన్న నేతలను పోలీసులు సమీప పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేస్తారు. ఇది సాధారణంగా జరిగే తతంగం. పోలీసు స్టేషన్ దాకా వెళ్లేందుకు జగన్ భయపడ్డారో ఏమో కానీ తాడేపల్లిలో కనిపించకుండా ఉడాయించేశారు. ఇతర పార్టీల అధ్యక్షుల మాదిరి కాదని, తన తీరు విరుద్ధమని జగన్ మరోసారి నిరూపించారు. సహజంగా వారాంతాల్లో జగన్ దంపతులు బెంగళూరు ప్యాలెస్‌కు వెళతారు. రౌడీషీటర్లుగా పేరున్న యువకులపై పోలీసులు దాడి చేశారంటూ మంగళవారం తెనాలికి వెళ్లి పరామర్శించిన జగన్.. బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని ఎగ్గొట్టి బెంగళూరుకు వెళ్లిపోయారు. ఇలా అకస్మాత్తుగా జగన్ రాష్ట్రాన్ని వదిలేసి వెళ్లిపోవడం వైసీపీకే వెన్నుపోటు దినంగా పార్టీ క్యాడర్ వాపోతోంది. నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టేందుకు నాయకత్వం కొరవడటంతో.. చాలా వరకు నిరసన ప్రభావం కనిపించలేదు.

నిర్బంధం లేకపోయినా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రాజకీయ పక్షాలు నిరసనలకు పిలుపునిస్తే నిర్బంధంగా అణచివేసేవారు. నేతల ఇంటి వద్ద ముందురోజు రాత్రి నుంచే పోలీసులు పహారా కాసేవారు. ఎవరినీ బయటకు రానివ్వకుండా కట్టడి చేసేవారు. ఎవరైనా తప్పించుకుని రైలులోనో, బస్సులోనో, ఇతర వాహనాల్లోనో నిరసనలో పాల్గొనేందుకు వెళ్తే పోలీసులు వేటాడి అరెస్టులు చేసేవారు. కానీ బుధవారం నాడు రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులేవీ కనిపించలేదు. రాజకీయ పార్టీగా వైసీపీ ఆందోళన కార్యక్రమాలను చేసుకునేందుకు ప్రభుత్వం స్వేచ్ఛ ఇచ్చింది. కానీ వైసీపీ చేపట్టిన వెన్నుపోటు దినం ప్రభావం అంతగా కనిపించలేదు.

బొత్సకు, తమ్మినేనికి అస్వస్థత

» వెన్నుపోటు కార్యక్రమంలో కుప్పకూలిన మాజీ మంత్రి



వాహనంపైనే కుప్పకూలుతున్న బొత్స

చీపురుపల్లి, టెక్కలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినాయకత్వం పిలుపు మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న క్రమంలో మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎండ తీవ్రతకు ఇబ్బంది పడ్డారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో బొత్స పాల్గొన్నారు. ప్రసంగం మొదలుపెట్టిన కొద్దిసేపటికే కిందకు ఒరిగిపోయారు. వెంటనే ఆయనను కారులో గరివిడిలోని బొత్స క్యాంప్ కార్యాలయానికి తరలించారు వైద్యులు పరీక్షలు చేసి..వడదెబ్బ తగిలిందని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం బొత్స విశాఖకు వెళ్లారు.

శ్రీకాకుళంలో తమ్మినేని...

శ్రీకాకుళంజిల్లాలో బుధవారం వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం నిర్వహించాయి. ఇందిరా గాంధీ కూడలి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు కార్యకర్తలతో కలసి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం నడుచుకుంటూ వెళ్లారు. వైసీపీ శ్రేణులు సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసులు గేట్లు మూసివేశారు. గేట్లు తోసుకుని కొందరు కార్యాలయంలోకి వెళ్లారు. ఈ క్రమంలో కొందరు తీవ్రమైన ఎండకు ఇబ్బంది పడ్డారు. గేటు వద్ద నిలబడిన తమ్మినేని సీతారాంకూ వడదెబ్బ తగిలింది.

సీఐపై రాంబాబు జులుం



గుంటూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబును స్థానిక పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. అనుమతి లేదని పేర్కొన్నారు. దీంతో అంబటి సీఐపై నోరు పారేసుకున్నారు. 'బొంగా నువ్వు చేసేది..'అంటూ విరుచుకుపడ్డారు. "ఏం చేస్తావ్?.."అంటూ పళ్లుకొరుకుతూ సీఐ మీదికెళ్లే ప్రయత్నం చేశారు. మర్యాదగా మాట్లాడాలంటూ సీఐ హెచ్చరించగా ఏం చేస్తావంటూ అంబటి మరింత రెచ్చిపోయారు. దాంతో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరించడం, దూషించడం, చట్ట విరుద్ధంగా గుమికూడటం తదితర కార్యకలాపాల నేపథ్యంలో ఆయా సెక్షన్‌ల కింద రాంబాబుపై కేసు నమోదు చేశారు. అంబటి అనుచరుడు వినోద్‌తో పాటు వైసీపీ నాయకులు కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేలవంగా వైసీపీ నిరసనలు

» వెన్నుపోటు దినానికి ప్రజలు దూరం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4వ తేదీని 'వెన్నుపోటు దినం' పేరుతో బుధవారం వైసీపీ నిరసనకు పిలుపునిచ్చింది. అయితే.. ఈ నిరసన పేలవంగా సాగింది. పార్టీ అధిష్ఠానం పదే పదే చెప్పినా చాలా జిల్లాల్లో కీలక నాయకులు లైట్ తీసుకున్నారు. ఇక, సాధారణ ప్రజానీకం అసలు పట్టించుకోలేదు. మరోవైపు.. వైసీపీ నాయకులు కొందరు పోలీసులపైనా, ప్రజలపైనా తమ ప్రతాపం చూపించారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలు సాగాయి. అయితే ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శిలో నిర్వహించిన కార్యక్రమానికి పట్టుబట్టి కార్యకర్తలను తరలించినా.. వారు ఎక్కువసేపు ఉండలేదు. కనిగిరిలో సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నప్పటికీ నాయకులు, కార్యకర్తలు పెద్దగా కనిపించలేదు.

- నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో వైసీపీ చేపట్టిన వెన్నుపోటు ర్యాలీ కార్యక్రమంలో కర్నూలు నుంచి కూలీలను తరలించారు. పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో కర్నూలుకు చెందిన మహిళా కూలీలు కనిపించారు. ఎక్కడి నుంచి వచ్చారని మహిళల్ని ప్రశ్నిస్తే కర్నూలు చెన్నమ్మ సర్కిల్, సీక్యాంపు సెంటర్ల నుంచి తుఫాన్ వాహనాల్లో వచ్చామన్నారు. వైసీపీ నాయకుడు ఒకరు తమకు ఒక్కొక్కరికీ రూ.500 ఇచ్చారని మహిళలు పేర్కొన్నారు.
- మైలవరంలో మాజీ మంత్రి జోగి రమేశ్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి పేర్ని నాని ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.
- తణుకులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమానికి సుమారు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండిలో నామమాత్రంగానే పాల్గొన్నారు.
- విజయనగరం జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు.. వైసీపీ వారే ఉన్నా ఈ కార్యక్రమానికి స్వల్పంగా హాజరయ్యారు.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు చాలా తక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. కదిరిలో గత ఎన్నికల్లో ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి, నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ ముఖం చాటేశారు. హిందూపురం నియోజకవర్గంలో కీలక నేతలు కూడా డుమ్మా కొట్టారు.
- ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద వైసీపీ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పదుల సంఖ్యలోనే కార్యకర్తలు హాజరయ్యారు. 7 నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో పాటు ఒకరిద్దరు ముఖ్యనేతలు మాత్రమే హాజరయ్యారు.
- కడప జిల్లా పులివెందులలో నిర్వహించిన వెన్నుపోటు దినంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికలపుడు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అని చంద్రబాబు అన్నారని బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనిపించుకున్నారని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లకుపైగా అప్పు చేయగా కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.1.55 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. తొలుత ప్రొద్దుటూరు శివాలయం సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు.




నంద్యాల జిల్లా నందికొట్కూరులో వైసీపీ నిర్వహించిన 'వెన్నుపోటు దినం' ర్యాలీకి కర్నూలు నుంచి వచ్చిన మహిళా కూలీలు

గాలికి కొట్టుకుపోతారు!

వైసీపీని ఈసారి గెలిపించకపోతే ప్రజలందరూ గాలికి కొట్టుకుపోతారని గుంటూరు జిల్లా పొన్నూరు వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ శాపనార్థాలు పెట్టారు. పొన్నూరులో నిర్వహించిన వెన్నుపోటు దినంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

'వైఎస్సార్ డౌన్ డౌన్'

చిత్తూరు జిల్లాలోని జీడీ నెల్లూరులో నిర్వహించిన వెన్నుపోటు దినంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పాల్గొన్నారు. దివంగత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి వెనుతిరుగుతున్న సమయంలో అక్కడి కార్యకర్తలు ఒక్కసారిగా 'వైఎస్సార్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు.



శిరసు వంచి ప్రజలకు నమస్కరిస్తున్నా..!

- ప్రజా విప్లవానికి నియంతలు కొట్టుకుపోయారు
- ఏడాది క్రితం ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు ట్వీట్

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాలు విడుదలై ఏడాది అయిన సందర్భంగా నాటి ప్రజా తీర్పుపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజు... ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టుకుపోయిన రోజు... సైకో పాలనకు అంతం పలికి, ప్రతి పౌరుడూ స్వేచ్ఛ, ప్రశాంతత పొందిన రోజు... ఉద్యమంలా ఓట్లేసి తిరిగి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన రోజు... ప్రభుత్వ ఉగ్రవాదంతో గాయపడ్డ రాష్ట్రాన్ని కూటమి చేతిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు నాంది పలికిన రోజు... పసుపు సైనికుల పోరాటాలు, జనసైనికుల ఉద్యమాలు, కమలనాథుల మద్దతుతో రాష్ట్రం గెలిచిన రోజు ఇది. ఏడాది క్రితం ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతగా భావించి ప్రతి రోజూ పనిచేస్తున్నాం. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసేందుకు పాలనను గాడిన పెట్టి సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పట్టాలెక్కించాం. రాష్ట్ర దశ దిశను మార్చేందుకు ఇచ్చిన ఏకపక్ష తీర్పునకు ఏడాది పూర్తయిన సందర్భంగా నాటి విజయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రజలకు శిరసు వంచి నమస్కారాలు తెలియజేస్తున్నాను. వచ్చే 4 ఏళ్లలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని మాట ఇస్తున్నాం. విధ్వంస పాలకులపై రాజీలేని పోరాటంతో కూటమి విజయానికి నాంది పలికిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు' అని చంద్రబాబు పేర్కొన్నారు.



ఫ్యూడలిస్టిక్ కోటలను ఓటుతో బద్దలు కొట్టారు

- ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా కూటమి పని చేస్తుంది: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): 'దేశ రాజకీయ చరిత్రలో 2024, జూన్ 4 చిరస్థాయిగా నిలిచిపోయే రోజు. ఐదేళ్ల అరాచక పాలనను తరిమికొట్టి, నిరంకుశ ఫ్యూడలిస్టిక్ కోటలను ప్రజలు తమ ఓటు హక్కుతో బద్దలు కొట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలికారు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. 'దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న నవభారత్ నిర్మాత, ప్రధాని నరేంద్ర మోదీ దృఢమైన నాయకత్వం... నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవంతోపాటు ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని ప్రజాక్షేత్రంలో దృఢంగా నిలిచిన సీఎం చంద్రబాబు నేతృత్వం... దశాబ్ద కాలంగా ఎన్నో పోరాటాలు చేసి, మరెన్నో దాష్టీకాలను తట్టుకుని అడ్డుగోడగా నిలిచిన జనసైనికుల, వీరమహిళల పోరాట స్ఫూర్తి... వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే జనసేన పార్టీ సంకల్పానికి ప్రజలు అండగా నిలిచారు. సరిగ్గా ఏడాది క్రితం ఈరోజు చరిత్రాత్మక విజయాన్ని అందించారు. గత తప్పిదాలను సరిచేస్తూ, భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించేలా, రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్ర - 2047 దిశగా నడిపించేందుకు, వికసిత్ భారత్ 2047లో కీలక భాగస్వామి అయ్యేందుకు, రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా పరిపాలనను అందిస్తోంది. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన జనసైనికులకు, వీర మహిళలకు, కార్యకర్తలకు, మూడు పార్టీల నాయకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు.

నేరస్థులకు నేరగాడి అండ

(మొదటి పేజీ తరువాయి)

తప్పించుకోవడానికి దేశం విడిచిపోయారు. కానీ జగన్ లాంటి ఆర్థిక నేరగాడు రాష్ట్రంలోనే ఉంటూ ఇతర నేరస్థుల్ని ఏకంచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక్కడే ఉంటూ వారిని ప్రేరేపిస్తున్నారు. రాజకీయ ముసుగులో ఒక నేరస్థుడు ఇతర నేరస్థులకు అండగా నిలుస్తానంటున్నాడు. ఇది ఏ తరహా రాజకీయమో ప్రజలే అర్థం చేసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జగన్ తీరుపై సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు నేరస్థుల్ని రాజకీయ నాయకులు కలవాలంటే భయపడేవారని.. ఇప్పుడు నిస్సిగ్గుగా.. బహిరంగంగా.. నేరగాళ్లను కలవడమే కాకుండా వారిని అడ్డం పెట్టుకునే రాజకీయాలు చేస్తున్నారని.. నేరస్థులకు అండగా ఉన్నామని సందేశమిస్తూ రాజకీయాలను అధోగతికి తీసుకుపోతున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో తప్పులు చేసిన వారు ఇంకా బయటే తిరుగుతున్నారంటూ పలువురు మంత్రులు ప్రస్తావించారు. జగన్‌లో అరెస్టు భయం పెరుగుతోందని కొందరు మంత్రులు వ్యాఖ్యానించారు. గతంలో ఏ తప్పూ చేయకుండానే చంద్రబాబును, పలువురు టీడీపీ నాయకులను జైళ్లకు పంపారని.. ఘోరమైన తప్పులు చేసి కూడా జగన్ లాంటి వారు ఇంకా బయటే తిరుగుతున్నారని మంత్రి సంధ్యారాణి అన్నారు. దీనిపై సీఎం స్పందించారు. 'తప్పు చేసినవారు శిక్ష నుంచి తప్పించుకోలేరు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో మనల్ని వేధించారని.. మనమూ అదే పంథాలో వైసీపీ నేతలను వేధించడం సరికాదు' అన్నారు.

క్వాటమ్ వ్యాలీపై అవగాహన..

క్వాంటమ్ వ్యాలీపై ప్రజల్లో అవగాహన పెంచాలన్న సీఎం.. దానివల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో వివరించాలని సూచించారు. ప్రస్తుత కంప్యూటర్లు 8 గంటల్లో చేసే పనిని క్వాంటమ్ వ్యాలీ కంప్యూటర్ల ద్వారా 12 నిమిషాల్లోనే పూర్తిచేయవచ్చని.. ఇలాంటి అంశాలను సామాన్య ప్రజలకు తెలియజెబితే.. వారికి ఈ ప్రాజెక్టు గొప్పదనం అర్థమవుతాయన్నారు. క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణ డిజైన్లను తయారు చేస్తున్నారంటూ.. వాటిలో కొన్నింటిని మంత్రివర్గ సహచరులకు చూపించారు. మిగిలిన డిజైన్లు కూడా సిద్ధమయ్యాక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు చూపించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం నుంచి సానుకూలత వ్యక్తమైందని సీఎం మంత్రులకు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు నిధుల సమీకరణ జరుగుతోందని అన్నారు. తక్షణం దీనిని చేపట్టాల్సి ఉందని.. కేంద్రం సహకారంతో పాటు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), ఇతర బ్యాంకుల నుంచీ రుణాలు తీసుకుని సునాయాసంగా పూర్తి చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

మంత్రి స్వయంగా ఆహ్వానిస్తారు..

ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని చంద్రబాబు మంత్రులకు సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా 15న తిరుపతిలో సినిమా తారలతో యోగాంధ్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్వయంగా వెళ్లి సినిమా నటులను ఆహ్వానిస్తారని తెలిపారు.

మంత్రులతో కలిసి భోజనం చేసిన సీఎం, డిప్యూటీ సీఎం

క్యాబినెట్ సమావేశం ముగిశాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంత్రులతో కలిసి భోజనం చేశారు. ఆ సమయంలో కడప మహానాడు విజయవంతంపై మంత్రులను అభినందించిన బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో మహానాడు నిర్వహించాలంటే వేసవి సమయం కావడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, స్టేజీ ఎక్కేసరికి చొక్కాలు తడిచిపోయేవని, వేడికి తట్టుకోలేక పసుపు చొక్కాలను నీళ్లలో ముంచి వేసుకున్నా ఇట్టే ఆరిపోయేవని వ్యాఖ్యానించారు. ఈసారి వాతావరణం బాగా అనుకూలించిందని, ఆహ్లాదకర వాతావరణంలో మహానాడు నిర్వహించుకోగలిగామన్నారు. కూటమి పట్ల ప్రజల్లో సానుకూలతను మహానాడు తెలియజేసిందన్నారు.

లోకేశ్‌పై పవన్ ప్రశంసలు

రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని యువనేత, మంత్రి లోకేశ్ క్యాబినెట్ సమావేశం సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, ఇతర మంత్రులకు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. నాటి వైసీపీ రాక్షస పాలనపై ప్రజలను చైతన్యపరచడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో కూడా కీలకపాత్ర పోషించిందని తెలిపారు. ఆనాటి అనుభవాలను కళ్లకు కట్టినట్లుగా పుస్తక రూపంలో తేవడంపై లోకేశ్‌ను ప్రశంసించారు. అరాచకపాలన అంతమై ఇవాళ్టికి ఏడాది పూర్తయిందని.. ఆ పీడకలలను ఇప్పటికీ జనం మరచిపోలేదని తెలిపారు. పాదయాత్ర అనుభవాలను లోకేశ్.. పవన్‌తో పంచుకున్నారు.

దూకుడు పెంచండి

ఏడాది పాలన అంతా బాగానే సాగిందని, వచ్చే ఏడాది కాలానికి పక్కా ప్రణాళిక వేసుకుని మరింత సమర్థంగా పనిచేయాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. 'ప్రజా సమస్యల పరిష్కారమే మన ఎజెండా కావాలి. మరింత దూకుడు పెంచి ప్రజలతో మమేకం కావాలి. మనం అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమం అంతిమ లబ్ధిదారుకు చేరేలా దృష్టి పెట్టాలి' అని సూచించారు. యోగా దినోత్సవం విజయవంతంపై ప్రస్తుతం రాష్ట్ర యంత్రాంగమంతా దృష్టిసారించిందని.. అందుచేత కూటమి సర్కారు ఏడాది విజయోత్సవాలేవీ ఇప్పుడొద్దని చెప్పారు. పీ-4 విధానం సక్రమ అమలుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక వ్యవస్థ ఉండాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. దీనిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని మంత్రులకు సూచించారు. ఈ నెల 12వ తేదీలోగా ప్రతి జిల్లా కేంద్రంలో పీ-4 కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'సీఎం దార్శనికుడు'

ఏడాది కాలంలో 25 మంత్రివర్గ సమావేశాలు నిర్వహించామని మంత్రివర్గ సహచరులకు సీఎం వివరించారు. గత ఏడాది ఇదే రోజున ఫలితాలు వెలవడడానికి ముందు వరకూ జరిగిన వివిధ సంఘటనలను పలువురు మంత్రులు గుర్తు చేసుకున్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం, ఆయన పోరాటాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ 25 మంత్రివర్గ సమావేశాల్లో రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశం చేసే ఎన్నో కీలక, సాహసోపేత నిర్ణయాలను తీసుకున్నారని, ఆయన దార్శనికుడని ప్రశంసిస్తూ మంత్రిమండలి చప్పట్లతో అభినందించింది.

జీవోలతో జాగ్రత్త..

తుని రైలు దహనం కేసు అంశం క్యాబినెట్‌లో ప్రస్తావనకు వచ్చింది. ప్రతి జీవోను జాగ్రత్తగా గమనించాలని సీఎం మంత్రులను ఆదేశించారు. పొరపాటు జరిగాక సరిదిద్దుకోవడం కంటే ముందే జాగ్రత్త పడాలన్నారు. తుని కేసు నిందితులను నిర్దోషులుగా విడుదల చేస్తూ రైల్వే కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో అప్పీల్ చేయాలని హోం శాఖ యాంత్రికంగా జీవో ఇవ్వడం.. తమకు చెప్పకుండా చేయడంపై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తంచేయడంతో దానిని ఉపసంహరించుకోవడం తెలిసిందే. ఈ తరహా పరిణామాలు ఇక పునరావృతం కాకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. జరిగిన పొరపాటుకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజీత్ సీఎంకు క్షమాపణలు చెప్పారు.

రాష్ట్రంలో క్వాంటమ్ మిషన్

- 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష
- మహిళా ఉద్యోగులు ఫ్యాక్టరీల్లో ఇకపై రాత్రిళ్లూ పనిచేసే చాన్సు
- 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు
- క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్వాంటమ్ మిషన్ (ఎస్‌క్యూఎం) స్థాపనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా యావజ్జీవ ఖైదీల ముందస్తు విడుదలకు శాశ్వత మార్గదర్శకాలను జారీచేసిన నేపథ్యంలో 2025 ఫిబ్రవరి 1 నాటికి అర్హులైన 17 మంది యావజ్జీవ ఖైదీలకు ప్రత్యేక క్షమాభిక్ష మంజూరు చేయడానికి హోంశాఖ చేసిన ప్రతిపాదనను సమ్మతించింది. బుధవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ఎస్‌క్యూఎం స్థాపనకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించిందన్నారు. జాతీయ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని స్థాపించి, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో పరిశోధనలను ముందుకు తీసుకెళ్లేందుకు ఐఐటీ మద్రాస్, టీసీఎస్, ఐబీఎం వంటి సంస్థలతో కలిసి పనిచేసి తద్వారా ప్రపంచస్థాయి పరిశోధనలను ఆకర్షించి, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావాలనే లక్ష్య సాధనకు ఈ నిర్ణయం ఉపకరిస్తుందని తెలిపారు. ఈ నెలలోనే క్వాంటమ్ సదస్సు నిర్వహించి అంతర్జాతీయ నిపుణులతో వ్యూహాత్మక కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. క్షమాభిక్షకు.. మరణశిక్ష వర్తించే నేరాలకు గాను 14 ఏళ్లు, జీవిత ఖైదులో ఏడేళ్లు వాస్తవ శిక్ష అనుభవించిన ఖైదీలు అర్హులని చెప్పారు. క్షమాభిక్ష ద్వారా విడుదలైన తర్వాత ఖైదీలు ప్రతి మూడు నెలలకోసారి సంబంధిత పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలి. మళ్లీ ఏదైనా నేరం చేస్తే క్షమాభిక్ష రద్దవుతుంది.

మరిన్ని నిర్ణయాలు..

- ఏపీఎస్‌పీఎఫ్‌లో 248 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి ఇవ్వడానికి ఆమోదం.
- వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చడానికి ఇప్పటికే జారీ చేసిన తుది నోటిఫికేషన్‌కు ధ్రువీకరణ.
- ఏపీ పోలీస్ అకాడమీ స్థాపన కోసం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి గ్రామాల్లో 94.497 ఎకరాల ప్రభుత్వ భూమి హోం శాఖకు ఉచితంగా బదిలీ.
- ఏలూరు జిల్లా వంగూరులో నిర్మించతలపెట్టిన హైదరాబాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు మాజీ ఐఏఎస్ అధికారిణి కాసరనేని దమయంతి దాన ప్రక్రియ ద్వారా ఇచ్చే 10.88 ఎకరాల భూమి బదలాయింపునకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు.
- ఫ్యాక్టరీల్లో మహిళా ఉద్యోగులు ఇకపై రాత్రి పూట కూడా విధులు నిర్వహించేందుకు పూర్తి రక్షణతో చట్ట సవరణలకు ఆమోదం. ఫ్యాక్టరీల్లో పని చేసే మహిళలకు ఇప్పటివరకు ఓవర్ టైం 50-75 గంటలు మాత్రమే పనిచేసే అవకాశం ఉంది. ఇకపై వారు త్రైమాసికంలో 144 గంటలు ఓవర్ టైం చేసేందుకు నిబంధనలు సవరించారు.
- ఎన్టీఆర్ సుజల పథకం కింద శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, ఆదివాసీ ప్రాంతాలకు ఆర్వో ప్లాంట్ ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా కోసం రూ.5.75 కోట్ల వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని 4 మండలాల్లో నీటి కొరత ఉన్న 533 జనావాసాల్లో 15 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు రూ.8.22 కోట్ల వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు ఆమోదం.
- విశాఖపట్నంలోని హరిత హోటల్ యాత్రీనివాస్ పనులకు ఇప్పటికే సవరించి అమలుపరచిన పరిపాలనా అనుమతులకు ధ్రువీకరణ. గత ప్రభుత్వం హరిత హోటల్ అభివృద్ధి పనులకు రూ.4.5 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపి.. ఆనక అనుమతుల్లేకుండానే రూ.13.50 కోట్లకు పెంచి ఖర్చు చేశారు. ఆ పెంపును ఇప్పుడు క్యాబినెట్ ఆమోదించింది.
- ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ సిటీస్ ప్రమోషన్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఈడీసీవో) ద్వారా ఎన్టీఆర్ జిల్లా వేమవరంలోని జెట్ సిటీ వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయడానికి ఆమోదం. జెట్ సిటీ ప్రాజెక్టు మొదటి దశకు 10.12 ఎకరాలు కేటాయింపు. స్టాంపు సుంకం, రుసుము మినహాయించి ఏపీఐఐసీకి బదిలీ.
- రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక కింద రూ.20.39 కోట్ల మేర బిల్లుల చెల్లింపుకు అనుమతి.
- 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' అనే విధానంతో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి ఆమోదం.




రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

భాగస్వాముల్లో ఒకరికి ఐదేళ్ల సర్వీస్ లేకున్నా బదిలీ లేదు..

- మార్గదర్శకాల్లో స్వల్ప మార్పులు.. మంత్రి సత్యకుమార్ ఆమోదం

అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బదిలీల ప్రక్రియపై ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు హెచ్‌వోడీలతో బుధవారం రెండు గంటలపాటు చర్చించారు. అనంతరం బదిలీలపై రూపొందించిన మార్గదర్శకాల్లో చేసిన స్వల్ప మార్పులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. బదిలీల్లో భాగంగా దంపతుల్లో ఎవరైనా ఒకరు ఒకేచోట ఐదేళ్లకన్నా తక్కువే పనిచేసి ఉంటే వారిద్దరినీ అదేచోట కొనసాగించాలని ఈ మార్గదర్శకాల్లో సూచించారు. ఒకేచోట ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసిన వారికి బదిలీల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆ తర్వాత ఒకేచోట రెండు నుంచి ఐదేళ్లలోపు పనిచేసిన వారికి వాళ్లు ఇచ్చిన ఆప్షన్ ఆధారంగా కొత్త స్థానాలు కేటాయిస్తారు. కాంట్రాక్టు నియామకాలతో రెగ్యులర్ పోస్టుల్లో పనిచేస్తున్న వారు మాత్రం యథావిధిగా కొనసాగుతారు. ఆ రెగ్యులర్ స్థానాలను ఖాళీలుగా పరిగణించకూడదని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. మరోవైపు వివిధ స్థాయిల్లో ప్రస్తుత సాధారణ బదిలీల నిమిత్తం ప్రకటించని ఖాళీల గురించి ఎంటీ కృష్ణబాబు వాకబు చేశారు. వైద్యకళాశాలల్లో జాతీయ వైద్య సంఘం నిబంధనలు మేరకు వైద్య అధ్యాపకులను కొనసాగించేందుకు కొన్ని ఖాళీలను చూపలేదని, పీపీపీ విధానంలో నిర్వహించాల్సిన వైద్య కళాశాలల్లో గతంలో నియమించిన వారిని రీడిప్లాయ్‌మెంట్ చేయాల్సిన అవసరాల దృష్ట్యా మరికొన్ని ఖాళీలను ప్రకటించలేదని హెచ్‌వోడీలు ఆయనకు తెలిపారు. కాగా, ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా ఖాళీలన్నీ చూపించాలని, బదిలీల మార్గదర్శకాల్లో కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వానికి, డీఎంఈకి లేఖ రాసింది. ప్రభుత్వ వైద్యుల సంఘం నేత డాక్టర్ జయధీర్ బదిలీల్లో ఖాళీలు మొత్తం చూపించి, కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలం డ్యాంలో రెండో రోజూ శాస్త్రవేత్తల సర్వే



శ్రీశైలం జలాశయం వద్ద సర్వే చేస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో కట్టడాల తీరుతెన్నులపై పుణేకు చెందిన కేంద్ర జల-విద్యుత్ పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తలు రెండో రోజు బుధవారం కూడా సర్వే చేశారు. శాస్త్రవేత్తలు ఎం.ఎస్ బిస్త్, అజయ్ సొనావనే, వీఎన్ కట్టే, రీసెర్చ్ అసిస్టెంట్ రాకీ పలు అంశాలపై అధ్యయనం చేశారు. ప్లంజ్‌పూల్‌తో పాటు కాంక్రీట్ సిలిండర్ల గ్యాలరీలను పరిశీలించారు. డ్యాంలోని కొన్ని ప్రాంతాలకు బోట్లలో వెళ్లారు. లేజర్ టెక్నాలజీని వినియోగించి ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే చేశారు. శాస్త్రవేత్తలతో పాటు సంబంధిత ఇంజనీర్లు కూడా సర్వేలో పాల్గొన్నారు.

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే వరదనీటితో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి నీటిమట్టం 834.60 అడుగులు ఉండగా.. నీటి నిల్వ 54.55 టీఎంసీలుగా నమోదైంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల జలాశయం నుంచి 21,334 క్యూసెక్కులు వచ్చి చేరింది. ఇందులో విద్యుదుత్పత్తి, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,543 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు.

పీ4లో వేగం పెరగాలి

- 15 లక్షల బంగారు కుటుంబాలకు పథకం విస్తరింపజేయాలి
- ఆగస్టు 15 నాటికి మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలి
- స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌గా మార్చాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- పీ4 లోగో డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి
- ఇప్పటి వరకు 70 వేల కుటుంబాలకు పీ4 సాయం: అధికారులు



పీ4పై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్ ఇతర అధికారులు


అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పీ4 పథకాన్ని ఆగస్టు 15 నాటికి 15 లక్షల కుటుంబాలకు విస్తరింపజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 15 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ఇందుకు అవసరమైన మార్గదర్శి రిజిస్ట్రేషన్, దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. నాడు ఆర్థిక సంస్కరణల తర్వాత చేపట్టిన పీపీపీ విధానానికి కొనసాగింపుగానే నేడు పీ4 విధానం తీసుకొచ్చామని పునరుద్ఘాటించారు. బుధవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో పీ4పై సీఎం సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌గా మార్చాలని నిర్దేశించారు. అమరావతి పీ4కి కేస్ స్టడీగా నిలుస్తుందని, రాజధాని నిర్మాణంలో 29,000 మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి బంగారు కుటుంబాన్ని మార్గదర్శులు దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేసేలా సాయం చేయాలని చెప్పారు. ఇకపై ప్రతి 10 రోజులకొకసారి పీ4 పురోగతిని సమీక్షిస్తానని సీఎం చెప్పారు. అధికారులు రూపొందించిన పీ4 లోగో డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.

పీ4కు భాగస్వాముల సహకారం

పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మిలాప్, ప్రాజెక్ట్ డీప్, రంగ్ దే, భార్గో వంటి సంస్థలు భాగస్వాములుగా సహకారం అందించేందుకు ముందుకువచ్చినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 19,15,771 బంగారు కుటుంబాలు నమోదు కాగా, వీరిలో ఇప్పటి వరకు 70,272 కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని వివరించారు. వీరిలో 26,340 బీసీ కుటుంబాలు, 14,024 ఎస్సీ కుటుంబాలు, 13,115 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు.

అమరావతిలో అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం

- గవర్నర్ ఆర్డినెన్స్.. న్యాయశాఖ ఉత్తర్వులు
- వంద ఎకరాల్లో నిర్మాణానికి చర్యలు
- బీసీఐ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు
- రాష్ట్ర విద్యార్థులకు 20 శాతం సీట్లు



అమరావతి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం ఏర్పాటుకానుంది. అంతర్జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఇటీవల కేబినెట్ ఆమోదం తెలుపగా అందుకు అనుగుణంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఆర్డినెన్స్ జారీచేశారు. దీనిపై సంబంధిత ఉత్తర్వులను న్యాయశాఖ జారీచేసింది. దీంతో న్యాయవిద్య, పరిశోధన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దీనిని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)కి చెందిన 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్-పెర్ల్ ఫస్ట్' ఏర్పాటుచేస్తుంది. ఈ ట్రస్టులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఇప్పటికే బీసీఐ ట్రస్టు ఆధ్వర్యంలో గోవా, బెంగళూరుల్లో న్యాయ విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యూనివర్సిటీ ఏర్పాటుచేయడం వల్ల అత్యంత నాణ్యమైన న్యాయ విద్య అందుబాటులోకి వస్తుంది. ఫలితంగా నిష్ణాతులైన న్యాయవాదులు తయారవుతారు. వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం వంద ఎకరాల భూమి కేటాయిస్తుంది. నిర్మాణ బాధ్యతలనూ తానే తీసుకుంటుంది. ఈ విశ్వవిద్యాలయంలో 20 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. కాగా.. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది ఆగస్టులో బీసీఐ ట్రస్టు ప్రతినిధులు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. అప్పట్లోనే వర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇప్పుడు ఆర్డినెన్స్ జారీ చేసింది. వచ్చే శాసనసభ సమావేశాల్లో న్యాయ శాఖ దీనిపై బిల్లు ప్రవేశపెడుతుంది.

ఆ విద్యార్థులకు ఏం న్యాయం చేశారు?

- నీట్ కేంద్రంలో విద్యుత్ అంతరాయంపై ప్రభుత్వ న్యాయవాదులకు హైకోర్టు ప్రశ్న

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరు దర్గామిట్టలోని ఓ కేంద్రంలో నీట్ పరీక్ష రాసే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో సమయం వృథా అయిందని పేర్కొంటూ బత్తిన శ్రీవల్లి అనే విద్యార్థిని వేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఇలాంటి సందర్భాలలో విద్యార్థులకు న్యాయం చేసేందుకు ఏ చర్యలు తీసుకున్నారో వివరాలు సేకరించి తమ ముందు ఉంచాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ తరఫు న్యాయవాదులను ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా చేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నెల్లూరు దర్గామిట్టలోని డీసీఆర్ జెడ్‌పీపీ బాలిక ఉన్నత పాఠశాల కేంద్రంలో మొత్తం 96 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాసేందుకు హాజరయ్యారన్నారు. మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఎన్టీఏ తరఫు న్యాయవాది విద్యుత్ సరఫరాలో అంతరాయం విద్యార్థులపై స్వల్ప ప్రభావమే చూపుతుందన్నారు. కాగా, నీట్ పీజీ-2025 పరీక్షకు దరఖాస్తు చేసే సమయంలో ఎన్‌బీఈఎంఎస్ పోర్టల్‌లో సాంకేతిక సమస్య ఏర్పడిందని పేర్కొంటూ వైద్య విద్యార్థిని శీలం జస్వంతి వేసిన పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం స్పందించింది. విండోను తిరిగి తెరిచి దరఖాస్తు చేసుకొనేందుకు పిటిషనర్‌కు అనుమతివ్వాలని ఎన్‌బీఈఎంఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది.

అనారోగ్య సమస్యలకు హాజరు నిబంధన సరికాదు

- విద్యార్థి కౌశిక్ మూడో సెమిస్టర్ ఫలితాలు వెల్లడించండి
- నాలుగో సెమిస్టర్ క్లాసులకు కూడా అనుమతించండి: హైకోర్టు

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో తరగతులకు హాజరుకాలేకపోయిన విద్యార్థికి హాజరు తక్కువగా ఉందనే కారణంతో మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు వెల్లడించకపోవడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. నాలుగో సెమిస్టర్‌కు అనుమతించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. నిబంధనల ప్రకారం అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు హాజరును 10శాతం వరకే మినహాయించగలమని జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (జీఎంఆర్ఐటీ) కళాశాల యాజమాన్యం చెప్పడాన్ని తప్పుబట్టింది. ఆ నిబంధన ప్రభుత్వ సంస్థలు రూపొందించలేదని పేర్కొంది. పిటిషనర్ కౌసిక్ మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించాలని, అలాగే నాలుగవ సెమిస్టర్ తరగతులకు హాజరయ్యేందుకు అనుమతించాలని జీఎంఆర్ఐటీని ఆదేశించింది. పిటిషనర్ బీటెక్ కోర్సు పూర్తి చేసేందుకు అనుమతించాలని జీఎంఆర్ఐటీ కళాశాల, రాష్ట్ర విద్యాశాఖ, జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌లను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తీర్పు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ఐటీలో విద్యార్థి టీవీకే కౌశిక్ బీటెక్(ఏఐ)ను అభ్యసిస్తున్నాడు. అనారోగ్యం వల్ల మూడో సెమిస్టర్‌లో హాజరు తగ్గింది. దీనికి సంబంధించి మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించాడు. హాజరు 65% కన్నా తక్కువ ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం అతన్ని పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించాడు.

అడవుల రక్షణకు మహిళల చిప్కో ఉద్యమం

» బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం భేటీలో ఎంపీ శబరి



సదస్సులో పాల్గొన్న ఎంపీ శబరి

న్యూఢిల్లీ, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): 'వాతావరణ మార్పులపై ప్రపంచ దేశాలు చర్చలు చేపట్టకముందే పర్యావరణ పరిరక్షణ కోసం భారత్ కృషి చేసింది. భారత్‌లోని గ్రామీణ మహిళలు అడవులను కాపాడుకునేందుకు 1970ల్లో చిప్కో ఉద్యమాన్ని చేపట్టారు' అని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి తెలిపారు. బ్రెజిల్‌లో జరుగుతున్న 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం భేటీలో భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వంలోని ఎంపీల బృందం పాల్గొంది. ఎంపీ శబరి ఈ బృందంలో సభ్యురాలు. 'వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి మహిళల సాధికారత' అనే అంశంపై జరిగిన చర్చలో శబరి మాట్లాడారు. వాతావరణ లక్ష్యాలపై భారత్ సాధించిన పురోగతిని వివరించారు. భారత్‌లో 26 శాతం అడవులు ఉన్నాయని, గత మూడేళ్లలో 23 చిత్తడి నేలల ప్రాంతాలు రామ్‌సర్ సైట్‌లుగా గుర్తింపు పొందాయని తెలిపారు.

కారడవిలో అర్ధరాత్రి ప్రసవం

» డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో డెలివరీ

» తల్లీబిడ్డ క్షేమం... జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలింపు



అర్ధరాత్రి వేళ కారడవిలో ప్రసవించిన చిన్నమ్మి

పెదబయలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రహదారి సౌకర్యం లేని మారుమూల గ్రామం.. రాత్రి సమయంలో మొదలైన పురిటి నొప్పులు.. అంబులెన్స్ గ్రామంలోకి రాలేని పరిస్థితి.. ఇలాంటి తరుణంలో గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె అర్ధరాత్రి వేళ కారడవిలోనే ప్రసవించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బొంగరం పంచాయతీ కుంబుర్ల గ్రామం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. కుంబుర్ల గ్రామానికి చెందిన అరడ చిన్నమ్మికి మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో నొప్పులు మొదలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా రహదారి లేకపోవడంతో ఆ వాహనం రాలేదు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరంలోని డి.కొత్తూరు వరకూ చిన్నమ్మిని డోలీలో తీసుకువెళ్లాలని కుటుంబసభ్యులు భావించారు. చీకట్లో సెల్‌ఫోన్ల లైట్ల వెలుతురులో కొండలు, గుట్టలు దాటుకుంటూ వెళుతుండగా మధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఆశ కార్యకర్త కాసులమ్మ అడవిలోనే ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డను డి.కొత్తూరుకు తీసుకువెళ్లి అక్కడి నుంచి అంబులెన్స్‌లో జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు.

కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు



» సిట్ ముందుకు వైవీ సుబ్బారెడ్డి పీఏ

» టీటీడీ మాజీ చైర్మన్ వ్యవహారాల్లో అప్పన్నదే కీలక పాత్ర

» తిరుపతిలో విచారిస్తున్న సీబీఐ అధికారులు

» తెర వెనుక ఏమి జరిగింది? ఒప్పందాలపై సమాచారం రాబట్టేందుకు ప్రశ్నలు

» త్వరలో ఇద్దరు ముఖ్యులకు నోటీసులు

» అదుపులో కోల్‌కతా పారిశ్రామికవేత్త

తిరుపతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఎట్టకేలకు అసలు డొంక కదులుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు అప్పన్నను సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో టీటీడీలో ఇదివరకూ కీలకంగా వ్యవహరించిన ఇద్దరు ముఖ్యులకు నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం. అప్పన్న వద్ద కీలక సమాచారం ఉందని భావించిన సిట్ అధికారులు విచారణకు హాజరు కావాలని ఇటీవల నోటీసు జారీ చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం తిరుపతిలోని సిట్ కార్యాలయంలో అధికారుల ఎదుట ఆయన హాజరయ్యారు. టీటీడీకి నెయ్యి సరఫరా వ్యవహారంలో తెర వెనుక ఏమి జరిగింది? ఎలాంటి ఒప్పందాలు జరిగాయి? ఎవరికి ఏ ప్రయోజనాలు కలిగాయి? అన్న సమాచారం రాబట్టేందుకు అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. సీబీఐకి చెందిన ముగ్గురు డీఎస్పీలు, రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన ఒక డీఎస్పీ.. మొత్తం నలుగురు డీఎస్పీల బృందం విచారిస్తోంది. అధికారుల ప్రశ్నలు, అప్పన్న ఇచ్చే సమాధానాలను వీడియో, ఆడియోలతో రికార్డు చేస్తున్నట్టు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సిట్ ఇప్పటి దాకా జరిపిన దర్యాప్తు అంతా నెయ్యి తయారైన డెయిరీలు, సరఫరా చేసిన డెయిరీలు, వాటి ప్రతినిధులు, వారి సిబ్బంది, సహకరించిన వారి చుట్టూనే తిరిగింది. ఇప్పటి వరకూ అరెస్టయిన ఎనిమిది మందిలో ఆరుగురు డెయిరీలకు సంబంధించిన వ్యక్తులు కాగా.. మిగిలిన ఇద్దరూ టీటీడీ ఉద్యోగులు. గతేడాది నవంబరు 22న సిట్ దర్యాప్తు ప్రారంభించినప్పటి నుంచి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో డెయిరీలు, టీటీడీ ఉద్యోగులను మినహా టీటీడీ పాలకవర్గానికి సంబంధించిన కీలక వ్యక్తులపై దృష్టి పెట్టినట్టు కనిపించలేదు. దర్యాప్తు మొదలైన ఆరు నెలల తర్వాత ఇప్పుడు ఏకంగా టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడికి నోటీసు జారీ చేసి విచారణకు రప్పించారు.

త్వరలో కీలక వ్యక్తులకూ..

మాజీ సీఎం జగన్‌కు చిన్నాన్న కావడంతో టీటీడీ చైర్మన్‌గా నాలుగేళ్ల పాటు వైవీ సుబ్బారెడ్డి తిరుగులేని అధికారం చెలాయించారు. ఆయనకు మొత్తం ఐదుగురు వ్యక్తిగత సహాయకులు ఉన్నట్టు సమాచారం. వారిలో అప్పన్న కీలక వ్యక్తి అని సిట్ గుర్తించింది. వైవీ సుబ్బారెడ్డికి సంబంధించిన అతి ముఖ్యమైన వ్యవహారాలన్నింటినీ ఈయనే చక్కబెట్టేవారని సమాచారం. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే అప్పన్నకు ఢిల్లీలో కూడా పలువురు ప్రముఖులు, కీలక వ్యక్తులతో విస్తృత పరిచయాలు ఉన్నాయని తెలిసింది. ప్రస్తుతం అప్పన్నను విచారిస్తున్న సిట్ అధికారులు.. ఈ క్రమంలో సేకరిస్తున్న సమాచారం ఆధారంగా టీటీడీలో ఇదివరకూ కీలకంగా వ్యవహరించిన ఇద్దరు ముఖ్యులకు నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం. తొలుత ఒకరికి, తదుపరి మరొకరికి నోటీసులు జారీ చేసే అవకాశముంది. ఆ కీలక వ్యక్తుల్లో ఒకరిని ప్రస్తుతం సిట్ అదుపులో ఉన్న అప్పన్న సమక్షంలోనే ప్రశ్నించే అవకాశముందని సిట్ వర్గాల ద్వారా తెలిసింది.

సిట్ అదుపులో కోల్‌కతా పారిశ్రామికవేత్త

కల్తీ నెయ్యి కేసులో తాజాగా సిట్ అధికారులు కోల్‌కతాకు చెందిన జ్యోతిష్య అనే పారిశ్రామికవేత్తను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఏ2 నిందితుడు భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పామిల్ జైన్‌కు ఆయన సన్నిహిత మిత్రుడని సమాచారం. జ్యోతిష్యకు కోల్‌కతాలో పామాయిల్, ఇతర ఎడిబుల్ ఆయిల్స్ తయారీకి సంబంధించిన ప్లాంట్ ఉందని తెలిసింది. పామిల్ జైన్‌కు ఆయనే నెయ్యి తయారీకి అవసరమైన ముడి పదార్థాలను సరఫరా చేసినట్టు సిట్ అధికారులు గుర్తించారు. అయితే ఆ మేరకు రికార్డుల్లో ఆయనకు పామిల్ జైన్ ఎటువంటి బిల్లులూ చెల్లించినట్టు నమోదు కాలేదని సిట్ బృందం గుర్తించింది. తొలుత విచారణకు హాజరు కావాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయగా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీంతో కోల్‌కతా వెళ్లిన సిట్ అధికారులు ఆరు రోజుల పాటు అక్కడే మకాం వేసి చివరికి నగర శివారులో అదుపులోకి తీసుకున్నారని సమాచారం. అక్కడి నుంచి తిరుపతి తీసుకొచ్చి విచారిస్తున్నారు. పామిల్ జైన్‌తో ఎప్పటి నుంచి పరిచయం ఉంది? ఆయనకు ఏయే ముడి పదార్థాలు సరఫరా చేస్తున్నారు? ఎప్పటి నుంచి సరఫరా చేస్తున్నారు? వంటి అంశాలపై ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నారనే విషయమే తనకు తెలియదని, పామిల్ జైన్ ఇండెంట్ పెట్టడంతో ఆయా ముడి పదార్థాలను సరఫరా చేశానని జ్యోతిష్య వెల్లడించినట్టు సమాచారం.

విచారణకు సిద్ధమని చెప్పే

దమ్ములేదా?

» జగన్ నువ్వు నిరసనలు చేస్తుంటే దొంగే.. దొంగ దొంగ అని అరుస్తున్నట్లుంది: షర్మిల



అమరావతి, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): 'అధికారంలో ఉండగా చేసిన స్కామ్‌లపై విచారణకు సిద్ధమని చెప్పే దమ్ములేని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరసనలు చేస్తుంటే... దొంగే... దొంగ దొంగ అని అరుస్తున్నట్లు ఉంది' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. మద్యం అమ్మకాలను నగదు రూపంలో కొనసాగించడంపై అసెంబ్లీ సాక్షిగా విచారణకు సిద్ధమని చెప్పే దమ్ము జగన్‌కు లేదు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి విచారణకైనా సిద్ధమేనంటూ బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదు? ఇంట్లో ప్రెస్‌మీట్లు పెట్టి మారం చేసే జగనే అసలైన వెన్నుపోటుదారుడు. కూటమి హామీలపై గళం విప్పకుండా ప్రతిపక్ష నేత హోదా కావాలంటూ అసెంబ్లీకి వెళ్లకపోవడం ప్రజలకు వెన్నుపోటు పొడవడం కాదా? ఉన్మాద అవినీతి, అరాచక పాలనకు గుణపాఠం చెప్పి, ఏడాది కిందట ఇదే రోజున కూటమి పార్టీలకు పట్టం కడితే... ప్రజాతీర్పునకు జగన్ వెన్నుపోటు అంటూ వక్రభాష్యం చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం పునర్నిర్మాణం పేరిట సంవత్సరంపాటు కాలయాపన చేసింది. సూపర్‌సిక్స్ హామీలను గాలికి వదిలేశారు. అప్పుల సాకు చూపి అభివృద్ధిని అటకెక్కించారు. ఇవ్వాళ ప్రజా తీర్పు దినం కాదు... రాష్ట్ర ప్రజా వంచన దినం. నమ్మకం పేరిట మోదీ, బాబు, పవన్ రాష్ట్ర ప్రజలను వంచించారు' అని షర్మిల అన్నారు.

ఏపీ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి ఈశ్వరరావు

న్యూఢిల్లీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటించారు. ఏపీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా ఆమంచి కృష్ణమోహన్, షేక్ మస్తాన్ వలి, మేరజోతు సూర్య నాయక్, ఉడత వెంకటరావు యాదవ్, సయ్యద్ జావీద్ అన్వర్, అరిగెల అరుణ కుమారి నియమితులయ్యారు.

మద్యం ముడుపులతో ఓట్ల కొనుగోలు!

(మొదటి పేజీ తరువాయి)

కీలక సమాచారాన్ని రాబట్టారు. ఒక ఎంపీ అభ్యర్థి తరఫున ఆయన గన్‌మ్యాన్, మరో అభ్యర్థి కోసం ఆయన డ్రైవర్ 'ఫండ్' అందుకున్నట్లు నిర్ధారించుకున్నారు. అప్పటికే ఎంపీగా ఉన్న ఒక అభ్యర్థి స్వయంగా వాహనంలో వెళ్లి ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. ఈ డబ్బులు ఇచ్చింది మరెవరో కాదు! లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి డ్రైవర్, వ్యక్తిగత సహాయకుడే! ఇందులో గన్‌మ్యాన్ పేరు... గిరి. ఆయనది శ్రీకాకుళం జిల్లా. ఆయనతోపాటు మరో ఎంపీ అభ్యర్థి డ్రైవర్, రాజ్ కసిరెడ్డి డ్రైవర్ శ్రీకాంత్, సహాయకుడు రజనీకాంత్‌ను కూడా 'సిట్' అధికారులు ప్రశ్నించారు. తాము తరచూ హైదరాబాద్ నుంచి సూర్యాపేట వరకూ అట్టపెట్టెలు, సంచుల్లో డబ్బు తీసుకొచ్చి... 'ఇవ్వాల్సిన వాళ్లకు ఇచ్చి' వెనక్కి వెళ్లిపోయినట్లు అంగీకరించినట్లు తెలిసింది. డబ్బులు పుచ్చుకున్న గన్‌మ్యాన్ గిరి, మరో అభ్యర్థి డ్రైవర్‌తోపాటు... రాజ్ కసిరెడ్డి డ్రైవర్‌ను సిట్ అధికారులు ఇటీవల ప్రశ్నించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... "నన్ను వాహనానికి రక్షణగా మాత్రమే పంపించారు. డబ్బులు తెచ్చిన మాట వాస్తవం. కానీ... ఎంతుందో నాకు తెలియదు" అని గన్‌మ్యాన్ గిరి చెప్పారు. మరో ఎంపీ అభ్యర్థి డ్రైవర్... రాజ్ కసిరెడ్డి డ్రైవర్ నుంచి రూ.3.50 కోట్లు అందినట్లు అంగీకరించారు. తెలంగాణలోని సూర్యాపేటలో ఈ ముడుపులు చేతులు మారినట్లు వెల్లడైంది. కోర్టు అనుమతితో ఆ ఇద్దరు వైసీపీ నేతలను కూడా విచారించే అవకాశం ఉంది.

పథకం ప్రకారం కానిస్టేబుల్ ద్వారా...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన గిరి అనే ఏఆర్ కానిస్టేబుల్‌ను ఇటీవల సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆయన... 2019 వరకు కీలక వైసీపీ ఎమ్మెల్యే వద్ద గన్‌మ్యాన్‌గా పని చేశారు. తాజా ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యేను జగన్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. టీడీపీ నుంచి ఆర్థికంగా బలమైన అభ్యర్థి బరిలో ఉండటంతో... హైదరాబాద్ నుంచి పలు మార్లు డబ్బులు తెప్పించారు. ప్రతిసారీ ఎంపీ అభ్యర్థి గన్‌మ్యాన్‌గా ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ గిరి ఆ వాహనంలో ఉన్నట్లు తేలింది. వాహనంలో పోలీసులు ఉంటే... ప్రత్యేకంగా తనిఖీలు ఉండవనే ఆలోచనతోనే ఇలా చేశారు. అయినప్పటికీ... అప్పట్లో ఎన్నికల కమిషన్ రూ.8 కోట్లకు పైగా నగదు పట్టుకుంది. ఆ డబ్బులు ఎవరిచ్చారు? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.? ఎన్నిసార్లు హైదరాబాద్ నుంచి తెచ్చారు? డబ్బులకు రక్షణగా ఎన్నిసార్లు వెళ్లారు? అని ఏఆర్ కానిస్టేబుల్ గిరిని సిట్ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. పలుమార్లు డబ్బులు తీసుకొచ్చినట్లు గన్‌మ్యాన్ అంగీకరించారు. అయితే.. ఒక్కో విడతలో ఎంత ఇచ్చారనే విషయం తెలిసేది కాదని చెప్పినట్లు సమాచారం.

మూడున్నర కోట్లు తెచ్చాం..

2019లో ఎంపీగా గెలిచి అత్యంత వివాదాస్పదంగా వ్యవహరించి, మళ్లీ ఎంపీగా బరిలో నిలిచిన వైసీపీ నేతకూ రాజ్ కసిరెడ్డి సిబ్బంది ద్వారా డబ్బులు అందాయి. ఎన్నికల సమయంలో తన ఖర్చుల కోసం ఒకసారి సూర్యాపేట వరకు వెళ్లి... రూ.3.50 కోట్లు పుచ్చుకున్నట్లు తెలిసింది. ఎంపీ స్టిక్కర్ ఉన్న వాహనంలో సొంత డ్రైవర్‌తో తానే స్వయంగా వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. ఆ డ్రైవర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆయన తొలుత నోరు విప్పలేదు. తాను ఏం చెప్పినా ప్రాణాలకు ముప్పు వస్తుందని వాపోయారు. నిజం చెబితే ఎలాంటి ఇబ్బంది ఉండదని, రక్షణ కల్పిస్తామని సిట్ అధికారులు భరోసా ఇవ్వడంతో... ఒక రోజు తాను మూడున్నర కోట్లు తెచ్చానని, పలుమార్లు వెళ్లి డబ్బులు తీసుకున్నప్పటికీ ఎంత అనేది తనకు తెలియదని చెప్పినట్లు సమాచారం.

> **రేపు కోర్టులో మెమో..**
>
> ఏఆర్ కానిస్టేబుల్ గిరి, రాజ్ కసిరెడ్డి డ్రైవర్ శ్రీకాంత్, మాజీ ఎంపీ డ్రైవర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా శుక్రవారం కోర్టులో సిట్ ఒక మెమో దాఖలు చేయబోతున్నట్లు తెలిసింది. నిందితుల జాబితాలో వైసీపీ ఎంపీ అభ్యర్థులను కూడా చేర్చి విచారణకు పిలిచే అవకాశముంది. ఈ దిశగా ఇప్పటికే సాంకేతిక ఆధారాలన్నీ సేకరించినట్లు సమాచారం.

రెండు రూపాల్లో ఎంబైపీసీ

> ఎలక్టివ్ సబ్జెక్టు లేదా అదనపు సబ్జెక్టు
>
> అదనపు సబ్జెక్టు పాసైతే అదనపు మార్కుల షీట్
>
> ఎలక్టివ్‌లో అన్నీ ఉత్తీర్ణత సాధించాలి
>
> 'అదనం'లో ఫెయిలైనా ఇంటర్ సర్టిఫికెట్ ఆగదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్‌లో కొత్తగా తీసుకొచ్చిన ఎంబైపీసీ కోర్సును విద్యార్థులు రెండు రూపాల్లో చదవొచ్చు. ఈ ఏడాది ఎంపీసీ, బైపీసీని కలిపి ఎంబైపీసీని తీసుకొచ్చారు. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్, మెడిసిన్ రెండిటిలో దేనినైనా ఎంపిక చేసుకునే వెసులుబాటును ఎంబైపీసీ కల్పిస్తుంది. అయితే ఎంబైపీసీ అని చెబుతున్నా సాంకేతికంగా ఎంబైపీసీ పేరుతో గ్రూపు ఉండదని ఇంటర్ బోర్డు స్పష్టం చేస్తోంది. సాంకేతికంగా ఎంబైపీసీ పేరు లేకపోయినా ఎంబైపీసీ చదివే అవకాశం మాత్రం కల్పించింది. ఈ ఏడాది నుంచి ఎంపీసీ, బైపీసీల్లోనూ ఐదు సబ్జెక్టులే ఉంటాయి. వాటిలో ఒకటి ఎలక్టివ్ సబ్జెక్టుగా ఉంటుంది. అంటే విద్యార్థులు కచ్చితంగా ఏదొక సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఈ క్రమంలో రెండు రూపాల్లో ఎంబైపీసీ చదవొచ్చు.

అదనపు సబ్జెక్టు పాసైతే అదనపు సర్టిఫికెట్

ఎంపీసీ, బైపీసీ గ్రూపుల విద్యార్థులందరికీ ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులుంటాయి. ఎంపీసీ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ తప్పనిసరి సబ్జెక్టులుగా ఉంటాయి. ఒకటి ఎలక్టివ్ సబ్జెక్టుగా ఉంటుంది. విద్యార్థులు భాషా, కోర్‌లో అందుబాటులో ఉన్న 24 సబ్జెక్టుల్లో ఏదో ఒక దానిని ఎలక్టివ్‌గా తీసుకోవచ్చు. ఎంపీసీ విద్యార్థులు బయాలజీని ఎలక్టివ్‌గా తీసుకుంటే అది ఎంబైపీసీ అవుతుంది. కానీ సర్టిఫికెట్ మాత్రం ఎంపీసీ పేరుతోనే వస్తుంది. అందులో బయాలజీ ఉంది కాబట్టి కావాలంటే మెడిసిన్ చదవొచ్చు. ఈ విధానంలో విద్యార్థి బయాలజీ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి. అదే బైపీసీ గ్రూపు తీసుకుంటే గణితం ఎలక్టివ్‌గా తీసుకోవచ్చు. అప్పుడు బైపీసీ సర్టిఫికెట్ జారీ అయినా కావాలంటే ఇంజనీరింగ్ వైపు వెళ్లొచ్చు. ఎలక్టివ్ సబ్జెక్టుగా భాషా, ఇతర సబ్జెక్టులు తీసుకుంటే ఎంబైపీసీకి మరో అవకాశం ఉంటుంది. ఐదు సబ్జెక్టులకు అదనంగా ఆరో సబ్జెక్టు కావాలంటే అదనంగా తీసుకుని చదవొచ్చు. ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు గణితంను అదనపు సబ్జెక్టుగా తీసుకోవచ్చు. ఎంపీసీ విద్యార్థులు బయాలజీ సబ్జెక్టు ఉత్తీర్ణత సాధిస్తే అదనపు మార్కుల మెమో ఇస్తారు. బైపీసీ విద్యార్థులు గణితం పాసైతే కూడా అదనపు మెమో జారీచేస్తారు. అదనపు సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఇంటర్ సర్టిఫికెట్ జారీ ఆగదు. ఇంటర్ పూర్తికి మొదటి ఐదు సబ్జెక్టులే ప్రామాణికం. అదనపు సబ్జెక్టు మార్కులు మొత్తం మార్కుల్లో కలపరు. విడిగా చూపిస్తారు. అదనపు మెమోతో విద్యార్థులు మెడిసిన్, ఇంజనీరింగ్‌లలో ఏదైనా చదవొచ్చు. కాగా, సాంకేతికంగా ఎంబైపీసీ గ్రూపు లేనందున కాలేజీలు ఆ గ్రూపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. దీనిపై తాజాగా ఒక వివరణ జారీ చేసింది. అదనపు సబ్జెక్టు కింద బయాలజీ, గణితం తీసుకునే విద్యార్థులు కావాలనుకుంటే నిర్దేశిత సమయం కంటే ముందు దాన్ని వదిలేయవచ్చని తెలిపింది. అదనపు సబ్జెక్టు ఉత్తీర్ణత తప్పనిసరి కాదని, ఎలక్టివ్ సబ్జెక్టు మాత్రం కచ్చితంగా ఉత్తీర్ణత సాధించాలని స్పష్టం చేసింది.

కియోస్క్‌తో టీటీడీ సేవలు సులువు..!

» ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 కియోస్క్‌ల ఏర్పాటు

» త్వరలోనే లడ్డూ సేవలు, టికెట్ల ప్రింట్‌కూ వినియోగం

» టీటీడీ సేవల్లో కీలకం కానున్న 'కియోస్క్' యంత్రాలు



తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో టీటీడీలో కియోస్క్ (సెల్ఫ్ ఆపరేటెడ్ మిషన్) యంత్రాలు కీలక పాత్ర పోషించనున్నాయి. కియోస్క్‌ల సాయంతో భక్తులకు టీటీడీ సేవలు సులభంగా అందుతున్నాయి. పైగా బోలెడంత సమయం ఆదా అవుతోంది. దీంతో ఈ కియోస్క్‌లను విరివిగా వినియోగించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు హుండీ ద్వారా కాకుండా విరాళాలు ఇవ్వాలంటే పెద్ద తతంగమే ఉండేది. రూ.లక్షకుపైగా విరాళాలు ఇవ్వాలంటే దాతల విభాగానికి చేరుకుని, అక్కడ అన్ని వివరాలూ తెలియజేసిన తర్వాతే విరాళాలు తీసుకునేవారు. రూ.లక్షలోపు విరాళాలకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ వివరాలు నమోదు చేయడం, కార్డు లేదా నగదుతో విరాళాలు చెల్లించడం వంటి ప్రక్రియతో భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో రూ.లక్షలోపు విరాళాలిచ్చే భక్తులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తొలిసారిగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈ కియోస్క్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు దీనిలోని క్యూఆర్ కోడ్‌ను తమ సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి యూపీఐ ద్వారా రూ.లక్షలోపు ఎంతైనా విరాళంగా అందించవచ్చు. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో టీటీడీ ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 కియోస్క్‌లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఇప్పటివరకు రూ.4 కోట్ల విరాళాలు రావడం గమనార్హం. ఇక టీటీడీ అందిస్తున్న మరికొన్ని సేవల్లోకి కియోస్క్‌లను ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే లడ్డూలు పొందే భక్తులకూ కియోస్క్‌లు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. లడ్డూ ఆప్షన్‌లోకి వెళ్లి కావాల్సిన లడ్డూ సంఖ్యను టైప్ చేసి యూపీఐ ద్వారా నగదు చెల్లిస్తే ఓ రసీదు వస్తుంది. ఆ రసీదును లడ్డూ కౌంటర్‌లో చూపించి లడ్డూలు పొందవచ్చు. తద్వారా భక్తుల నిరీక్షణ సమయం తగ్గుతుందని టీటీడీ భావిస్తోంది.

బ్రేక్ టికెట్ల ప్రింట్ కూడా తీసుకోవచ్చు

ఈ కియోస్క్‌లో వీఐపీ బ్రేక్ టికెట్లను కూడా సులభతరంగా పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉండే ఈ కియోస్క్ మిషన్‌లో బ్రేక్ దర్శన టికెట్ ఆప్షన్‌లోకి వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ నంబరును ఎంటర్ చేసి పేమెంట్ చేస్తే టికెట్ ప్రింట్ ఇస్తుంది. దీంతో భక్తులు వారు బస చేసే అతిథిగృహాలు, కాటేజీల్లోనే సులభంగా టికెట్లు పొందవచ్చు. ఇలా పలు విభాగాల్లోకి కియోస్క్‌లను ప్రవేశపెట్టి భక్తులకు సులభతరంగా సేవలు అందించాలని టీటీడీ ప్రణాళిక రూపొందిస్తోంది. ఇది భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

రాజ్ కసిరెడ్డి బెయిల్‌పై విచారణ రేపటికి వాయిదా

» బ్యారక్ మార్పునకు కోర్టు అనుమతి

» బెయిల్ కోసం ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పిటిషన్లు

» గ్రూపు 1 కేసులో మధుసూదన్‌కు రిమాండ్ పొడిగింపు



విజయవాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 6వ తేదీకి వాయిదా పడింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని విజయవాడ జిల్లా జైల్లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇన్‌చార్జి కోర్టుగా ఉన్న సీబీఐ కోర్టులో సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. ఇక రాజ్ కసిరెడ్డి బ్యారక్ మార్చేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. జైలులో తాను ఒంటరిగా ఉంటున్నానని, ఇతర ఖైదీలు ఉన్న బ్యారక్‌కు మార్చాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీబీఐ కోర్టు న్యాయాధికారి సీతారామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాజ్ కసిరెడ్డిని ఒక్కరు లేక ఇద్దరు ఖైదీలున్న బ్యారక్‌లోకి మార్చాలని జైలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్ రెడ్డి సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్‌లు దాఖలు చేశారు. మరో నిందితుడు బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సిట్ అధికారులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 6కి వాయిదా వేసింది. కాగా, ఏపీపీఎస్సీ గ్రూపు1 కేసులో ఏ2గా ఉన్న పమిడికాల్వ మధుసూదన్‌కు కోర్టు రిమాండ్ పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న మధుసూదన్‌ను పోలీసులు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం హాజరుపరిచారు. ఆయనకు ఈనెల 18వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి దేవిక ఉత్తర్వులు ఇచ్చారు. తనకు జైల్లో అనారోగ్యంగా ఉంటోందని, ఆసుపత్రికి తరలించాలని మధుసూదన్ న్యాయాధికారికి విజ్ఞప్తి చేయగా, జైలు అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఆమె చెప్పారు.

పీఎస్‌ఆర్‌కు వైద్య పరీక్షలు



విజయవాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్‌ఆర్ ఆంజనేయులుకు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కొద్దిరోజులుగా తనకు బీపీలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయని, మధ్యమధ్యలో కళ్లు తిరుగుతున్నాయని జైలు అధికారులకు చెబుతున్నారు. దీంతో పీఎస్‌ఆర్‌ను జైలు అధికారులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయనకు వైద్యులు బీపీ, ఈసీజీ, మధుమేహం పరీక్షలు చేశారు. కొద్దిసేపు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో పరిశీలనలో ఉంచారు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి జైలుకు తరలించారు.

అనంతలో కొవిడ్ కేసు

» 30 ఏళ్ల మహిళకు పాజిటివ్



అనంతపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో కొవిడ్ కేసు నమోదైంది. అనంతపురం నగరంలోని పాతూరుకు చెందిన 30 ఏళ్ల మహిళకు పాజిటివ్ వచ్చినట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. దగ్గు, ఆయాసం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న ఆమె చికిత్స కోసం బుధవారం జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు కొవిడ్ లక్షణాలు కనిపించడంతో వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్ రావడంతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో చేరాలని వైద్యులు సూచించారు. ఆమె నిరాకరించడంతో హోమ్ ఐసొలేషన్‌కు పంపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.